
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ



నేటి మీ కపిల్‌చిట్స్ తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం



: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-12-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 314 పేజీలు: 10+4 వెల: 6.50


# మహిళా సాధికారతే లక్ష్యం

**లక్ష మందిని మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం**

**డ్వాక్రా సంఘాలకు రెండు పథకాలు**

**ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, కల్యాణ లక్ష్మి పథకాలనూ అమలు చేస్తాం: సిఎం చంద్రబాబు**

**విజయవాడ, డిసెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో లక్ష మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సిఎం చంద్రబాబు వెల్లడించారు. పూర్తి స్థాయిలో ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను బలోపేతం చేశాం. డ్వాక్రా మహిళలు పెద్ద ఎత్తున డబ్బులను పొదుపు చేస్తున్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని తిరిగి పూర్తి స్థాయిలో చెల్లించేస్తున్నారు. డ్వాక్రా మహిళల్లో కేవలం 1 శాతం మాత్రమే ఎన్పీఎలు ఉన్నారంటే మహిళా శక్తి ఏంటో అర్థం చేసుకోండన్నారు.చాలా పరిశ్రమలు, చాలా మంది అప్పులు తీసుకుని ఎన్పీఎలుగా మారుతున్నారు. డ్వాక్రా సంఘాలు మాత్రం తీసుకున్న అప్పులను నిఖార్సుగా తిరిగి చెల్లిస్తున్నారు. లక్ష మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.'ఎక్స్' వేదికగా మహిళల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరించారు. మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేసే బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలి. ప్రతి ఎమ్మెల్యే 1000 మంది మహిళలను గుర్తించి పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేలా కృషి చేయాలన్నదే ప్రభుత్వం యోజన అన్నారు. మహిళా ఆర్థిక స్వావలంభన దిశగా కూటమి ప్రభుత్వం మరో అడుగు వేసిందన్నారు. డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల పిల్లల చదువుకు అండగా నిలిచేందుకు ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఆడబిడ్డల వివాహాలకు చేయూత నిచ్చేలా ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి పథకాలను అమల్లోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ రెండు పథకాల కింద గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ (సెర్ప్) పరిధిలోని స్త్రీనిధి బ్యాంకు ద్వారా రూ.లక్ష వరకు పావలా వడ్డీకి రుణంగా ఇస్తారన్నారు.



ఇందుకు ఇప్పటికే కార్యచరణ ప్రారంభించామన్నారు. గత వారంలోనే ఈ పథకాల్ని ప్రారంభించాల్సి ఉండగా, అనివార్య కారణాలతో వాయిదా పడింది. మరో పది రోజుల్లో ఈ పథకాలు అమల్లోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇక గరిష్ఠంగా ఇద్దరు పిల్లల చదువులకు ఎన్టీఆర్ విద్యాలక్ష్మి పథకం వర్తిస్తుంది. రూ.10 వేలనుంచి రూ.లక్షవరకు రుణసాయం అందిస్తారు. పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలకు చెల్లించాల్సిన ఫీజుకు అనుగుణంగా అవసరమైన మొత్తాన్ని తీసుకోవచ్చు. దీనికోసం పావలా వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. తీసుకున్న మొత్తానికి అనుగుణంగా చెల్లింపు వాయిదాల సంఖ్య నిర్ణయి >>2



ఆదివారం న్యూఢిల్లీలోని రామలీలా మైదాన్‌లో జరిగిన బహిరంగసభలో కాంగ్రెస్ అగ్రనేతలు, ఖర్గే, రాహుల్ సోనియా

**ఢిల్లీ రామ్‌లీలా మైదాన్ మహార్యాలీలో కాంగ్రెస్ నేతల గర్జన**

**బిజెపితో కుమ్మక్కవుతున్న ఇసి: రాహుల్**

**సత్యవాక్కులతోనే అవినీతి సర్కార్‌కు చరమగీతం: ఖర్గే**

## ఓటు చోరులను గద్దె దించుతాం

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** దేశంలో రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాల్సిన ఎన్నికల సంఘం బిజెపికి పనిచేస్తోందని, అధికార పార్టీతో కుమ్మక్కవుతోందని ఎఐసిసి నాయకుడు రాయ్‌బరేలి ఎంపి రాహుల్ గాంధీ ఆరోపించారు. ఓటర్ల జాబితాలో భారీ ఎత్తున బిజెపి అవకతవకలకు పాల్పడుతున్నా ఎన్నికల సంఘం పట్టించుకోవడంలేదని, ఆపార్టీ అవకతవకలన్నింటికీ గొడుగుపడుతోందని ఆరోపించారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్‌కుమార్, ఇతర ఎన్నికల కమిషనర్లు సుక్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషిలు కూడా బిజెపికోసమే పనిచేస్తున్నారని విమర్శించారు. వోట్‌చోర్ గద్దీఛోడ్‌నినాదంతో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన రామ్‌లీలామైదాన్ ర్యాలీలో ఎసిసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే ఇతర కాంగ్రెస్ సీనియర్లతోపాటు రాహుల్ పాల్గొని ఎన్డియె ప్రభుత్వంపై విమర్శలు సంధించారు. ర్యాలీ సభలో రాహుల్‌తోపాటుప్రియాంక గాంధీ వాద్రా, కెసి వేణుగోపాల్, జైరామ్‌రమేష్, సచిన్‌పైలట్ ఇతర సీనియర్ నాయకులు పాల్గొనగా వేలాదిగా మద్దతుదారులు, కార్యకర్తలు పాల్గొ >>2

# పర్యాటక ఆస్తుల లీజుపై ప్రత్యేక కమిటీ

## ప్రైవేటుకు పలు ఆస్తుల నిర్వహణ

**విజయవాడ, డిసెంబరు 14, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర పర్యాటకభివృద్ధి సంస్థకు చెందిన 22 హోటళ్లు, రిసార్టులు, ఇతర ఆస్థుల లీజుకు బిడ్‌ల మదింపు కోసం ప్రత్యేక కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండి ఈ కమిటీకి చైర్మన్‌గా రాష్ట్ర పర్యాటక సంస్థ సిఇఒ కో-చైర్మన్‌గా ఉంటారు. పర్యాటకాభివృద్ధి సంస్థ ఇడిని కన్వీనర్‌గా మరో ఐదుగురిని సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన ఆస్థుల నిర్వహణను లీజుపై ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.విశాఖలోని మధురవాడలో మెగ్లాన్ లీజర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థకు ఐదెకరాల భూమితో పాటు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకే ఉత్తర్వులిచ్చింది. ఈ సంస్థ రూ.348.12 >>2



**బిజెపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా**

## నితిన్ నబీన్

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** భారతీయ జనతాపార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బీహార్‌మంత్రి నితిన్ నబీన్‌ను హైకమాండ్ నియమించింది. బిజెపి పార్లమెంటరీ బోర్డు ఈమేరకు >>2

# ప్రజాస్వామ్య విలువలకు ప్రతీక వాజ్‌పేయి

## దేశాన్ని సరైన దిశలో నడిపిన పిఎం: ఉత్తరాఖండ్ సిఎం పుష్కరసింగ్ ధామి

**మదనపల్లె, డిసెంబరు 14 ప్రభాతవార్త:** దేశ రాజకీయాల్లో అటల్ బిహారీ వాజ్‌పేయి దూరదృష్టిగల పాలకునిగా, ప్రజాస్వామ్య విలువల ప్రతీకగా నిలిచారని ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్‌సింగ్‌ధామి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఆదివారం నిర్వహించిన భారతరత్న మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణకు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరై విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం టిప్పుసుల్తాన్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ అటల్‌జీ జీవితం దేశభక్తి, మానవీయ విలువలకు ప్రతిరూపమన్నారు. ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి కాని దేశం నిలబడాలి అనే అటల్‌జీ మాటలు యావత్తు భారతదేశానికి మార్గదర్శకం అన్నారు. ప్రధాన మంత్రిగా వాజ్‌పేయి దేశాన్ని >>2



ఆదివారం మదనపల్లెలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్‌సింగ్ ధామి


MARUTI SUZUKI ARENA

ధన్యవాదాలు భారతదేశం!
ఇప్పుడు మా సంఖ్య 3 కోట్లకు చేరుకుంది ఇంకా నిరంతరంగా పెరుగుతోంది.
ప్రత్యేక ఆఫర్లతో కలిసి జరుపుకుందాం!




EFFECTIVE PRICE OF ₹3.17 LAKH
EFFECTIVE PRICE OF ₹2.97 LAKH
EFFECTIVE PRICE OF ₹4.35 LAKH
EFFECTIVE PRICE OF ₹4.12 LAKH

ARENA SAFETY SHIELD
Offers Valid Till Stocks Last
SCAN TO CONNECT TO SHOWROOM NEAR YOU
E-BOOK TODAY AT WWW.MARUTISUZUKI.COM
Contact us at 1800-102-1800

Terms and conditions apply. Please contact your nearest dealership for details. Features, accessories, and specifications may vary by variant and are subject to change without prior notice. Images are for illustration purposes only. Offers and prices may differ by variant, model, location, and city, and are subject to change or withdrawal without notice. Offer values represent the maximum applicable benefits and include consumer, exchange, and institutional/fleet offers (where applicable) on select models. The effective price for Alto K10 of ₹3.17 Lakh has been calculated after deducting the applicable consumer offer of ₹25 000, exchange/scrappage bonus of ₹25 000, and rural/ISL offer of ₹2 500 from the ex-showroom price of ₹3.69 Lakh. The effective price for S-presso of ₹2.97 Lakh has been calculated after deducting the applicable consumer offer of ₹25 000, exchange/scrappage bonus of ₹25 000, and rural/ISL offer of ₹2 500 from the ex-showroom price of ₹3.49 Lakh. The effective price for WagonR of ₹4.35 Lakh has been calculated after deducting the applicable consumer offer of ₹35 000, exchange/scrappage bonus of ₹25 000, and rural/ISL offer of ₹3 100 from the ex-showroom price of ₹4.98 Lakh. The effective price for Celerio of ₹4.12 Lakh has been calculated after deducting the applicable consumer offer of ₹30 000, exchange/scrappage bonus of ₹25 000, and rural/ISL offer of ₹2 500 from the ex-showroom price of ₹4.69 Lakh. 3 Crore sales is for entire Maruti Suzuki portfolio.



ముంబయిలో 'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్' అవార్డును అందుకుంటున్న నారా బ్రహ్మణి

# కేంద్ర సమాచార కమిషనర్‌గా సుధారాణి రేలంగి

**విజయవాడ, డిసెంబరు14,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర సమాచార కమిషనర్‌గా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుధారాణి రేలంగి నియమితులయ్యారు. ప్రస్తుతం పెట్రోలియం సహజవాయువుల రెగ్యులేటరీ బోర్డు సభ్యురాలిగా ఉన్న ఆమెను సమాచార కమిషనర్‌గా నియమిస్తూ నియమిస్తూ ప్రధానమంత్రి అధ్వర్యంలోని నియామక కమిటీ సిఫార్సు చేసింది. ఇండియన్ లీగల్ సర్వీస్ అధికారి అయిన ఈమెకు లా ఎన్‌ఫోర్స్‌మెంట్ లెజిస్లేటివ్ డ్రాఫ్టింగ్,ప్రాసిక్యూషన్,ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ విభాగంలో 35 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉంది. ఇది వరకు సిబిఐలో ప్రాసిక్యూషన్ డైరెక్టర్‌గా,కేంద్ర న్యాయశాఖలో జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్‌లో జడ్జి అటార్నీ జనరల్‌గానూ సేవలందించారు. ఈమె స్వస్థలం ఏలూరు. పాఠశాల విద్య నుంచి డిగ్రీ వరకు ఏలూరులోని సెయింట్ థెరిస్సా విద్యాలయంలో చదివారు. సిఆర్ఆర్ కళాశాలలో లా డిగ్రీ పూర్తి చేశారు. లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అండ్ ఫైనాన్స్ నుంచి ఇంటర్నేషనల్ బిజినెస్‌లాలో ఎల్ఎల్ఎం చేశారు. 2003 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ఆ తర్వాత ఇండియన్ లీగల్ సర్వీస్‌కు ఎంపికయ్యారు. తెలుగువారైన ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ 2013 నవంబరు నుంచి 2018 నవంబరు వరకు కేంద్ర సమాచార కమిషనర్‌గా సేవలందించారు. ఆ తర్వాత ఇప్పుడు సుధారాణి రేలంగి నియమితులయ్యారు.



ఆదివారం విజయనగరంలో అశోక్ గజపతిరాజుని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

# నారా బ్రహ్మణికి మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్ అవార్డు

**విజయవాడ,డిసెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** మంత్రి నారా లోకేష్ సతీమణి, హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రహ్మణి అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. ప్రముఖ వ్యాపార మ్యాగజైన్ బిజినెస్ టుడే ఏటా ప్రకటించే మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్ పురస్కారం ఆమెను వరించింది. వ్యాపార రంగంలో మహిళల నాయకత్వ పటిమను, సంస్థల అభివృద్ధిలో వారి పాత్రను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేస్తారు. హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ విస్తరణ, బ్రాండ్ విలువను పెంచడం, రైతులతో అనుసంధానం కావడం వంటి అంశాల్లో బ్రహ్మణి తనదైన ముద్ర వేశారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంటూ, ఆధునిక సాంకేతికతను జోడిస్తూ సంస్థ పురోగతిలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ కృషికి గుర్తింపుగానే ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కింది.

## భర్తగా గర్వపడుతున్నానన్న మంత్రి లోకేష్

ఈ విజయంపై మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా తన భార్యను అభినందిస్తూ పోస్ట్ పెట్టారు. "భర్తగా గర్విస్తున్నాను. మాటల కన్నా పనితోనే సమాధానం చెప్పడం, నిశ్శబ్దంగా సంస్థలను నిర్మించడం బ్రాహ్మణి నాయకత్వ పటిమకు నిదర్శనం" అని ఆయన ప్రశంసించారు. కుటుంబ, వ్యాపార బాధ్యతలను సమర్థంగా సమన్వయం చేస్తూ నారా బ్రహ్మణి ఎందరో మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పురస్కారం ఆమె వ్యక్తిగత విజయమే కాకుండా, హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేసింది.

# మేయర్ పదవికి రాజీనామా చేసిన పొట్లూరి స్రవంతి

**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** నెల్లూరు నగర కార్పొరేషన్‌లో శనివారం నగర మేయర్ పొట్లూరి స్రవంతి మీడియా సమావేశం నిర్వహించి రాజీనామాకు సంబంధించి మేయర్ స్రవంతి ప్రకటన చేశారు. అధికారికంగా ఆదివారం జిల్లా కలెక్టర్‌ని కలిసి రాజీనామా పత్రాన్ని అందిస్తానని మేయర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషను మేయర్ రాజీనామా లేఖను కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అందించిన స్రవంతి జయవర్ధన్ తరుపున ప్రతినిధి. ఈ మేరకు కలెక్టర్ క్యాంప్ కార్యాలయ డిటి హాజరత్‌కు రాజీనామా లేఖ అందించారు.

# పదవికే వన్నె తెచ్చిన మహనీయుడు అశోక్ గజపతి రాజు

## ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

**విజయనగరం, డిసెంబరు 14 (ప్రభాతవార్త ప్రతినిధి):** కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ వేత్త గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు పదవికే వన్నె తెచ్చిన మహనీయుడని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కొనియాడారు. అశోక్ గజపతి రాజు గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన నేపథ్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో ఆయనకు 'ఆత్మీయ సత్కార సభ'ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు క్షత్రియ పరిషత్ సభ్యులు హాజరై అశోక్ గజపతి రాజుని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ అశోక్ గజపతి రాజు తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో విలువలకు, విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచారని కొనియాడారు. గోవా గవర్నర్‌గా ఆయన ఎంపిక కావడం తెలుగు వారందరికీ గర్వకారణమన్నారు. పదవి ఆయనకు అలంకారం కాదని, ఆయనే ఆ పదవికి అలంకారమని రఘురాజు వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య విలువల పట్ల ఆయనకున్న నిబద్ధత గవర్నర్ వ్యవస్థకు మరింత గౌరవాన్ని తెస్తుందని రఘురాజు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం శాసన సభ్యురాలు పూసపాటి అదితి గజపతి రాజు, క్షత్రియ పరిషత్ ప్రతినిధులు ఐవిపి రాజు, శివాజీ రాజు, విజయనగరానికి చెందిన పలువురు ముఖ్యులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే లక్ష్యం

>> స్తారు. గరిష్ఠంగా 48 వాయిదాల్లో మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. అడ్మిషన్ లెటర్, ఫీజు చెల్లింపు విధానం, ఇన్‌స్టిట్యూట్ వివరాలు, రసీదును సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో సభ్యురాలి బ్యాంకు ఖాతాలో నేరుగా నగదు జమ చేస్తారు. ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి పథకానికి కూడా కొన్ని నిబంధనలు ఉన్నాయి. డ్వాక్రా సభ్యురాలి కుమార్తె వివాహానికి ఈ పథకం వర్తిస్తుంది. అవసరానికి అనుగుణంగా 10 వేల నుంచి లక్ష వరకు రుణంగా తీసుకునే వెసులుబాటుఉంది. దీనికికూడా పావలా వడ్డీయే చెల్లించాల్సి ఉంటుంది. తీసుకున్న మొత్తానికి అనుగుణంగా చెల్లింపు వాయిదాల సంఖ్య ఉంటుంది. గరిష్ఠంగా 48 వాయిదాల్లో చెల్లించాలి. పెళ్లి పత్రిక, ఈవెంట్ నిర్వహణకు సంబంధించిన పత్రం, పెళ్లి ఖర్చు అంచనా వ్యయం పత్రాలను సమర్పించాలి. వివాహానికి సంబంధించిన వివరాల పరిశీలన అనంతరం నేరుగా సభ్యురాలి బ్యాంకు ఖాతాలో నగదు జమచేస్తారు. ఈ పథకాల అమలు ద్వారా పావలా వడ్డీ కింద వచ్చే ఆదాయంలో 50 శాతాన్ని తిరిగి డ్వాక్రా సంఘాలకు ఊపిరిగా ఉన్న మండల సమాఖ్యలు, గ్రామ సమాఖ్యల బలోపేతం చేసేందుకు వినియోగించనున్నారు. మిగతా 50 మొత్తాన్ని 'స్త్రీనిధి' ఉద్యోగుల ప్రయోజనాలకు ఉపయోగించనున్నారు. ఈ పథకాల కింద రుణసాయం పొందిన తర్వాత సదరు సభ్యురాలు ప్రమాదంలో చనిపోతే, ఆ రుణ మొత్తాన్ని మాఫీ చేస్తారు మరో పక్క డ్వాక్రా మహిళల పిల్లల చదువులకు భరోసానిచ్చేలా కూటమి ప్రభుత్వం కొత్త పథకానికి రూపకల్పన చేసింది. పిల్లల విద్యావికాసానికి దోహదపడేందుకు 4శాతం వడ్డీకే రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. పథకానికి ఎన్టీఆర్ విద్యా సంకల్పంగా నామకరణం చేసిన ప్రభుత్వం ఏటా 200 కోట్లు ఖర్చు చేసేలా ప్రతిపాదనలను సిద్ధం చేసింది.

డ్వాక్రా మహిళలకు చేయూతనిచ్చేలా కూటమి ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. వాళ్ల పిల్లల చదువులకు చేయూతనిచ్చేలా 4 శాతం అంటే 35 పైసల వడ్డీకే రుణాలు అందించేలా కొత్త పథకానికి రూపకల్పన సిద్ధం చేసింది. ఈ పథకం కింద గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటిసెర్ప్ పరిధిలోని స్త్రీనిధి బ్యాంకు ద్వారా 10వేల నుంచి లక్ష రూపాయల వరకు రుణం అందించనున్నారు. స్త్రీనిధి నుంచి రుణంగా తీసుకునే మొత్తాన్ని పిల్లల చదువుకే వినియోగించాలి. వారి ఫీజుచెల్లింపులు, పుస్తకాలు, యూనిఫామ్ వంటి వాటి కొనుగోలుకు వెచ్చించవచ్చు. సాంకేతికవిద్యలో అవసరాలకు ఖర్చు చేసేందుకు అవకాశం ఉంటుంది. నివాస ప్రాంతం నుంచి దూరంగా ఉండే పాఠశాలలకు వెళ్లేందుకు సైకిళ్ల కొనుగోలుకు అనుమతిస్తారు. రుణం మొత్తాన్ని ఎందుకోసం వినియోగించామో సంబంధిత రశీదును స్త్రీనిధి అధికారులకు అందించాలి. రుణ మొత్తాన్ని వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. తీసుకున్న మొత్తానికి అనుగుణంగా కనిష్ఠంగా 24 నెలల నుంచి 36 నెలల వరకు చెల్లించే వెసులుబాటు కల్పిస్తారు.

2027 డిసెంబరు నాటికి పోలవరం పూర్తి చేస్తాం. కియా ఫ్యాక్టరీ కోసం గొల్లపల్లి రిజర్వాయరును ఒక్క ఏడాదిలో పూర్తి చేసి నీరిచ్చాం. హంద్రీనీవా ప్రాజెక్టు కాల్వల విస్తరణ పనులు కేవలం 100 రోజుల్లో పూర్తి చేసి నీరు ఇచ్చాం" అని సిఎం అన్నారు. అమరావతిలో మొత్తం ప్రైవేట్ భూములే. హైటెక్ సిటి రాకముందు హైదరాబాద్‌లో ఎకరం రూ. 1 లక్ష ఉండేది...ఇప్పుడు రూ.100 కోట్లకు చేరింది. పరిశ్రమలు, రహదారుల లాంటి అభివృద్ధి జరిగితే భూమి విలువ పెరుగుతుంది. అమరావతి రైతుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగదు. హైదరాబాద్ తరహాలో అమరావతి కూడా గుంటూరువిజయవాడ తెనాలి తదితర ప్రాంతాలు కలిసి మహానగరంగా రూపొందుతుంది. అమరావతిలో 2026 జనవరికి క్వాంటం వ్యాలీ అందుబాటులోకి వస్తుంది. ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్‌కు అవసరమైన అనుబంధ సంస్థలు పెట్టుబడులతో ముందుకు వచ్చాయి. అలాగే జాతీయ, అంతర్జాతీయ ప్రముఖ విద్యా సంస్థలు కొన్ని ఉన్నాయి. మరికొన్ని రాబోతున్నాయి" అని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం విజన్ కల్పన చేయటంతో పాటు దాన్ని సుసాధ్యం చేసే దిశగా పనిచేయాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. భవిష్యత్ తరాల కోసమే విజన్‌ను రూపొందించి అమలు చేస్తున్నామని.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఇది తన బాధ్యత అని స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో వికసిత్ భారత్ 2047 అమలు చేస్తుంటే రాష్ట్రంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ సిద్ధం చేసి అమలు చేస్తున్నామని వెల్లడించారు. వచ్చే 22 ఏళ్లలో మన రాష్ట్రం ఎక్కడ ఉండాలన్న అంశాన్ని నిర్దేశించేందుకే విజన్ రూపొందించి అమలు చేస్తున్నట్టు వివరించారు. 'రాష్ట్రంలోని స్టేక్ హోల్డర్లను భాగస్వాములను చేస్తూ ఈ తరహా కాంక్లేవ్ నిర్వహించడం మంచి పరిణామం. 25 ఏళ్ల క్రితం భారతీయులకు సరైన గుర్తింపు లేని సమయంలో తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి భారతదేశం అభివృద్ధి అన్‌స్టాపబుల్‌గా మారింది. 2038 నాటికి భారత దేశం నెంబర్1 అవుతుందన్నారు.

# నితిన్ నబీన్

>> నిర్ణయం ప్రకటించింది. వెంటనే అమలులోకి వస్తుందని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఉత్తర్వులు జారీచేసారు. బీహార్‌లోని బాంకీపూర్ అసెంబ్లీ స్థానంనుంచి నితిన్‌నబీన్ వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రహదారుల శాఖమంత్రిగా కొనసాగారు.

బిజెపి ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జెపినడ్డా 2020 జనవరిలో ఈపదవిలో నియమితులయినా ఇప్పటికే ఆయన పదవీకాలం ముగిసినప్పటికీ పొడిగిస్తూ వచ్చింది. కాగా నితిన్ నబీన్‌కు ప్రధానిమోడీ శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి పనిచేసే కార్యకర్తగా నబీన్ గుర్తింపుపొందారని, ఆయనకు సంస్థాగత అనుభవం అపారంగా ఉందని, బీహార్ ఎమ్మెల్యేగా మంచి రికార్డుసాధించారని ప్రశంసించారు. ఆయన పనితీరు రానున్న కాలంలో బిజెపిని మరింత బలోపేతంచేస్తుందన్న నమ్మకం ఉందని మోడీ ఆకాంక్షించారు.

# నేడు శంషాబాద్‌లోని కన్హా శాంతివనానికి సిఎం చంద్రబాబు

### శాంతి వనం అధ్యక్షుడు దాజీతో భేటీ కానున్న ముఖ్యమంత్రి..

### సాయంత్రం విజయవాడలో అమరజీవి ఆత్మార్పణ దినం కార్యక్రమానికి సిఎం హాజరు

**విజయవాడ, డిసెంబరు 14, ప్రభాతవార్తప్రతినిధి:** హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ మండలంలో ఉన్న కన్హా శాంతి వనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు సందర్శించనున్నారు. రేపు ఉదయం జూబ్లిహిల్స్‌లోని ఆయన నివాసం నుంచి బయల్దేరి వెళ్లనున్న సిఎం 11 గంటలకు కన్హా శాంతివనం చేరుకోనున్నారు. ఆశ్రమం అధ్యక్షులు కమలేష్ డి.పటేల్ దాజీతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. రెండు గంటల పాటు శాంతివనంలోని వెల్‌నెస్, మెడిటేషన్ సెంటర్ సహా, యోగా కేంద్రాలను ముఖ్యమంత్రి తిలకించనున్నారు. ట్రీ కన్జర్వేషన్ సెంటర్, రెయిన్ ఫారెస్ట్ కేంద్రం, మెడిటేషన్ సెంటర్, బయోచార్ కేంద్రం, పుల్లెల గోపీచంద్ స్టేడియంతో పాటు హార్ట్‌ఫుల్ నెస్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను సిఎం సందర్శిస్తారు. అనంతరం శాంతివనం వ్యవస్థాపకులు దాజీ నివాసానికి వెళ్లనున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో మొత్తం 1400 ఎకరాల్లో కన్హా శాంతి వనాన్ని శ్రీరామచంద్ర మిషన్ అభివృద్ధి చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద మెడిటేషన్ సెంటర్‌ను ఈ ఆశ్రమం కలిగి ఉంది. 8 లక్షలకు పైగా వివిధ జాతుల వృక్షాలతో బయోడైవర్సిటీ కేంద్రంగా ఈ ఆశ్రమం పెద్దఎత్తున పర్యాటకుల్ని ఆకర్షిస్తోంది. మానవ వనరుల్ని గ్లోబల్ లీడర్లుగా తయారు చేసేందుకు ఈ ఆశ్రమం అధ్యక్షులు దాజీ నేతృత్వంలో హార్ట్ ఫుల్ నెస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లీడర్షిప్ ఈ ఆశ్రమం నిర్వహిస్తోంది. కౌశలం పేరిట శిక్షణా కార్యక్రమాలను చేపడుతోంది. కన్హా శాంతివనంలోని యోగా, మెడిటేషన్, వెల్ నెస్ సెంటర్లతో పాటు సుస్థిర వ్యవసాయ క్షేత్రాన్నిను కూడా ముఖ్యమంత్రి సందర్శించనున్నారు. అనంతరం ఆయన హెలికాప్టర్లో బయల్దేరి అమరావతికి తిరిగి రానున్నారు. మద్యాహ్నం సచివాలయంలో అధికారులతో వేర్వేరు సమీక్షల్లో పాల్గొనున్నారు. రేపు సాయంత్రం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణదినం కార్యక్రమానికి హాజరు కానున్నారు.

## వారం - వర్జ్యం

15-12-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
ఏకాదశి రా.9.21
చిత్త ఉ.11.09, మూల కార్తె
వర్జ్యం : సా.5.27-7.15
దు.మ.12.26-1.11,
2) మ.2.40-3.25
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** స్థిరాస్తులను కోనుగోలు చేసే ఆలోచనలు ఫలిస్తాయి. వచ్చిన ధనమును పొదుపు చేయుటకు ప్రయత్నిస్తారు.

**వృషభం:** ఖర్చులను తగ్గించు విషయ ములో పూర్తిగా వైఫల్యమును పొందుతారు. సోదరి కలయిక.సంఘంలో ప్రత్యేక గౌరవం పొందుతారు.

**మిథునం:** కొన్ని దుబారా ఖర్చులు రహస్య ఋణములు, దానములు తప్పవు. విలువైన సమాచారం వింటారు.కాంట్రాక్టులు లాభిస్తాయి.

**కర్కాటకం:**కరస్పాండెన్స్‌లు, సాంస్కృతిక కార్యక్రమములు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మందుల వ్యాపారము అనుకూలం.

**సింహం:**ఆర్థికవరమైన అంశాలు కొంతమేర ఆశాజనకంగా ఉంటాయి. వివాహయత్నాలు ముమ్మరంచేస్తారు.

**కన్య :** మీకు న్యాయం చేయవలసిన వారు సంపూర్ణంగా న్యాయం చేయరు. వృత్తి లోకొన్ని అనుకోని మార్పులు.

**తుల :** కోర్టు సంబంధించిన భూవివాదాలు, స్థిరాస్తులకు సంబంధించిన వివాదాలు ఒక పరిష్కార దశకు చేరుకుంటాయి.

**వృశ్చికం:**కళా, సాంస్కృతిక, ఉద్యోగ రంగాలలోని వారికి పోటీ ఎదురవుతుంది. కళాత్మక వస్తువులను కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు:** ఒకరి జీవితానికి ఆధారం కల్పించి మనశ్శాంతి పొందుతారు. ఆరోగ్య పరంగా జాగ్రత్తలు పాటించాలి.

**మకరం:** ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైలు మీద అధికార ఆమోద ముద్రలు పడుతాయి. క్రయ విక్రయాలలో లాభాలు.

**కుంభం:** వస్తు భద్రతకు ప్రాముఖ్యం ఇస్తారు. ఇతర భాషల పట్ల విదేశాల పట్ల ఆకర్షణ కలుగుతుంది. వస్త్ర లాభం.

**మీనం :** వృత్తి విషయములో కొంత ఓర్పును పాటించుట అవసరం. కార్యాచరణ కోసం యోచనచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అమరావతిలో రూ.165 కోట్లతో జ్యుడీషియల్ అకాడమీ భవనం

**విజయవాడ,డిసెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీకి రాజధాని అమరావతిలో రూ.165 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక జి+5 భవనాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం విజయవాడ-గుంటూరు మధ్య కాజ వద్ద అద్దె భవనంలో నడుస్తున్న జ్యుడీషియల్ అకాడమీకి సీఆర్‌డీఏ పిచ్చుకలపాలెం వద్ద 4.83 ఎకరాల స్థలాన్ని 60 ఏళ్ళ లీజుకు కేటాయించింది. అక్కడ భవనాన్ని కూడా సీఆర్డీఏనే నిర్ మించనుంది. ఈ ప్రాంతం హైకోర్టుకు సుమారు...3 కి.మీ దూరంలో ఉంది. ఈ భవన నిర్మాణానికి సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఇటీవల ఆమోదం లభించింది. జ్యుడీషియల్ అకాడమీ హైకోర్టు అధ్వర్యంలో పనిచేసే శిక్షణ సంస్థ...న్యాయమూర్తులు, న్యాయాధికారులు,కోర్టుల సిబ్బందికి నైపుణ్యాల పెంపు,కోర్టు మేనేజ్‌మెంట్,న్యాయ విజ్ఞానంలో ఇక్కడ శిక్షణ ఇస్తారు.కొత్తగా సర్వీసులో చేసిన జడ్జిలతో పాటు ఇప్పటికే సర్వీసులో ఉన్న వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఉంటుంది.ఏపీ జ్యుడీషియల్ అకాడమీకి రాజధానిలో అత్యాధునిక క్యాంపస్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. ఎకడమిక్ బ్లాక్,నివాస సదుపాయాలు,డిజిటల్ క్లాస్‌రూంలు, ఆడిటోరియం, సమావేశ మందిరాలు, క్రీడలు, వినోద సదుపాయాలు, కెఫెటేరియా వంటివి ఉంటాయి. దానిలో భాగంగటానే ఇప్పుడు భవన నిర్మాణం చేపడుతున్నారు.

# నేడు ఢిల్లీకి మంత్రి లోకేష్

**విజయవాడ, డిసెంబరు 14, ప్రభాతవార్తప్రతినిధి:** మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ సోమవారం ఢిల్లీ వెళ్తున్నారు,ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను నారా లోకేష్ కలవనున్నారు. విద్యా, ఐటీసంబంధిత అంశాలపై చర్చలు జరుపుతారు. జనవరిలో అమరావతిలో క్వాంటం కంప్యూటర్స్ ఏర్పాటు అంశంపై ఆయన కేంద్ర మంత్రులతో కీలకంగా చర్చించనున్నట్లు సమాచారం.రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధుల విడుదలపైన ఆయన కేంద్రమంత్రులతో చర్చలు జరుపుతారు..ఈ నెల 16న ఢిల్లీనుంచి విశాఖకు నారా లోకేష్ వస్తారు. అక్కడ జిఎంఆర్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రారంభోత్సవంలో లోకేష్ పాల్గొననున్నారు.

## ప్రత్యేక కమిటీ

>> కోట్లతో ఫైవ్‌స్టార్ హోటల్‌ను నిర్మించనుంది. విశాఖలోని ఎండాడలో పివిఆర్ హాస్పిటాలిటీస్ అధ్వర్యంలో ఫైవ్‌స్టార్ హోటల్‌నిర్మాణానికి మూడెకరాలతో పాటు రాయితీలు ఇవ్వనుంది. బాపట్ల మండలం పాండురంగాపురం బీచ్‌లో యాగంటి ఎస్టేట్స్,ఫైవ్‌స్టార్ బీచ్‌రిసార్టు ఏర్పాటుకు రాయితీలు ఇచ్చింది. తిరుపతిలో నాంది సంస్థకు 4 స్టార్‌హోటల్ నిర్మాణంకోసం రాయితీలు ఇవ్వాలని వేర్వేరు జీఓల్లో ఆదేశాలిచ్చింది.

# విలువలకు ప్రతీక వాజ్‌పేయి

>> శక్తివంతమైన దిశలో నడిపారన్నారు. అణుపరీక్షలు, రహదారి, ప్రాజెక్టులు, గ్రామీణ రహదారులు, టెలికాం విప్లవం వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో దేశ అభివృద్ధికి పునాదులు వేశారన్నారు. అటల్‌జీ ఆశయాలకు అనుగుణంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. స్టార్టప్ ఇండియా, మేక్ ఇండియా, ఓకల్‌ఫర్ లోకల్, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా భారతదేశం స్వావలంభన దిశగా ముందుకు వెలుతుందన్నారు. ప్రపంచంలో భారతదేశం నాల్గవ ఆర్థికశక్తిగా రూపొందుతుందన్నారు. కోవిడ్ సమయంలో స్వదేశీ వ్యాక్సిన్ ఉత్పత్తి ప్రపంచస్థాయికి మౌలిక సదుపాయాలు, నిర్మాణం మోడీ దూరదృష్టికి నిదర్శనమన్నారు. అయోధ్యలో రామమందిర్ నిర్మాణం, కాశీకారిడార్, ఉజ్జెనిలో మహాకాల్‌లోక్ వంటి అధ్యాత్మిక అభివృద్ధి కార్యక్రమాలు దేశ సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి చాటుతున్నాయన్నారు. ఆర్టికల్ 370రద్దు, త్రిపుల్ తలాకా రద్దు, పౌరసత్వ సవరణ చట్టం వంటి నిర్ణయాలతో ఒక భారత్ శ్రేష్ట భారత్ భావనను బలోపేతం చేశాయన్నారు. రాష్ట్రంలో సిఎం చంద్రబాబునాయుడు, డి.సిఎం పవన్‌కల్యాణ్ నాయకత్వంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. అనంతరం వైద్యఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ అటల్‌బిహారి వాజ్‌పేయి అభివృద్ధి సంక్షేమం, జాతీయభద్రతకు పునాదులు వేసిన మహానేత అని కొనియాడారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు తిరిగి ప్రజాసమస్యలు తెలుసుకొని దేశాభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. రాష్ట్ర అధ్యక్షులు టివిఎన్ మాదవ్ మాట్లాడుతూ మాజీ ప్రధాని అటల్‌బిహారి వాజ్‌పాయి ప్రజాజీవితం, దేశభక్తి, ఆదర్శ రాజకీయ విలువలను స్మరించుకొన్నారు. దేశాభివృద్ధికి ఆయన ఎంతో సేవ చేశారని కొనియాడారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, మండలి ఉపసభాపతి జకియాఖాన్, 20సూత్రాల కమిటీ ఛైర్మెన్ లంక దినకర్‌లు మాట్లాడుతూ వాజ్‌పాయ్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రధానమంత్రి నరేంద్రమోడీ 11సంవత్సరాలుగా దేశాన్ని సంక్షేమం, అభివృద్ధి రెండింటిని సమన్వయం చేస్తూ ముందుకు నడిపిస్తున్నారన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్, రైల్వేకోడూరు, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, బిజెపి జాతీయ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, రాయలసీమ జనసేనపార్టీ కోకన్వీనర్ రాందాస్‌చౌదరి, రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, విజయభారతి డాక్టర్ సేతు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి ప్రశాంత్, బర్నేపల్లి సంద్యారాణి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అగ్రస్థానంలో నిలుపుదాం

### మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు: మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,డిసెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ పారిశ్రామిక అవసరాలు తీర్చడంలో ఆంధ్రప్రదేశ్ను అగ్రస్థానంలో నిలుపుదామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. విజయవాడ ఎస్ ఎస్ కన్వెన్షన్ లో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన బిజినెస్ ఎక్స్పోలో ఓ విభాగాన్ని మంత్రి ప్రారంభించారు.. ఎక్స్పోలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో నూతన ఆవిష్కరణలు పరిశీలించారు. సరికొత్త ఆవిష్కరణలతో రాష్ట్రంలో నూతన పారిశ్రామిక శకం మొదలవుతోందని పేర్కొన్నారు. ఇన్ఫ్రాస్ట్రక్చర్‌రంగంలో ఎక్కువ పెట్టుబడులు రావడం అభినందనీయం. మన రాష్ట్రానికి సుమారు వెయ్యి కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. పోర్టులు, రైలు రోడ్డు మార్గాలు పుష్కలంగా ఉన్నాయి. ఒకప్పుడు ఔటర్‌రింగ్‌రోడ్డు నిర్మాణంతో హైదరాబాదు రూపురేఖలే మారిపోయాయి. అదే స్ఫూర్తితో నేడు అమరావతి నిర్మాణం చేపడుతున్నాం. గత ఐదేళ్లు ఎదుర్కొన్న ఇబ్బందుల కారణంగా అమరావతి నిర్మాణం ఆలస్యమైనప్పటికీ.. ఇప్పుడు పనుల్లో వేగం పెంచాం. మరోవైపు శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి వరకు విశాఖ ఎకనామిక్స్ రీజియన్, వెస్ట్ గోదావరి నుంచి ప్రకాశం జిల్లా వరకు అమరావతి రీజియన్, నెల్లూరు సహా రాయలసీమ జిల్లాలతో కలిపి రాయలసీమ ఎకనామిక్ రీసన్ డెవలప్ చేస్తున్నాను. అదే సమయంలో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటు చేసేందుకు పెద్ద పేట వేస్తున్నామన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ ఇంధన సంరక్షణ అవార్డు-2025 ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మ

### ప్రభుత్వం తరఫున అవార్డు అందుకున్న ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి శివ శంకర్



ఆదివారం రాష్ట్రపతి ముర్మ నుంచి అవార్డు అందుకున్న ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి ఎల్.శివ శంకర్

**విజయవాడ, డిసెంబర్ 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఇంధన పరిరక్షణ , ఇంధన సామర్థం లో ఆంధ్ర ప్రదేశ్ సాధించిన జాతీయ ఇంధన సంరక్షణ అవార్డు 2025 ను ఏపీఎస్పీడీసిఎల్ సిఎండీ ఎల్ శివ శంకర్ కు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ప్రధానం చేసారు. ఆదివారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు ను ఏపీఎస్పీడీసిఎల్ సిఎండీ అందుకున్నారు. ఈ అవార్డు ఇంధన సామర్థం, ఇంధన సంరక్షణ రంగాలలో రాష్ట్రానికి మరో గర్వకారణమైన మైలురాయిగా నిలిచింది. ఈ అవార్డు ద్వారా జాతీయ స్థాయి గుర్తింపు లభించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి గల నాయకత్వం, గౌరవ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సహాయసహకారాలు , అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మార్గదర్శకం ప్రధాన పాత్ర వహించాయి. వారి సమర్ధ నాయకత్వంలో రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఎపిఎస్ఇసిఎం) అనేక రంగాల్లో ప్రభావవంతమైన ఇంధన సామర్థ్య కార్యక్రమాలను అమలు చేస్తూ జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు విశేష గుర్తింపును తీసుకువచ్చింది.

# ఓటు చోరులను గద్దె దించుతాం

>> న్నారు. సత్యంపైనే ఆధారపడి పనిచేస్తామని, ఈ శక్తితోనే నరేంద్రమోడీ ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని అధికారంనుంచి దించుతామని ప్రకటించారు. వారికి అధికారం ఉందని, అందువల్లనే వారంతా వోట్‌చోరీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో బిజెపి రూ.10వేలు చొప్పున పంపిణీచేసిందని, అయినా కూడా ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి చర్యలు లేవని గుర్తుచేసారు. వాస్తవం అవాస్తవాలమధ్య జరిగే పోరులో తాము ఎప్పటికీ రాజీ పడలేమన్నారు. ఎన్నికల సంఘం బిజెపి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తోందని నిష్పాక్షిక వైఖరితో లేదని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ ఛీఫ్ మోహన్‌భగవత్ ప్రకటన గుర్తుచేసుకోవాలని చెపుతూ ప్రపంచం నిజాలవైపు చూడదని, అధికారంవైపే ఉంటుందని, అధికారంలో ఎవరు ఉంటారో వారినే గైరవిస్తారని అన్నారు. ఇదే మోహన్ భగవత్ ఆలోచన అని ఇదే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతమని చెపుతూ మా సిద్ధాంతం సర్వమత సమానత్వం అని ఒక్క హిందూత్వంతో సరిపెట్టుకోబోమని అన్నారు. సత్య వాక్కులతోనే తాము మోడీ, అమిత్‌షా, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాలను గద్దెదించుతామని ప్రకటించారు.

# విద్యుత్ చార్జీల భారం తగ్గనుంది

## - మంత్రి గొట్టిపాటి రవికుమార్



విజయవాడ, డిసెంబరు 14 ప్రభాత వార్త ప్రతినిధి: సూర్యఘర్ పథకం ద్వారా విద్యుత్ వినియోగ దారులకు ఎంతో మేలు జరుగుతుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రతి నియోజకవర్గంలో 10 వేల కనెక్షన్లు ఇవ్వడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు పూర్తి ఉచితంగా, బీసీలకు ప్రత్యేక రాయితీ లను ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఇస్తోందని గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. దీనివల్ల పేదలకు విద్యుత్ చార్జీల భారం గణనీయంగా తగ్గనుందని అన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని, వీలైతే తగ్గిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఆచరణలో సాధ్యమవు తోందని గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మాజీ సీఎం జగన్ పెంచిన ట్రూ అప్ చార్జీలను ట్రూ డౌన్ చేసే దిశగా ఇప్పటికే కార్యాచరణ రూపొందించామని తెలిపారు. గత ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థను ఆదాయ వనరుగా మాత్రమే చూసిందని గొట్టిపాటి అన్నారు. విద్యుత్ రంగంపై చంద్రబాబుకు ఉన్న అపార అనుభవంతో విద్యుత్ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఆదాయం సమకూరుస్తున్నారని తెలిపారు. 18 నెలల్లో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి అనతికాలంలోనే విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టామని వివరించారు. పీఎం సూర్యఘర్, కుసుమ్, బ్యాటరీ స్టోరేజ్ విధానం, డిమాండ్‌కు తగ్గట్టు ఉత్పత్తి పెంచుతూ తీసుకొచ్చిన సంస్కరణలతో చార్జీలు తగ్గించగలుగుతున్నామని పేర్కొన్నారు.

# సంస్కరణల పేరుతో జగన్ భూ కుంభకోణం

## - రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: రెవెన్యూ సంస్కరణల పేరుతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భూ కుంభకోణానికి పాల్పడ్డారని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. జగన్ పాలనలో రాష్ట్రంలో ప్రజల భూములకు పూర్తిగా భద్రత లేకుండా పోయిందని ఒక ప్రకటనలో విమర్శించారు. భూ రికార్డులను తారుమారు చేసి వేల ఎకరాల రైతుల భూములను కబ్జా చేశారని ఆరోపించారు. ప్రైవేట్ భూములను 22ఎ జాబితాలో చేర్చి లావాదేవీలను అడ్డుకున్నారని విమర్శించారు. భూ దోపిడీ పాలనకు కూటమి ప్రభుత్వం ముగింపు పలికిందని తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను దుర్వినియోగం చేసిన ఘనత జగన్‌దన్నారు. ఈ వ్యవస్థ లోపభూయిష్టంగా మారిందన్నారు. జగన్ హయంలో ప్రతి రెవెన్యూ కార్యాలయంలో అవినీతి పేరుకొని పోయిందని, తమ ప్రభుత్వ ప్రక్షాళన చేసుకుని వస్తుందన్నారు.



# టన్నుమట్టి తవ్వితీస్తే... 2 గ్రాముల పసిడి చేతిలోకి!

- కర్నూలు జిల్లా జొన్నగిరిలో జోరుగా త్రవ్వకాలు
- 6.8 టన్నుల పసిడి ఖనిజం ఉన్నట్లు గుర్తింపు

కర్నూలు, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: కర్నూలు జిల్లాలో బంగారం వెలికి తీసే పనులు చురుకుగా సాగుతున్నాయి. తుగ్గలి మండలం జొన్నగిరి ప్రాంతంలో బంగారం మెరుపుతో ధగ ధగ మెరిసిపోతున్నది. జిల్లాలోని పగిడిరాయి, జొన్నగిరి ప్రాంతాల మధ్య బంగారు నిక్షేపాలు ఉన్నాయనే అనుమానంతో.. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ పసిడి కోసం పరిశోధనలు జరిగాయి. ఆఖరికి కొన్నేళ్ల క్రితం ఈ ప్రాంతాల్లో బంగారం నిక్షేపాలు ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) నిర్ధారించింది. దీంతో జొన్నగిరి పగిడిరాయి గ్రామాల పరిసర ప్రాంతాల్లో సుమారు 1,477.24 ఎకరాల్లో తవ్వకాలు జరిపేందుకు జియో మైసూర్ అనే కంపెనీ ప్రభుత్వం నుంచి అనుమతులు పొందింది. తవ్వకాలు కూడా ప్రారంభించింది. ఈ ప్రాంతంలో టన్ను మట్టిని తవ్వి తీస్తే.. 1.5 గ్రాముల2 గ్రాముల వరకు పసిడి ఉత్పత్తి అవుతుంది. అయితే టన్ను మట్టి నుంచి ఈ రెండు గ్రాముల బంగారం వెలికి తీసేందుకు గాను.. సుమారు 5 వేల వరకు ఖర్చవుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇలా వెయ్యి టన్నుల మట్టికి సుమారు 700 గ్రాముల బంగారం వెలికి తీయడం సాధ్యం అవుతుందని ఇక్కడ తవ్వకాలు జరుపుతోన్న సంస్థ యాజమాన్యం చెబుతోంది. జియో మైసూర్ సంస్థ రానున్న పది సంవత్సరాల కాలంలో ఈ ప్రాంతంలో సుమారు 6 వేల టన్నుల బంగారం ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ప్రతి రోజు 1000 టన్నుల ఖనిజాన్ని శుద్ధి చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కోటి టన్నుల ఖనిజ నిల్వలు ఉన్నట్లు జియో మైసూర్ సంస్థ అంచనా వేస్తోంది. ముఖ్యంగా తూర్పు బ్లాక్‌లో భూమి అడుగున 180 మీటర్ల లోతులో.. 6.8 టన్నుల పసిడి ఖనిజం ఉన్నట్లు గుర్తించారు. ఈ ప్రాంతంలో ప్రతి సంవత్సరం 4 లక్షల టన్నుల ఖనిజాన్ని వెలికితీసి దీనిలో సుమారు 3 లక్షల టన్నులను శుద్ధి చేయాలని మైనింగ్ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం కంపెనీ నిర్వాహకులు అధునాతన యంత్రాలను తెప్పించుకుని పనులు చేపడుతున్నారు.

# అందరి చూపు రవికుమార్ ఆస్తులపైనే!

- నేటి నుండి సిఐడి, ఎసిబి దర్యాప్తు షురూ
- ఐటి, ఇడి సైతం రంగంలోకి

తిరుమల, డిసెంబర్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: చిరు ఉద్యోగి... ఆపై పరకామణిలో లక్షల్లో చోరీ... ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడనే అనుమానాలపై హైకోర్టు ధర్మాసనం ఆదేశాలతో నిందితుడు రవికుమార్ ఆస్తుల లెక్కలు తేల్చేపనిలో సిఐడి, ఎసిబి అధికారులు రంగంలోకి దిగుతున్నారు. వీళ్ళు సేకరించిన సమాచారాన్ని ఆదాయపు పన్నుశాఖ (ఐటి), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కి అందజేయాలని వెలువడించిన ఆదేశాల వెనుక పెద్దకుట్ర ఉందనేది న్యాయస్థానం కూడా అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. క్షుణ్ణంగా నిందితుడు ఆస్తులు ఎలా సంపాదించాడు, ఎక్కడెక్కడ ఉన్నాయి, వాటిని ఎవరెవరికి విక్రయించాడు, ఇంకా ఏ మేరకు ఆస్తులు ఉన్నాయనే వివరాలు సేకరణలో సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్ బృందం, ఎసిబి చీఫ్ బృందం కార్యాచరణ రూపొందించుకుని సిద్ధమైంది. ఇప్పటికే ఈ తతంగంలో నిందితుడికి సంబంధించి తిరుపతి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నంలో భారీగా ఆస్తులు ఉన్నట్లు తగిన ఆధారాలు సేకరించి హైకోర్టు ధర్మాసనానికి సమర్పించింది. ఇంకా ఆ ఆస్తుల క్రయవిక్రయాల డాక్యుమెంట్లను, రికార్డులను సిఐడి రాబట్టిందనేది కీలక సమాచారం. ఇప్పుడు వీటన్నిటిపై నిశితంగా దర్యాప్తు చేసి తదుపరి కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సంస్థలు ఐటి, ఇడిలకు సమాచారం ఇస్తే ఆ తరువాత ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోనున్నాయనేది టిటిడిలో, రాజకీయవర్గాల్లో పెద్ద దుమారం రేపుతోంది. 2023 ఏప్రిల్ 29న తిరుమల పరకామణిలో గుమస్తా సివి రవికుమార్ 920 అమెరికన్ డాలర్లు చోరీ చేయడం, తిరుమల పోలీసులు కేసు నమోదు చేయడం, తదుపరి విచారణ చేసినా చట్టపరంగా చర్యలు తీసుకోలేదని, లోక్‌అదాలత్ ద్వారా కేసు రాజీ చేసుకోవడం వరకు అంతా సంచలనంగా మారింది. ఈ కేసులో ఇంకా మరింత లోతుగా దర్యాప్తుకు హైకోర్టు ధర్మాసనం ఆదేశించడంతో సిఐడి, ఎసిబితో బాటు ఐటి, ఇడి శాఖల అధికారులు ఇక రంగంలోకి దిగుతున్నారు. 2023 జూన్‌లోనే అప్పటి టిటిడి బోర్డు పెద్దలు రూ.14.43 కోట్ల విలువైన ఆస్తులను 7




గిఫ్ట్ డీడ్‌లుగా శ్రీవేంకటేశ్వరస్వామికి స్వీకరించడం జరిగింది. వాటి విలువ మార్కెట్లో రూ.40 కోట్లు చేస్తుందని సిఐడి అంచనా. చోరీ సొత్తు విలువ లక్షల్లో ఉంటే శ్రీవారికి కానుకగా రూ.14 కోట్ల ఆస్తులు ఎందుకు స్వీకరించారనేది హైకోర్టు అనుమానాలు. ఈ వారంలో అనుమానాలు పటాపంచలు కానున్నాయనే చర్చమొదలైంది. ఈ కేసులో ఇప్పటికే గత వైసిపి ప్రభుత్వ హయాంలోని టిటిడి బోర్డు మాజీ ఛైర్మన్లు వైవి సుబ్బారెడ్డిని, భూమన కరుణాకర్‌రెడ్డిని, మాజీ ఇఒ ఏవి ధర్మారెడ్డితోబాటు మాజీ సివిఎస్ఒ నరసింహ కిశోర్, మాజీ విజిఒ గిరిధర్, ఏవిఎస్ఒ పద్మనాభంను, అప్పటి తిరుమల సిఐలు జగన్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్, ఎస్ఐ లక్ష్మీరెడ్డిలను పరకామణి విధుల్లో ఉన్న టిటిడి అధికారులను వరుసగా 35మందిని పలు దఫాలుగా విచారణ చేసి వాంగ్మూలాలు రాబట్టిన విషయం తెలిసిందే.

## తిరుమల సమాచారం



# 30నుండి జనవరి 8వరకు విఐపి దర్శనాలు బ్రేక్

తిరుమల, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగవైకుంఠం తిరుమలలో ప్రత్యేక పర్వదినాలు పురస్కరించుకుని ఆయా రోజుల్లో టిటిడి విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేసింది. అంతేగాక ఆ రోజులకు ముందురోజులు ఎటువంటి సిఫార్సు లేఖలు కూడా స్వీకరించరని తెలిపింది. ఈనెల 23వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 29న వైకుంఠ ఏకదశి ముందురోజు, 30వ తేదీ నుండి జనవరి 8 వరకు వైకుంఠద్వార దర్శనాలు సందర్భంగా పూర్తిగా విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేసింది. ప్రోటోకాల్ విఐపిలు స్వయంగా వస్తే వారికి దర్శనం కల్పిస్తుంది. జనవరి 25వతేదీ రథసప్తమి పర్వదినాన కూడా విఐపి బ్రేక్ రద్దుచేసింది. ఈ సందర్భాలు భక్తులు గమనించి టిటిడికి సహకరించాలని కోరింది.



# నమో ఆంజనేయం... ప్రభాదివ్యకాయం

తిరుమల, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: కార్తీకమాసం చివరి ఆదివారం ఉదయం కలియుగ వైకుంఠం తిరుమలలో బేడి ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఉదయం ఆలయంలో బేడి ఆంజనేయస్వామి మూలవిరాట్టుకు పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపుతో విశేషంగా అభిషేకించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



# సిఎం భద్రతలో రాజీలేదు


## బాధ్యతతో విధులన్న తిరుపతి ఎస్పీ లంకెల

తిరుపతి, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుపతి పర్యటనలో బాగంగా సంస్కృత విద్యాపీఠంలో జరిగే కార్యక్రమానికి విచ్చేస్తున్నందున భద్రతలో రాజీలేదని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు వెల్లడించారు. క్రిందిస్థాయి నుండి పై అధికారి వరకు బాధ్యతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. సిఎం పర్యటనతో ముందస్తుగా ఆదివారం ఉదయం తిరుపతిలోని హెలిపాడ్‌ను, సమావేశం జరిగే ప్రాంతాలను పోలీసు అధికారులతో కలసి పరిశీలించారు. వేదిక్ విశ్వవిద్యాలయం అధికారులు పోలీసులకు సహకరించాలని, భద్రత, సమన్వయ అంశాలపై పలు కీలక సూచనలు చేశారు. కమాండ్ కంట్రోల్‌లో ఎఎస్పీ రవిమనోహరచారి, ఎస్‌బి డిఎస్పీ వెంకటనారాయణ, తిరుపతి భక్తవత్సలం, సిఐలు, ఎస్ఐలతో కలసి సిఎం పర్యటన సజావుగా సాగేందుకు దిశానిర్దేశం చేశారు.

# పండ్ల ఉత్పత్తిలో ఎపి టాప్

- 1.93 కోట్ల టన్నుల పండ్ల ఉత్పత్తి
- ఆర్‌బిఐ గణాంకాలు విడుదల

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: దేశవ్యాప్తంగా ఏపీ 1.93 కోట్ల టన్నుల పండ్ల ఉత్పత్తిని చేస్తూ జాతీయ స్థాయిలో ప్రథమస్థానాన్ని దక్కించుకుంది. పండ్లతోటల సాగులో ఏకంగా రెండోస్థానంలో నిలిచింది. ఇటీవల రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 202425 ఆర్థిక సంవత్సరం గణాంకాలు విడుదల చేసింది. దీని ప్రకారం పండ్ల ఉత్పత్తులకు సంబంధించిన వివరాలను అధికారులు వెల్లడించారు. దేశం మొత్తం మీద వివిధ అంశాల్లో ఏ ఏ రాష్ట్రాలు ఏ స్థానంలో ఉందో పేర్కొంది. ఆ తర్వాత స్థానంలో మహారాష్ట్ర 1.68 కోట్ల టన్నుల ఉత్పత్తితో రెండోస్థానంలో నిలచింది. ఇక మధ్యప్రదేశ్ రాష్ట్రం 1.02 కోట్ల టన్నుల ఉత్పత్తితో మూడోస్థానంలో ఉంది. దాంతో వీటన్నింటినీ పరిశీలించిన అనంతరం 8.07లక్షల హెక్టార్లలో పండ్ల తోటలను సాగు చేస్తూ దేశంలో రెండోస్థానంలో ఏపీ నిలవగా, 8.96 లక్షల హెక్టార్లలో సాగు చేస్తూ మహారాష్ట్ర మొదటిస్థానంలో నిలిచింది.



### సగటు ఎపి నికర ఉత్పత్తి

ప్రస్తుత ధరల వద్ద దాదాపు రూ.14.22 లక్షల కోట్లు కాగా స్థిర ధరల వద్ద రూ.7.56 లక్షల కోట్లుగా ఉంది. బియ్యం ఉత్పత్తి 81.59 లక్షల టన్నులు, ఆహారధాన్యాల ఉత్పత్తి రాష్ట్రం మొత్తమ్మీద 1.17 కోట్ల టన్నులు.

రాష్ట్రవ్యాప్తంగా వరిసాగు 20.77 లక్షల హెక్టార్లుల్లో ఉంది. చేపల ఉత్పత్తిలో దేశంలోనే మొదటి స్థానంలో ఏపీ నిలిచింది. రాష్ట్రంలో 51.58 లక్షల టన్నుల చేపల ఉత్పత్తిని సాధిస్తున్నాం. ఆ తర్వాత పశ్చిమబెంగాల్ 22 లక్షల టన్నులతో రెండోస్థానంలో, ఉత్తర్‌ప్రదేశ్ 11.60 లక్షల టన్నులతో మూడోస్థానానికి చేరుకున్నాయి. ప్రస్తుత ధరల ఆధారంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి 2024-25వ సంవత్సరంలో రూ.15.93 లక్షల కోట్లుగా రిజర్వుబ్యాంకు వెల్లడించింది. స్థిరధరల వద్ద అయితే రూ.8.65 లక్షల కోట్లుగా తేల్చింది. సగటున అయితే ఏపీ స్థూల ఉత్పత్తి రూ.2,66,240 (ప్రస్తుత ధరల్లో), రూ.1,41,609 (స్థిర ధరల వద్ద)గా వివరించింది. ప్రస్తుత ధరల ఆధారంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి 2024-25 వ సంవత్సరంలో రూ.15.93 లక్షల కోట్లుగా రిజర్వుబ్యాంకు వెల్లడించింది. స్థిరధరల వద్ద అయితే రూ.8.65 లక్షల కోట్లుగా తేల్చింది. సగటున అయితే ఏపీ స్థూల ఉత్పత్తి రూ.2,66,240 (ప్రస్తుత ధరల్లో), రూ.1,41,609 (స్థిర ధరల వద్ద)గా వివరించింది.




# కల్తీనెయ్యి కేసులో రేపు సుప్రీంకు 'సిట్'!?

## టిటిడి మాజీ అధికారులకు విచారణ తాఖీదులు

తిరుమల, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల లడ్డూల తయారీకి 2020-24 మధ్య కాలంలో కల్తీనెయ్యి సరఫరా కేసులో ఇప్పటి వరకు సేకరించిన సమాచారాన్ని సిట్ సుప్రీంకోర్టుకు అందజేయనుందనేది తెలుస్తోంది. మంగళవారం టిటిడి బోర్డు సమావేశం జరగనున్న నేపథ్యంలో టిటిడిలో మార్కెటింగ్, కొనుగోళ్ళ విభాగాలకు చెందిన కొందరు మాజీ అధికారులను సిట్ విచారణకు రమ్మని తాఖీదులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. కల్తీనెయ్యి కేసులో 16న కొంత సమాచారంతో సుప్రీం న్యాయస్థానంకు వెళితే తదుపరి ఎలాంటి ఆదేశాలు వెలువడతాయనేది తెలియాలి. 2020 ఆగస్టులోనే తిరుమలకు కల్తీనెయ్యి సరఫరా అవుతోందని అప్పట్లోనే గుర్తించిన టిటిడి మార్కెటింగ్, కొనుగోళ్ళ విభాగం అధికారులు బోర్డుకు తెలిపినా అప్పటి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి పెద్దగా పట్టించుకోలేదనేది సిట్ కస్టడీలోని మాజీ జిఎం సుబ్రమణ్యం వాంగ్మూలం. ఇంకా పలు సంచలన విషయాలు సిట్ అధికారులకు సుబ్రమణ్యం తెలియజేయడంతో ఇప్పుడు టిటిడి వర్గాల్లో కలకలం రేపుతోంది.

ఇప్పటికే కల్తీనెయ్యి కేసులో భాగస్వాములైన గత అధికారులు 12మందిని గుర్తించిన సిట్ వారిని విచారణకు పిలిచేందుకు టిటిడి ఇఒకు లేఖ రాయడం, దానిపై 16న ఆదేశాలు వెలువడనున్నట్లు తెలుస్తోంది. ఆ తరువాతే ఆ 12మందిని విచారణకు పిలిచే అవకాశం కనిపిస్తోంది. వీరిలో ముగ్గురు అధికారులు ఇప్పటికే పదవీవిరమణ చేశారు. ఉద్యోగులను విచారణకు ఇఒ అనుమతి అవసరం. నాగేంద్రప్రసాద్, శేఖర్, ఈశ్వర్‌రెడ్డి, వెంకట అనిల్‌కుమార్, వెంకట నగేశ్‌బాబు, జగదీశ్వర్ రెడ్డి, సుబ్రమణ్యం, మురళీకృష్ణ, గోశాల మాజీ డైరెక్టర్ (సస్పెన్షన్ వేటుకు గురైన) డాక్టర్ హరినాథ రెడ్డి కల్తీనెయ్యిలో కీలకమనేది సిట్ కథనం. కీలకమైన ఐదుగురు టిటిడి ఉద్యోగులను విచారణ చేస్తే నెలకొన్న చిక్కుముడి వీడిపోతుందనేది వినిపిస్తున్న వ్యాఖ్యలు.

# పండిన ప్రతి ధాన్యపు గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది

## - రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

## - తొట్ల వల్లూరులో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను ప్రారంభించిన మంత్రి

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: రైతులకు అన్యాయం జరగకుండా ప్రతి ధాన్యపు గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఎక్కడ లేని విధంగా 24 గంటల్లో పైకం చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఆదివారం మంత్రి రాష్ట్ర గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి జన్మదిన వేడుకలలో భాగంగా తొట్ల వల్లూరులో ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ తాను రైతు బిడ్డ అని, రైతుల కష్టాలు తెలుసని, రైతులకు మేలు చేయాలని ఉద్దేశంతోనే తాను కఠినంగా వ్యవహరించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం డబ్బులు రైతులకు చెల్లించే ఏర్పాటు చేశామన్నారు. శనివారం జరిగిన సంఘటనను వివరిస్తూ మంత్రి కొంతమంది రైతులు రైస్ మిల్లర్ల నుండి తడిసిన ధాన్యం సంబంధించి నష్టపోతున్నట్లు తన దృష్టికి తీసుకొని వచ్చారన్నారు. ఈ విషయమై అధికారులతో మాట్లాడడం మాట్లాడటం జరిగిందన్నారు. తన సొంత ఊరు కారకంపాడు నుండి వస్తుంటే పక్క గ్రామం అయిన పెద్ద ముత్తేవి నుండి 3 లారీల ధాన్యం లోడ్ చేసుకుని వెళుతుంటే ఆ లారీలను ఆపి ఎక్కడి నుండి వస్తున్నాయి, ధాన్యం ఎంతకు కొనుగోలు చేశారు అని లారీ డ్రైవర్ను అందులోని వారిని అడిగితే తమకు తెలియదని తాము కేవలం రవాణాకు చెందిన వాళ్ళమని గుడివాడ రైల్వే షెడ్‌లో వ్యాగిన్స్‌లో లోడ్ చేసుకునేందుకు తీసుకెళుతున్నట్లు చెప్పారన్నారు. ఎవరు కొన్నారు వారిని పిలిపించాలని పక్క గ్రామమే కదా అని వారిని అడిగితే ప్రక్క గ్రామం నుండి వారు వచ్చారన్నారు. నాతో మొదట 1550 అని ఆ తరువాత 1450 రూపాయలకు కొనుగోలు చేసినట్లు చెప్పారన్నారు. అంత తక్కువకు కొనుగోలు ఎలా చేశారని చేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించానన్నారు. వెంటనే గోనెసంచిలో నుండి ధాన్యాన్ని బయటకు తీసి తేమ శాతం పరీక్షించే యంత్ర పరికరాన్ని తెప్పించి పరిశీలించగా 22శాతం తేమ ఉందన్నారు. అడిగితే ధాన్యం రంగు మారిందని చెప్పారు. అక్కడే ఒక బేరగాడు ఉంటే ధాన్యాన్ని అరచేతిలో వేసుకుని నూరితే లోపల బియ్యం ఎక్కడ రంగు మారలేదన్నారు. బియ్యం అంతా బాగానే ఉన్నా నూక రంగు మారితే మీకు వచ్చే నష్టమేంటని ప్రశ్నించామన్నారు. ఎవరు దీన్ని తక్కువ ధరకు కొనమని చెప్పారని అంటూ రైతు సేవా కేంద్రంలోని సాంకేతిక సిబ్బందిని పిలిపించామన్నారు. తేమ శాతం పరికరాన్ని అప్పటికప్పుడు తెప్పించామన్నారు. తేమశాతం పరిశీలిస్తే 22 శాతం ఉందని ధాన్యం బాగుందని ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం 17కంటే ఎన్ని పాయింట్లు ఎక్కువ ఉంటే అన్ని కిలోల బియ్యం తగ్గించుకోవలసి ఉంటుందన్నారు. ఆ ప్రకారం 5 కిలోల బియ్యానికి కిలో 24 రూపాయల చొప్పున 120 రూపాయలు తగ్గించాల్సి ఉంటుందన్నారు. ఆ ప్రకారం 1450 రూపాయలు కొనుగోలు చేయడం ఏంటని మిల్లర్లతో మాట్లాడటం జరిగిందన్నారు. 1650 రూపాయలు చెల్లిస్తే గాని లారీలను వెళ్ళనివ్వమని గట్టిగా చెప్పడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం లాగా రైతులకు డబ్బులు ఎగ్గొట్టే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. అనా పైసలతో సహా నిబంధనల ప్రకారం ప్రతి రైతు పండించిన పంటకు ధర చెల్లించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 24 గంటల్లోనే ధాన్యం డబ్బులు రైతులకు చెల్లిస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. తాను పేదరికం నుంచి వచ్చానని తనకు రైతుల బాధలు తెలుసన్నారు. రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం జరగకూడదన్నది ప్రధాన ఉద్దేశం, ప్రతి రైతుకు మేలు జరగాలన్నదే తమ అభిమతం అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.




## రాజధాని పరిధిలోని భూమిలేని పేదలకు

# పెన్షన్ పథకం పునరుద్ధరణ




విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పరిధిలోని భూమిలేని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గత ప్రభుత్వం నిలిపివేసిన పింఛన్ల పథకాన్ని పునరుద్ధరించాలని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్ డీఏ) నిర్ణయించింది. ఇటీవల జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. దీని ద్వారా 4,929 మంది పేదలకు నెలకు రూ.5 వేల చొప్పున పింఛను అందనుంది. రాజధాని కోసం భూసమీకరణ జరిగినప్పుడు, భూమి లేక ఉపాధి కోల్పోయిన పేదల కోసం ప్రభుత్వం ఈ పింఛన్ పథకాన్ని ప్రారంభించింది. అయితే, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని పనులు నిలిపివేయడంతో పాటు ఈ పింఛన్లను కూడా రద్దు చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో, అమరావతి అభివృద్ధి పనులు తిరిగి ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలోనే పింఛన్లను పునరుద్ధరించాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. ఈ విషయంపై సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పింఛన్ల కోసం త్వరలోనే దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. గ్రామాల్లోని సీఆర్‌డీఏ కార్యాలయాల్లో గానీ, గ్రామసభల ద్వారా గానీ పేదలు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఈ నిర్ణయంతో రాజధాని ప్రాంతంలోని వేలాది పేద కుటుంబాలకు ఆర్థికంగా ఊరట దక్కుతుంది.

వార్త

జ్ఞానం వంశపారంపర్య హక్కుకాదు,
ఎవరికి వారు కష్టపడి ఆర్జించుకోవాల్సిందే.

న-స్వామి వివేకానంద

# మెస్సీ మెరిసెన్


అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ హైదరాబాద్ ..ఉప్పల్ స్టేడియంలో అలా మెరిసి... ఇలా మురిపించాడు. క్రీడా మైదానంలో ముఖ్యమంత్రి రేవంతరెడ్డితో కలియ తిరిగారు. అతి సాధారణ క్యాజువల్ వస్త్రధారణతో గ్యాలరీలోని అభిమానులను పలకరించారు. ఫుట్‌బాల్ లను గ్యాలరీలోకి విసిరారు. దానిని పట్టుకున్న పలువురు దానిని ఎంతో ఉత్సాహంతో ఉద్వేగంతో పట్టుకుని ముద్దాడారు. స్టేడియం గ్రౌండ్లో ఎంతోమంది యువకులు, ఫుట్‌బాల్ ప్లేయర్లు తాము ఆడుకునే ఫుట్ బాల్ మీద మెస్సీ ఆటోగ్రాఫ్ తీసుకుని సంబరపడి పోయారు. మెస్సీ కదలికల్లో ఎలాంటి ఆర్భాటం లేదు. దర్పం లేదు. అతిశయం అసలే లేదు. స్టేడియంలో ఆడిన ఫ్రెండ్లీ మ్యాచులో ఆ విషయమే అర్థం అవుతుంది. తన ప్రతిభనంతా పక్కన పెట్టి తెలంగాణ ప్రభుత్వం తరఫున ఆడిన సింగరేణి బ్యాచ్ ఆటగాళ్ల గెలుపే తన గెలుపుగా భావించారు. ఎలాంటి ఎత్తుగడలు లేవు. మన ప్రాంతానికి వచ్చి మనల్ని గెలిపించి వెళ్లడమంటే....అదే కదా ఫ్రెండ్లీ అంటే. కాస్మోపాలిటన్ సిటీగా ఎదిగి ఒదిగిన ప్రాంతం కావడంతో దేశంలోని అన్ని ప్రాంతాల వారూ హైదరాబాద్‌లోనే ఉంటారన్నది జగద్విదితం. అందుకే అన్ని భాషలకు చెందిన క్రీడాసక్తి, ప్రత్యేకించి ఫుట్ బాల్ అంటే చెవి కోసుకునేవారు మెస్సీని ఎలాగైనా చూడాలని వ్యయ ప్రయాసలకోర్చి ఉప్పల్ స్టేడియంకు ముందు గానే వచ్చి చేరారు. లియోనల్ మెస్సీ అంటేనే ఫుట్ బాల్ ప్రపంచలో ఓ సంచలనం. భారత ప్రేక్షకులు ఇంతవరకు టీవీ చానల్స్‌లో మాత్రమే ఆయన్ని చూడ గలిగారు. కలకత్తా కార్యక్రమం నిర్వాహకుల వైఫల్యం వలన అభాసుపాలయ్యింది. మ్యాచ్ అడకుండానే మెస్సీ కోల్‌కతా నుంచి వెనుదిరగడంతో అభిమానుల ఆగ్రహా నికి గురయ్యారు. అక్కడి స్టేడియంలో మెస్సీని చూడలేక పోయామనే బాధతో అభిమానులు విధ్వంస చర్యలకు పాల్పడ్డారు. ఆ సంఘటనతో హైదరాబాద్‌లో అసాధారణ భద్రతతో ప్రమత్తమయ్యారు. దాంతో ఎక్కడా ఎలాంటి అలజడి లేకుండా కార్యక్రమం విజయవంతమయ్యింది. ప్రపంచ ఫుట్బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా' ప్రారంభమైంది. ఇండియాలో మూడు రోజుల పర్యటనలో 4 ప్రధాన నగరాలకు వెళ్లే కార్యక్రమం. ఆయనతో పాటు అతడి ఇంటర్ మియామీ జట్టు సహచరులు రోడ్రిగో డి పాల్, లూయిన్ సూవారెజ్ ఇండియాకు వచ్చారు. శనివారం ఉదయం కోల్కతాలో ఏర్పాటు చేసిన తన విగ్రహాన్ని వర్చువల్‌గా తానూ, హిందీ నటుడు షారుక్ ఖాన్ కలిసి ఆవిష్కరించారు. ఫిఫా వరల్డ్ న్క ట్రోఫీని చేతబట్టుకున్న మెస్సీ రూపంలో ఈ విగ్రహాన్ని రూపొందించారు. 2022 ప్రపంచకప్ విజయానికి ఇది ప్రతీకగా నిలిచింది. ఇక హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంకి మెస్సిని చూడటానికి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కలకత్తాలో మెస్సీ అభిమానులతో ఫ్రెండ్లీ మ్యాచ్ కోర్కె తీర్చలేకపో యినా హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో ఆయన అభిమా నులను, నిర్వాహకులను కూడా సంతృప్తిపరిచారు. తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత రెడ్డి స్వతహాగా ఫుట్ బాల్ ప్లేయర్ కావడంతో ఈ కార్యక్ర మాన్ని విజయవంతంగా పూర్తి చేసారు. ఆయన ప్లేయర్ డ్రెస్‌తో వచ్చి ఫ్రెండ్లీ మ్యాచులో పాల్గొన్నారు. ఇలాంటి ఈవెంట్‌లో స్వయంగా పాల్గొన్న ముఖ్యమంత్రి ఎవరన్నా ఉన్నారంటే వీరే. ఉప్పల్ గ్రౌండ్ క్రికెట్ కోసం ప్రత్యే కంగా ఏర్పాటు చేసిన క్రీడా మైదానం. కానీ మెస్సీ రాకను దృష్టిలో ఉంచుకుని దానిని ఫుట్ బాల్ ఆడేందుకు వీలైన ఆటస్థలంగా తీర్చిదిద్దారు. కాగా మెస్సీ రాకతో ఈ ప్రాంతంలో ఫుట్ బాల్‌కు ప్రాణం లేచొచ్చింది. అనంతరం సాల్ట్ లేక్ స్టేడియానికి ఆయన వెళ్లారు. కేవలం 10 నిమిషాలు మాత్రమే ఆయన అక్కడ ఉన్నారు. అక్కడ ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడడం ప్రత్యేకత. నిజానికి కలకత్తా అంటేనే ఫుట్ బాల్ ప్రియులు ఎక్కువ మంది ఉండే ప్రాంతంలో అలాంటి కార్యక్రమం లేకుండానే మెస్సీని నిర్వాహకులు తీసుకు వెళ్లిపోవడం తప్పిదమే. ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడతారని నిర్వాహకులు చెప్పగా ఎంతో ఉత్సాహంతో ఫుట్ బాల్ ప్రియులు సిద్ధంగా ఉన్నారు. కానీ మ్యాచ్ ఆడకుండా వెళ్లి పోవడం అభిమానుల ఆగ్రహానికి కారణమైంది. హతా శులైన ఫ్యాన్స్ తీవ్ర స్థాయిలో రెచ్చిపోయారు. వీరావేశంతో విరగ్గొట్టిన కుర్చీలను సాల్ట్ లేక్ స్టేడియంలో పడేశారు. ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించి మెస్సీకి క్షమా పణ చెప్పారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. లియోనల్ మెస్సే, స్పోర్ట్స్ లవర్స్, మెస్సి ఫ్యాన్సుకు కూడా క్షమాపణ చెప్పారు. సంఘటనపై ఎంక్వైరీ కమిటీ వేసారు. బెంగాల్ గవర్నర్ కూడా ఆరా తీశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగ కుండా చూసుకుంటానని మమత ఎప్పటిలానే ఓ భరోసానిచ్చారు. భారతదేశంలో తమకిష్టమైన రాజకీయ నాయకులకు, అభిమాన సినిమా స్టార్లకు, ఆటగాళ్లకు జనం నీరాజనాలు, పడుతుంటారు. పాలాభిషేకాలు వారిని కలువలేకపోయినా, దగ్గర నుంచి చూసే అవకాశం లేకపోతే వీరాభిమానం గంగ వెర్రులెత్తి విధ్వంసానికి పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. కలకత్తాలో జరిగిం దిదే. తమిళనాడులో అభిమానుల తీరు వేరే విధంగా ఉంటుంది.తమ అభిమాన రాజకీయ నాయకులకు జరగరానిది జరిగితే ఆత్మాహుతికైనా సిద్ధపడతారు.

మనిషికి మనసును మించిన మహాశత్రువు వేరొకరు లేరు. అందుకే మనస్సును జయిస్తే ప్రపంచాన్ని జయించవచ్చు.



గురునానక్

మాటలకే పరిమితమయ్యే మిత్రుడెవ్వడూ నీ మిత్రుడిగా ఉండలేడు. మానవ సంక్షేమానికి అసలు మూలం పనే.



లియో టాల్‌స్టాయ్

# ప్రజావాక్కు



### విర్రవీగుతున్న పాకిస్థాన్

మొన్న జరిగిన ఆపరేషన్‌సిందూర్‌లోజరిగిన స్వల్ప యుద్ధంతో పాకిస్థాన్ గడగడ వణికిపోయి యుద్ధాన్ని ఆపమని భారత్‌ను ప్రాధేయ పడిన విషయం పాక్ ఆర్మీ చీఫ్‌మునీర్‌కు తెలియదనుకోవాలా?మరల యుద్ధం జరి గితే భారత్‌ను ధీటైన సమాధానం పాకిస్థాన్ చెప్పగలదని చేతకాని ఆడంబరాలెందుకో.ఈమధ్యన ఈ మునీర్ సాబ్ అమెరికా వెళ్ళి ట్రంప్ గారిచ్చిన విందును ఆరగించిన తరువాతే ఆయన మాటలు శ్రుతి మించిపోతున్నాయి. ట్రంప్‌యుద్ధ సామాగ్రిని సమకూరుస్తానని వాగ్దానం చేసా డేమో. అసలే అమెరికా దగ్గర చాలా ఆయుధాలు మురిగి పోతున్నాయి. సింధూర్ యుద్ధంతో తోక ముడిచిన ఈ పెద్ద మనిషి తన హోదాను సిడిఎఫ్‌గా ప్రభుత్వపరంగా పెంచుకుని విర్రవీగుతున్నట్లు కనబడుతోంది. ఏ దేశా నికైనా ఓ ఆర్మీ ఉంటుంది. కానీ పాకిస్థాన్ ఆర్మీకే ఒక దేశ ముంది. ఇదొక వింతల్లో కల్లా వింత.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### డబ్బెవరికి చేదుకాదు!

బీహార్ శాసనసభకు నిజాయితీపరులు, విద్యావంతులు ఒక్కరు కూడా ఎన్నికవలేదు. ఎన్నికయిన వారందరు అధికార పార్టీకి చెందినవారు. నేరచరిత గలవారు కోటీశ్వ రులు ప్రజలకు డబ్బు ఆశ పెట్టి ఓట్లు వేయించుకున్నా రు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ చేసిన పనులను ఇప్పుడు బిజెపి చేస్తోంది. ప్రపంచ బ్యాంకు అందించిన డబ్బులను ఇలా ఉపయోగిస్తోంది.

- శాస్త్రి, హైదరాబాద్

### రైతులను ఆదుకోండి

భారతదేశ ఆర్థికవ్యవస్థకు వెన్నెముకఅయిన రైతు, వాతా వరణ మార్పుల కారణంగా తీవ్ర కష్టాలను ఎదుర్కొంటు న్నాడు.సకాలంలో రుతుపవనాలు రాక పంటలు ఎండిపో తుంటే, అకాలవర్షాలు చేతికొచ్చిన పంటను నాశనం చేస్తు న్నాయి. పెట్టుబడికి తగిన గిట్టుబాటు ధర లేకపోవడం, పంట నష్టాలు, అప్పుల భారం రైతులను ఆత్మహత్యల వైపునెడుతున్నాయి.గణాంకాలప్రకారం,ప్రతిరోజూ సగటు న 28మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇది కేవలం రైతుల సమస్య మాత్రమే కాదు, దేశం మొత్తం ఆహార భద్రతపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

-కె.రామారావు, హైదరాబాద్

### డిజిటల్ వ్యసనం

సాంకేతికపురోగతి యువతకుఅపారమైన అవకాశాలు తెరవగా, అదే పురోగతి ఒక నిశ్శబ్ద బంధనాన్ని సృష్టిస్తోంది డిజిటల్ వ్యసనం. చరవాణి తెరపై మొదలై సామాజిక మాధ్యమాల్లో ముగిసే ఈ కొత్త జీవన శైలి, తెలియకుండానే యువతను ఒక కనిపించని గోడల వెనుక బంధిస్తోంది. రోజువారీగా వచ్చే నోటి ఫికేషన్లు, ఫోటోలపై స్పందనలు, ఇష్టపడింది గుర్తులు, అను చరుల సంఖ్యలు ఇవన్నీ వారివిలువను నిర్ణయించే ప్రమాణాలు గా మారాయి. బయట ప్రపంచం ఎలా ఉన్నా, స్మార్ట్‌ఫోన్ తెరలపై కనిపించే ప్రతిస్పందనలే సంతోషం, ఆందోళన, ఆత్మవిశ్వాసం అన్నీ అవుతున్నాయి. ఈ వర్చువల్ ప్రపంచంపై అతిగా ఆధారపడటం, నిజజీవిత అనుభూతులను మసకబార్చు తోంది. ముఖాముఖి సంభాషణలు తగ్గిపోగా, ఒంటరితనం పెరుగుతోంది. దీర్ఘకాలిక తెర వినియోగం నిరాశ, ఆతురత, ఏకాగ్రత లోపం వంటి సమస్యలను పెంచుతుందని అధ్యయ నాలు చెబుతున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### నిస్వార్థమైన ఓటుతోనే ప్రగతికి బాటలు

కులాన్ని చూసి కాదు గుణాన్ని నమ్మి ఓటేసినప్పుడే సమాజం బాగుపడుతుంది. సమసమాజం ఏర్పడుతుంది. రాజకీయమం టే కులాలు మతాలు కావని లౌకిక రాజ్యమని తెలుసుకోవాలి. ఓటు అనేది అభివృద్ధికి బాటలు వేసేలా ఉండాలి కానీ అవినీ తికి పట్టం కట్టేలా ఉండొద్దు. ఓ జనులారా! జెండా కాదు అభ్యర్థి ఏజెండా చూడండి.

- కాల్వ నిఖిత,సిద్దిపేట

### ఆర్థిక సహాయం కల్పించాలి

విజ్ఞాన శాస్త్రాన్ని కేవలం వారి చదువులో భాగంగా పరిశోధన చేస్తూ ఒక దృక్పథంతో చేపట్టిన ప్రయోగ ఫలితాలు మనిషి జీవనానికి, ప్రాణరక్షణకు,సౌలభ్యానికి తోడ్పడే మహానుభావుల త్యాగం అమూల్యం, చిరస్మరణీయం. వాటి ఫలితాలు అనుభ వించడం చాలా తేలిక. కావున అటువంటి ఆశయాన్ని, కృషిని గుర్తిస్తూ ఉన్నత విద్యావంతులు ఉద్యోగంతో పాటు మరింత ముందుకు సాగేందుకు కృషి చేస్తే మరిన్ని రంగాల్లో కొన్ని సమస్యలు పరిష్కారం అవ్వొచ్చు. వీటికోసం దేశంలో పరిశో ధన చేసే విద్యార్థులకు ఆర్థిక సహాయం, ప్రోత్సాహం విరివిగా కల్పించాలి. వారికి అన్ని వనరులు కల్పిస్తే వయస్సు పెరిగినా లక్ష్యసాధనకోసం వారు శ్రమించగలరు.

-బి.మేఘానాధం, విశాఖపట్నం

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# పెరుగుతున్న ఆర్థిక అసమానతలు

**దేశాల సంపద పెరుగుతూ, ప్రభుత్వాలు పేదరికంలోకి నెట్టబడు తున్నాయన్న నివేదిక విశ్లేషణ మన దేశంలో జరుగుతున్న పరిణామాలను సాక్షాత్కరించింది. నేషనల్ ఎసెట్ మాని టైజేషన్ పైప్లైన్,ప్రభుత్వరంగ సంస్థల వాటాల ఉపసంహా రణ, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, మూసివేతలు, ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టే విధా నాలు ఆర్థిక అసమానతలను మరింత పెంపొందిస్తాయన్న వాస్తవాన్ని ప్రభుత్వాలు గ్రహించాలి. అంతర్జాతీయ అనుభ వాల, నివేదికల సారాంశాన్ని క్రోడీకరించి, దేశ ఆర్థిక విధా నాలను పాలకులు పునఃసమీక్షి ంచుకోవలసిన సమయం ఆస న్నమైనది. సంపద కేంద్రీకృతం చేసే కార్పొరేట్ అనుకూల విధానాలను నిలువరించి, ఆదాయ అంతరాలను తగ్గించే దిశగా ప్రజానుకూల ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పనే భవిష్యత్ తరాలకు చూపే నిజమైన దార్శనికత.**



జి. కిషోర్ కుమార్

ప్రపంచీకరణ వలన అవకాశాలు విశ్వవ్యాప్తమోతాయని, ఆర్థిక సంస్కరణల అమలు వలన అభివృద్ధి ఫలాలు అందరికీ చేరువౌతాయని ఊదరగొట్టిన ఆర్థిక సంస్కరణాభిలాషుల వాదనలని పూర్వపక్షం చేస్తూ, ఆర్థిక సంస్కరణలు, ఉదారవాద విధానాలు అమలు, ఆచరణలో విఫల యత్నమై తిరోగమన దిశలో పయనించి ఆదాయ అసమానతలని పెంచిందనే వాస్తవాన్ని ఇటీవల విడుదలయిన 'ప్రపంచ అసమానతల నివేదిక 2026' ఆవిష్కరించింది. ఈ నివేదిక ను ప్యారిస్ కేంద్రంగా ఉన్న వరల్డ్ ఇనీక్వాలిటి లాబ్ ఆధ్వర్యంలో 200 మంది రిసెర్చ్ స్కాలర్స్ క్షేత్ర స్థాయి కృషి, అధ్యయనం, సహాయ సహకారాలతో వివిధ దేశాల నివేదికలను, సూచీలను, పట్టికలను విశ్లేషించి అంతర్జాతీయం గా పెరుగుతున్న అసమాతల సారాంశాన్ని క్రోడీకరించారు. 'ప్రపంచ అసమానతల నివేదిక 2026' ప్రకారం, అత్యంత అసమానతలతో,పెరుగుతున్న పేదరికంతో కూడిన సంపన్న ఉన్నతవర్గం ఉన్నదేశంగా భారత్ ఆవిర్భవించింది. భారత దేశంలో సంపన్న వర్గంగా ఉన్న 1శాతం జనాభా, మొత్తం దేశ సంపదలో 40 శాతం సొంతం చేసుకున్నారు. అలాగే 37 శాతం ప్రపంచ సంపదను, ప్రపంచంలోని కేవలం 1 శాతం సంపన్న వర్గం నియంత్రిస్తోంది. భారత దేశంలో సగటు వార్షిక తలసరి ఆదాయం 7,273 డాలర్లుగానూ, సగటు నెలవారి ఆదాయం 605 డాలర్లుగా ఉంది. భారత దేశ జాతీయ ఆదాయం మొత్తంలో 58 శాతం మేరకు 10 మంది కైవసం చేసుకుంటున్నారు. ఆదాయ అంతరాలు స్థిరంగా కొనసాగుతూనే ఉన్నాయి. రెండు వర్గాల మధ్య ఆదాయ అంతరాల నిష్పత్తి 2014లో 38శాతం ఉంటే, 2024లో ఇది 38.2 శాతానికి పెరిగింది. దేశ జనాభాలో అత్యధికులు దేశ సంపదలో చాలా కొద్ది భాగంతోనే జీవిస్తున్నారని, దిగువన ఉన్న 50శాతం మంది జాతీయ ఆదాయంలో కేవలం 15 శాతం మాత్రమే పొందుతున్నారని నివేదిక పేర్కొన్నది. సంపద తారతమ్యాల విశ్లేషణలో భాగంగా భారతదేశంలో 10 శాతం సంపన్న వర్గం మొత్తం దేశ సంపదలో 65శాతం సంపదని కలిగివున్నదని నివేదిక వెల్లడించింది. అంతర్జాతీయంగా చూసినపుడు 0.001 గా ఉన్న కుబేరులు క్రింది స్థాయిలో ఉన్న 50శాతం కన్నా 3 రెట్లు సంపదను కైవసం చేసుకున్నారు. అంతర్జాతీయంగా ఉన్నత స్థాయిలో ఉన్న 10 శాతం సంపన్న వర్గం ప్రపంచ సంపదలో ఉన్న 75 శాతం సొంతం చేసుకున్నారు. క్రింది స్థాయిలో ఉన్న 50శాతం ప్రజానికం ప్రపంచ సంపదలో కేవలం 2 శాతం భాగస్వామ్యానికి పరిమితమయ్యారు. ప్రపంచ సంపద పంపిణీ విధాన ప్రక్రియలో చైనా పరిస్థితి పురోగమనంలో ఉండడం గమనార్హం. సంపద వృద్ధిలో ప్రజల భాగస్వామ్యం 40శాతానికి పెరిగి, ప్రపంచ సంపద పంపిణీలో ఉన్నత మధ్యతరగతి స్థాయికి చేరింది. అదే సమయంలో భారత్లో ఈ అంశంలో వృద్ధి నమోదుకాక పోగా, మరింత దిగజారుడు ధోరణి కనపర్చడం ఆందోళ నకర పరిణామం. శ్రామిక మహిళా భాగస్వామ్యం చాలా తక్కువ స్థాయికి అంటే 15.7 శాతానికి పరిమితమవ్వడమే కాకుండా, వివిధ రంగాల వారీగా కూడా ఆదాయ అంత రాలు హెచ్చుస్థాయిలో చోటుచేసుకుంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా లింగ వివక్ష, అసమానత ధోరణులు కొనసాగు తూనే ఉన్నాయని, పురుషుల ఒక గంట సంపాదనతో పోల్చినప్పుడు మహిళలు దానిలో 61శాతానికి మాత్రమే పరిమితమవున్నారనేది నివేదిక సారాంశం. ప్రాంతాలవారీ గా శ్రామిక మహిళా ఆదాయం ప్రాతిపదికగా చూసినప్పుడు మిడిల్ ఈస్ట్,నార్త్ ఆఫ్రికా 16 శాతం, సౌత్ ఈస్ట్ ఆసియా



20శాతం, సబ్ సహారన్ ఆఫ్రికా 28శాతం, ఈస్ట్ ఆసియా 34శాతం, యూరోప్ 40శాతంగా ఉంది. మొత్తం అంతర్జాతీయ శ్రామిక ఆదాయంలో మహిళా శ్రామిక ఆదాయం 25 శాతానికి పరిమితమయినది. వాతావరణ సమతౌల్యం అంశానికి సంబంధించి, ఉన్నత ఆదాయ వర్గానికి చెందిన 10 మంది సంపన్నులు 77శాతం మేరకు,అలాగే 1 శాతం అత్యంత సంపదవర్గం, 41శాతం మేరకు ప్రైవేటు పెట్టుబడుల అజమాయిషీతో కర్బన ఉద్గారాల ఉత్పత్తికి కారణమవుతున్నారు. పేదరిక స్థాయిలో ఉన్న 50శాతం మంది ప్రజల కర్బన ఉద్గారాల ఉత్పత్తి కేవలం 3శాతం మాత్రమే. ప్రపంచ వ్యాప్తంగా ఆదాయాలు, సంపద, లింగ వివక్ష వంటివి ఆర్థిక వ్యవస్థలలో క్రమానుగతంగా, ప్రభావవంతమైన, లోతైన ప్రభావాన్ని చూపుతున్నాయి. అతి తక్కువ మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం, అంతర్జాతీయంగా సంపద పంపిణీలో బలహీనమైన బహుపాక్షికమైన పోకడలు, పెరుగుతున్న మహాధనవంతుల సంపద కేంద్రీకరణ, బలహీనమైన పన్నుల విధానాల అమలు వంటి వాటితో పాటు, పన్నుల విధాన అమలు పద్ధతిలో లొసుగులు ధనిక వర్గానికి ప్రయోజనం చేకూర్చేవిగా ఉండడం, సవాళ్లను గుర్తించినప్పటికీ విధానపరమైన సిఫార్సులను అమలుచేయకపోవడం వంటి అంశాలు అసమాతల వృద్ధికి మూలకారణాలని ఈ నివేదిక నిర్ధారించింది. కోటీశ్వరులు, సహస్ర కోటీశ్వరులపై పన్నులు విధించే విధానంలో ప్రభుత్వాలు అవలంభిస్తున్నతిరోగమన పద్ధతుల ఫలితంగా ఆయా ప్రభుత్వాలు ఆదాయాలు కోల్పోవడం, నష్టపోవడం జరుగుతోందని, విద్యా, వైద్యం, వాతావరణం వంటి కీలక రంగాల అభివృద్ధిని ఇదిప్రభావితం చేస్తోందనేది నివేదికా బృంద అధ్యయనంలో అంతర్భాగంగా ఇమిడివున్న అంశం. ప్రగతిశీల పన్ను విధానాలను అమలుచేయాల్సిన ఆవశ్యకతను నివేదిక పునరుద్ఘాటించింది. పన్నులు విధించే ప్రక్రియలో లొసుగులను తొలగించి, సంపన్న, అతి సంపన్న వర్గాలపై ప్రభావవంతమైన సంపద పన్ను విధానాన్ని అమలుచేయాల్సిన ఆవశ్యకతను ఈ నివేదిక ఉటంకించింది. లింగ వివక్షతకు సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ, మహిళల వేతన రహిత పనివిధానానికి విలువనివ్వకపోవడం, మహిళల ఆర్థిక వెసులుబాటును అణిచివేస్తోందని, వేతనాలు లేని మహిళల శ్రమను గుర్తించాలని, దానిని తగ్గించాలని, ఇటువంటి అంశాల కోసం ప్రత్యేక కేటాయింపులు చేయడంతో పాటు, మహిళా శ్రామికుల భాగస్వామ్యం,నైపుణ్యాల మెరుగుదల, పిల్లల సంరక్షణ వంటి పరిస్థితులు వారికి అనుకూలంగా ఉండేలా చూడాల్సిన ఆవశ్యత ఉందని నివేదిక ప్రస్తుతించడం గమనార్హం.అంతర్జాతీయంగా భారతదేశంలోనూ, అసమానతలు చారిత్రాత్మక స్థాయికి చేరాయన్న అంశాన్ని ప్రపంచ అసమానతల నివేదిక 2026 స్పష్టం చేసింది. అంతర్జాతీయంగా సంపద పంపిణీలో భారతదేశ కుంగుబాటును సరిదిద్దుకోవాల్సిన ఆవశ్యకతను స్పష్టీకరించింది. సమ్మిళిత వృద్ధిసాధన కోసం మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం, సామాజిక న్యాయం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన, ధృఢమైన రాజకీయ చిత్తం, ప్రభావవంతమైన పరిపాలన, మానవ వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టివంటివి ఆవశ్యకమని నివేదిక ముక్తాయించింది. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్పిజి)అమలు నేపథ్యంలోఆంక్షలు, నియంత్రణలులేని, నయా ఉదారవాద విధానాల వలన ఆదాయ వ్యత్యాసాలు మరింతగా పెరిగాయి.నియంత్రణలేని నయా సరళీకరణ, ఉదారవాద ఆర్థిక విధానాల అమలు, సాగుతున్న ప్రస్తుత నేపథ్యంలో అంతర్జాతీయఅసమానతల నివేదిక 2026 ఆవిష్కరించిన భారతదేశ వాస్తవ పరిస్థితిని సమీక్షించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. దేశాల సంపద పెరుగుతూ, ప్రభుత్వాలు పేదరికంలోకి నెట్టబడుతున్నాయన్న నివేదిక విశ్లేషణ మన దేశంలో జరుగుతున్న పరిణామాలను సాక్షాత్కరించింది. నేషనల్ ఎసెట్ మానిటైజేషన్ పైప్లైన్,ప్రభుత్వరంగ సంస్థల వాటాల ఉపసంహరణ, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, మూసివేతలు, ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలు ఆర్థిక అసమానతలను మరింత పెంపొందిస్తాయన్న వాస్తవాన్ని ప్రభుత్వాలు గ్రహించాలి. అంతర్జాతీయ అనుభవాల, నివేదికల సారాంశాన్ని క్రోడీకరించి, దేశ ఆర్థిక విధానాలను పాలకులు పునఃసమీక్షించుకోవలసిన సమయం ఆసన్నమైనది. సంపద కేంద్రీకృతం చేసే కార్పొరేట్ అనుకూల విధానాలను నిలువరించి, ఆదాయ అంతరాలను తగ్గించే దిశగా ప్రజానుకూల ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పనే భవిష్యత్ తరాలకు చూపే నిజమైన దార్శనికత. •

# రైతుల సమస్యలు పట్టించుకోండి

తరిగోపుల నారాయణస్వామి

రైతు మన దేశానికి అన్నదాత. భూమిని తల్లిగా భావించి, ఎండలోనూ వానలోనూ శ్రమించి పండించే పంటలు మనకు ప్రాణాధారం. అలాంటి రైతు ఈ రోజుల్లో తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో అరటి, మిరప, పత్తి, మొక్కజొన్న, నువ్వులు వంటి పంటలు విస్తారంగా సాగు అవుతున్నాయి. పండించిన పంటకు సరైన ధర రాక రైతు నిరాశలో మునిగిపోతున్నాడు. పెట్టుబడి కూడా రాక చాలామంది పంటను పశువులకు మేతగా ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది. అయితే అదే పంటను దళారులు తక్కువ ధరకు కొని పట్టణాల్లో అధిక లాభాలతో అమ్మి ధనాన్ని కూడబెడుతున్నారు. పంట పండించిన రైతు నష్టపోతున్నాడు. పంట కొనుగోలు చేసే వినియోగదారుడు కూడా అధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. కానీ మధ్యలో ఏ శ్రమలేని దళారులు సంపన్నులవుతున్నారు. ఇది సామాజిక న్యాయానికి, సమానతా విలువలకు విరుద్ధం. దీనిని మార్చడం అత్యవసరం. ప్రభుత్వం రైతుకు కనీసం పెట్టుబడికన్నా ఎక్కువ లాభం వచ్చే ధరను భరోసా ఇవ్వాలి. మార్కెట్‌లో అన్యాయం చేసే దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. పంట నిల్వశాలలు, చల్లని నిల్వగదులు, రవాణా సౌకర్యాలు పెంచాలి. ప్రజా




ప్రతి నిధులు రైతుల సమస్యలను కేవలం మాటల్లోనే కాక, పనిలో కూడా పరిష్కరించాలి. వారు గ్రామాల్లోని రైతులతో కలిసి నడిచి వారి కష్టాలను అర్థం చేసుకోవాలి. జపాన్, ఇజ్రాయెల్ దేశాలలో రైతులు తక్కువ భూమిపై ఎక్కువ దిగుబడులు పొందుతున్నారు.అందుకు కారణం నీటి పొదుపు పద్ధతులు, శాస్త్రీయ పంట మార్గదర్శకాలు, రైతే నేరుగా అమ్మే విపణులు. మన రైతుకూ అలాంటి సౌకర్యాలు రావాలి. దళారులు లేకుండా రైతు పంట వినియోగదారుని చేరే మార్గాలు పెరగాలి. గ్రామస్థాయిలో రైతు బజార్లు, సంఘాలు బలపడాలి. గ్రామ పంటగ్రామంలోనే అమ్ముకోవడం జరగాలి. పట్టణాల్లో స్థానిక పంటలకు మద్దతు పెరగాలి. వాతావరణ సూచనలు, పంటలకు కావలసిన సలహాలు రైతుకు తరచుగా అందాలి.పంట బీమా సంపూర్ణ రక్షణ ఇవ్వాలి. ఒక్క రైతు చెమట చుక్క కూడా వృథ కాకూడదు. స్థానిక రైతుల పట్ల ప్రేమ చూపాలి. రైతు పంటలనే ప్రాధాన్యత ఇవ్వాలి. రైతు కష్టాన్ని గౌరవించే మనస్తత్వం పెరగాలి. రైతు అభివృద్ధి చెందితేనే గ్రామాలు ప్రగతి పయనం పట్టగలవు. గ్రామాలు మెరుగుపడితేనే దేశం ఎదుగుతుంది. రైతు కష్టంతో దేశం జీవిస్తుంది. రైతు నవ్వితేనే ప్రతి ఇంటిలో ఆనందం వెలుగుతుంది. రైతును నిలబెట్టడం మనందరి కర్తవ్యం. •

# ద్రవిడ రాజకీయాన్ని విజయ్ తిరగరాస్తాడా?

గోరంట్ల శివరామకృష్ణ

మరో కొన్నినెలల్లో తమిళనాట అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. అక్కడి రాజకీయాలు వేడెక్కుతున్నాయి. సుమారు 50ఏళ్లుగా ద్రవిడ రాజకీయం పేరుతో అక్కడ పాలన చేస్తున్న డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలకు అనుబంధ పక్షాలుగా ఉన్న కాంగ్రెస్, బీజేపీలకు సవాలు విసురుతూ జనంలోకి పోతున్నాడు ప్రముఖ సినీనటుడు టీవీకే అధినేత విజయ్. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలే తన లక్ష్యంగా సభలు నిర్వహిస్తూ ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తున్నారు. 234 ఎమ్మెల్యేలున్న ప్రస్తుత తమిళనాడు అసెంబ్లీలో డీఎంకేకు 132మంది, అన్నాడీఎంకేకు 62మంది, కాంగ్రెస్‌కు 18, బీజేపీకి నలుగురు ఎమ్మెల్యేలున్నారు. వీరిలో కాంగ్రెస్, వామపక్షాలు అధికార డీఎంకేకు మద్దతుగా నిలుస్తుండగా, బీజేపీ అన్నాడీఎంకేలు ఒక జట్టుగా వ్యవహరిస్తున్నాయి.అయితే ఈ రెండు కూటములకు ప్రత్యామ్నాయంగా తన కొత్త పార్టీ నిలవాలని భావిస్తున్న విజయ్ మనసులో మాట బయటపెట్టకుండా తనదైన శైలిలో జనంలోకి పోతూ రోజురోజుకూ తన బలాన్ని పెంచుకుంటున్నారు. నిజానికి ద్రవిడ రాజకీయానికి, సినిమాకు అవినాభావ సంబంధం అనాదిగా కొనసాగుతూనే ఉంది. సినిమా రచయిత కరుణానిధి, ఆయన మిత్రుడు, ప్రత్యర్థి ఎంజీఆర్, ఆ తర్వాత సినీ నటి జయలలిత తమిళ సీఎంలుగా గద్దెనెక్కగా, మరెందరో సినీనటులు కీలక పదవులను అధిష్టించగలిగారు.అంతేకాదు తమిళనాట సినీనటులు రాజకీయాల్లో రాణించినతర్వాతే తెలుగునాట ఎన్టీఆర్ సీఎం అయ్యారు.దక్షిణాదిన జీవించే వారే మూలభారతీయులనీ, వీరు ఆర్యుల కంటే ప్రాచీనులనీ, ద్రవిడ సంస్కృతే నిజమైన భారతీయ సంస్కృతిఅని, మనమంతా ఆ ఘనమైన సంస్కృతికి వారసులుగా గర్వపడాలని చెబుతూనాడు పెరియార్ ద్రవిడ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమంలో మరొక నేత అన్నాదొరై కీలక పాత్ర పోషించారు. కొన్ని సినిమాల్లో నటించటమే గాక మాటల రచయితగానూ పనిచేశారు. జనంలో బలమైన ద్రవిడ భావన తీసుకొచ్చేందుకు అన్నాదొరై సినిమాను బలమైన మాధ్యమంగా గుర్తించి వాడుకొని, డీఎంకే పార్టీని స్థాపించి, తర్వాతి రోజుల్లో సీఎం కాగలిగారు. ఆ ఉద్యమంలో అప్పటికి సినీమాటల రచయితగా ఉన్న కరుణానిధి, సినీనటుడిగా ఉన్న ఎంజీ రామచంద్రన్ తదితరులు.. అన్నాదొరైకు అండగా నిలిచారు. వీరిలో కరుణానిధి తన పదునైన సినిమా డైలాగులతో, రామచంద్రన్ తన నటనతో తమిళుల మనసును గెలుచుకోగలిగారు. 1972లో అన్నాదురై మరణం తర్వాత డీఎంకే తరపున సీఎం అయిన కరుణానిధి మరో నాలుగు సార్లు ఆ పదవిని అధిష్టించారు. మిత్రుడైన కరుణానిధి తొలిసారి సీఎంగా ఉన్నకాలంలో ఆయనతో వచ్చిన రాజకీయ విరోధాల వల్ల డీఎంకేలో ఇమడలేకపోయిన ఎంజీ రామచంద్రన్ అన్నాడీఎంకే పేరుతో కొత్త పార్టీ పెట్టుకున్నారు. 1977 అసెంబ్లీ ఎన్నికల్లో ఘన



విజయం సాధించిన ఆయన 1987వరకు సీఎంగా కొనసాగారు. ఆయన మరణం తర్వాత ఈయన రాజకీయ వారసురాలిగా వచ్చిన జయలలిత 4 సార్లు సీఎంగా రాణించారు. తర్వాత ప్రముఖ నటుడు కమలహాసన్ 2018లో మక్కల్ నీది మైయం అనే రాజకీయ పార్టీని స్థాపించి రాజకీయ అరంగేట్రం చేసినాపెద్దగా రాణించలేకపోయారు.కరుణానిధి, జయలలిత మరణం తర్వాత తమిళనాట ఏర్పడినరాజకీయ శూన్యతను భర్తీ చేసేందుకు బీజేపీ చురుగ్గా పనిచేస్తోంది. కొత్త పార్లమెంటులో సెంగోల్ ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలతో తన ఓటు బ్యాంకును పెంచుకునే ప్రయత్నాలు చేస్తోంది. ప్రతిజిల్లాలో పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించి, 1,2,3 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించటం,2018 నాటి తూత్తుకుడిపోలీసు కాల్పుల్లో మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించటం వంటి సేవాకార్యక్రమాలతో యువతలో తన బలం పెంచుకున్న విజయ్ 2023చివరిలో తన రాజకీయ ప్రవేశం గురించి హింట్ ఇచ్చారు. 224 ఫిబ్రవరిలో 'తమిళగ వెట్రి కళగం'(టీవీకే) పేరుతో పార్టీ పెట్టి జనంలోకి దూసుకుపోతున్నారు. అవినీతి, విభజనపూరిత పాలనకు వ్యతిరేకంగా తాను రాజకీయాల్లోకి వచ్చానని, తనకు అవకాశమిస్తే.. తమిళనాడును దేశంలోనే నంబర్ 1 రాష్ట్రంగా మారుస్తానని విజయ్ పదేపదే చెబుతున్నారు.చదువుకున్న మహిళా అభ్యర్థులకు రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాధాన్యం ఇస్తాననీ, తమ పార్టీలోకి వచ్చేవారికి నేర చరిత్ర, అవినీతి మరకలు ఉండకూడదని ఆయన చెబుతున్నారు. తన పార్టీలో సినిమా నటులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉండదనీ ఆయన స్పష్టం చేశారు.టీవీకే నుంచి తానే ముఖ్యమంత్రి అభ్యర్థిగా విజయ్ ఇది వరకే ప్రకటించుకున్నారు. ద్రావిడ రాజకీయ ప్రభంజనంగా పేరొందిన ఎంజీ రామచంద్రన్‌లా తానూ వస్తున్నట్లు విజయ్ పలు సందర్భాల్లో పేర్కొన్నారు. సామాజిక న్యాయం,సమానత్వం, లౌకికవాదం,తమిళ సంస్కృతి పరిరక్షణ,అవినీతి నిర్మూలన, మహిళా సాధికారతకు పెద్దపీట వేశారు. పెరియార్, అంబేద్కర్ మాజీ ముఖ్యమంత్రి కె.కామరాజ్, స్వాతంత్ర్య సమర యోధులు రాణి వేలు నాచియార్, అంజలై అమ్మాళ్ తమ సైద్ధాంతిక స్ఫూర్తి అన్నారు. పుట్టుకతో అందరూ సమానమే అంటూ ప్రతి సభలోనూ నినదిస్తున్నారు. కేంద్ర తెస్తున్న త్రిభాషా విధానాన్ని వ్యతిరేకించటం, పార్లమెంటు నియోజక వర్గాల పునర్విభజన ప్రక్రియ, సీఏఏపై కేంద్రం తీరునూ విజయ్ తప్పుబట్టారు. కేంద్రం అమలు చేయాలనుకుంటున్న ఒకేదేశం, ఒకే ఎన్నిక విధానం ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడం లాంటిదేనని మండిపడిన విజయ్ తమిళ విద్యార్థులకు అవరోధంగా ఉన్ననీట్‌పరీక్షల తీరుపై విమర్శలు సంధిస్తూ తాను బీజేపీతో కలవబోనని సంకేతాలు ఇస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల్లో అసంతృప్తిగా ఉన్న నేతలను తనపార్టీలోకి ఆహ్వానిస్తూ పార్టీని బలోపేతంచేస్తున్నారు. అన్నాడీఎంకేలో ఏకంగా 9వసారి ఎమ్మెల్యేగా గెలిచిన సీనియర్ నేత సెంగోట్టైయ్యన్ తిరుగుబాటు చేయడంతో పార్టీ బహిష్కరించటంతో ఆయనకు స్వాగతం పలికి ప్రత్యర్థులకు షాకిచ్చారు విజయ్. కెప్టెన్ విజయకాంత్ తీసుకొచ్చిన దేశీయ ముర్పొక్కు ద్రావిడ కళగంతో సహా పలు చిన్న పార్టీలనూ కలిపి కూటమికట్టే యత్నాల్లో బిజీగాసాగిపోతున్నారు విజయ్. ఈ ప్రయత్నంలో విజయ్ ఏమేరకు విజయం సాధిస్తారనేది తెలియాలంటే.. మరికొన్ని నెలలు వేచిచూడాల్సిందే. •

# బాండీబీచ్‌లో యూదులపై కాల్పులు



## 12 మందిపైగా మృతి, మరికొందరికి తీవ్ర గాయాలు

## హాహాకారాలు చేస్తూ పరుగులు తీసిన పర్యాటకులు

**సిడ్నీ, డిసెంబరు 14:** ప్రముఖ పర్యాటక బాండీ బీచ్‌లో పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. శాంతి వాతావరణాన్ని భగ్నంచేస్తూ యూదుల పండుగ 'హనుక్క' తొలి రోజే లక్ష్యంగా ఈకాల్పులు జరిపారు. సిడ్నీలోని బాండీ బీచ్‌లో జరిగిన ఈ ఘటనలో కనీసం 12 మంది పర్యాటకులు మృతిచెందగా పలువురు గాయపడ్డారు. ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు మొత్తం 50 రౌండ్ల పాటు కాల్పులు జరిపినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పోలీసుల కాల్పుల్లో దుండగుడు హతమవ్వగా మరొకర్ని అరెస్ట్ చేసినట్టు అధికారులు తెలిపారు. ఉగ్రవాదుల కాల్పులతో పర్యాటకుల హాహాకారాలు చేస్తూ పరుగులు తీశారు. ప్రశాంతంగా ఉన్న బీచ్‌లో ఒక్కసారిగా బీతావాహ పరిస్థితి నెలకుంది. ఈ కాల్పుల ఘటనపై ఆస్ట్రేలియా ప్రధాన మంత్రి ఆంథోనీ అల్బనీస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని ఆయన అన్నారు. ఘటనా స్థలిలో బాధితులను రక్షించేందుకు పోలీసులు, అత్యవసర సహాయ సిబ్బంది ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఎఎఫ్‌పి కమిషనర్, న్యూసౌత్‌వేల్స్ ప్రీమియర్‌లతో మాట్లాడాను మేము స్థానిక పోలీసులతో కలిసి పనిచేస్తున్నాం, మరిన్ని వివరాలను ధ్రువీకరించిన అనంతరం తదుపరి సమాచారం అందిస్తాం, పోలీసుల సూచనలను ప్రజలు పాటించాలని ఆసీస్ ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ విజ్ఞప్తి చేసారు. బాండీ బీచ్‌లో ఘటనపై సమాచారం అందిన వెంటనే స్పందించామని న్యూ సౌత్ వేల్స్ పోలీసులు చెపుతూ అక్కడ ఉన్నవారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. కాల్పులు జరిపిన ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నామనిపోలీసులు చెప్పారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని, పోలీసులిచ్చే అన్ని సూచనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఎనిమిది రోజుల పాటు కొనసాగే యూదుల పండుగ 'హనుక్కా' మొదటి రోజే ఈ ఘటనచోటుచేసుకుంది. ఆస్ట్రేలియా కాలమానం ప్రకారం సాయంత్రం 6.30 గంటల తర్వాత యూదుల పండుగ ఆరంభాన్ని గుర్తిస్తూ బీచ్‌లో వందలాది మంది చేరిన సమయంలోనే దుండగులు కాల్పులుప్రారంభించారు. పిల్లలు,వృద్ధులు అనే తేడా లేకుండా విచక్షణరహితంగా కాల్పులు జరిపారు. ఘటనపై ప్రతిపక్ష నాయకురాలు సుసాన్‌లే తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మన మంతా ఏంతో ఇష్టపడే బాండీలో జరిగిన విద్వేషపూరిత హింసతో యావత్తు దేశం శోకంలో మునిగిపోయిందని వాపోయారు. అయితే కాల్పుల్లో ఒక పర్యాటకుడు యూదు వ్యక్తి ఉగ్రవాదిని ప్రతిఘటించి ఆతడి చేతిలో తుపాకీ లాక్కని కాల్పులు జరపడంతో ఉగ్రవాది అక్కడికక్కడేహతమయ్యాడు. ఈఘటనపై ఇజ్రాయెల్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. నిఘా వైఫల్యం వల్లనే ఇలాజరిగిందని, ఆసీస్‌ప్రభుత్వం ఇందుకు బాధ్యత వహించాలని ఒక నిరసనను ఆస్ట్రేలియా ప్రభుత్వానికి తెలియజేసింది.



# వచ్చే ఫిబ్రవరి 12న బంగ్లాదేశ్ ఎన్నికలు

## ప్రధాన ఎన్నికల కమిషనర్ నాసిర్ ఉద్దీన్ వెల్లడి

**ఢాకా, డిసెంబరు 14:** బంగ్లాదేశ్‌లో రాజకీయాలు క్షణక్షణం మారుతున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12వ తేదీన దేశంలో సాధారణ ఎన్నికలు జరగనున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ నాసిర్ ఉద్దీన్ ప్రకటించారు. ఎన్నికలు నిర్వహించాలన్న ఒత్తిళ్లు పెరుగుతుండటంతో కేర్‌టేకర్ ప్రభుత్వ చీఫ్ మహ్మద్‌యూనస్ ఎన్నికల నిర్వహణకు తలొగ్గాల్సి వచ్చింది. బంగ్లాదేశ్‌లో సాధారణ ఎన్నికల నిర్వహణకు ముహూర్తం ఖరారు అయింది. ముఖ్యంగా ఈనెల 29వ తేదీ నుంచి నామినేషన్లు వేయాల్సి ఉండగా వచ్చే ఏడాది జనవరి 20వ తేదీ వరకు ఉపసంహారణ గడువు ఉంటుంది. అలాగే ఫిబ్రవరి 12వ తేదీన పోలింగ్ నిర్వహించ నున్నారు. బంగ్లాదేశ్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 127.6 మిలియన్లకు పైగాఉన్నారు. వీరంతా ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియో గించుకోనున్నారు. ఒకేరోజు పార్లమెంటరీ ఎన్నికలతో పాటు రాజ్యాంగ సంస్కరణలపై రెఫరెండం నిర్వహించడం బంగ్లాదేశ్ చరిత్రలో ఇదే తొలిసారి. అయితే ఈ నిర్ణయాన్ని ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ బిఎన్‌పి వ్యతిరేకించింది. గత యేడాది ఆగస్టు ఆందోళనల తర్వాత మాజీ ప్రధాని షేక్ హాసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీ కార్యకలా పాలను నిషేధించారు. దీంతో గణనీయమైన మద్దతు ఉన్న అవామీ లీగ్ ఎన్నికల్లో పాల్గొనే అవకాశం లేకపోవడం, ఎన్నికల పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. మరోవైపు హాసీనా పాలనలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బిఎన్‌పి ఈ ఎన్నికల్లో ముందున్నట్లు భావిస్తున్నారు. అలాగే 2024 ఆగస్టులో జరిగిన ఆందోళనలకు నేతృత్వం వహించిన విద్యార్థిఉద్యమంనుంచి పుట్టిన నేషనల్ సిటిజన్ పార్టీ, జమాత్‌ఏఇస్లామీకి చెందిన అమర్ బంగ్లాదేశ్ పార్టీతో పొత్తు పెట్టుకొని ఈ ఎన్నికల బరిలోకి దిగుతున్నాయి. షేక్ హాసీనా ప్రభుత్వం దిగిపోయినతర్వాత బంగ్లాదేశ్‌లో జరుగనున్న ఈ ఎన్నికలు ఇపుడు అక్కడి రాజకీయ పార్టీలకే కాకుండా ప్రపంచదేశాలను ముఖ్యంగా ముస్లిం దేశాలకు ప్రాధాన్యతాంశంగా మారాయి.



# సిరియాలో ఐసిస్ దాడులు

## ఇద్దరు అమెరికా సైనికులు, ఒక ట్రాన్స్‌లేటర్ మృతి

**బీరూట్, డిసెంబరు 14:** సిరియాలో ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు, ఒక పౌర అనువాదకుడు మరణించారు. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. దీనికి చాలా తీవ్రమైన ప్రతీకారం ఉంటుందని హెచ్చరించారు. ఈ దాడిలో మరో ముగ్గురు సైనికులు గాయపడినట్లు ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్టులో తెలిపారు. ఐసిస్‌ను నిర్మూలించేందుకు అమెరికా చేపట్టిన ఆపరేషన్ ఇన్హెరెంట్ రిజాల్వ్‌లో భాగంగా ఈ సైనికులు పనిచేస్తున్నారు. పాల్మైరా ప్రాంతంలో కీలక నేతలతో సమావేశమవుతున్న సమయంలో ఈ దాడి జరిగింది. గత ఏడాది డిసెంబర్‌లో బషర్ అల్‌అస్సాద్ అధికారం కోల్పోయిన తర్వాత సిరియాలో అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోవడం ఇదే తొలిసారి. దాడికి పాల్పడిన వ్యక్తి సిరియా ప్రభుత్వ దళాలకు చెందిన సైనికుడేనని అక్కడి ప్రభుత్వం అంగీకరించడం గమనార్హం. అయితే, అతడిని ఇప్పటికే మట్టుబెట్టామని, అంతర్గత భద్రతా విభాగంలో అతడికి ఎలాంటి నాయకత్వ పాత్ర లేదని సిరియా ప్రభుత్వ ప్రతినిధి స్పష్టం చేశారు. పాల్మైరా ప్రాంతంలో ఐసిస్ దాడి జరిగే ప్రమాదం ఉందని తాము ముందే అమెరికాను హెచ్చరించినా వారు పట్టించుకోలేదని సిరియా ఆరోపించింది. ఈ దాడి జరిగిన ప్రాంతం సిరియా కొత్త ప్రభుత్వ పూర్తి నియంత్రణలో లేదని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఘటనపై సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్‌షరా తీవ్ర ఆగ్రహంతో, ఆవేదనతో ఉన్నారని తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో భాగంగా ఇటీవలే అల్‌షరా వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో సమావేశమయ్యారు. తాజా పరిణామం ఇరు దేశాల మధ్య సహకారానికి పరీక్షగా నిలిచింది.

# రోడ్ ఐలాండ్ బ్రౌన్ వర్సిటీలో కాల్పులు



## ఇద్దరు మృతి, ఎనిమిది మందికి గాయాలు

**రోడ్ ఐలాండ్( యుఎస్), డిసెంబరు 14:** అమెరికాలో మరోసారి కాల్పుల ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. రోడ్ ఐలాండ్ రాష్ట్రంలోని ప్రఖ్యాత బ్రౌన్ యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగిన కాల్పుల్లో ఇద్దరు మరణించగా, మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. యూనివర్సిటీలో ఫైనల్ పరీక్షలు జరుగుతున్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. నిందితుడి కోసం పోలీసులు క్యాంపస్ వ్యాప్తంగా గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ప్రొవిడెన్స్ మేయర్ బ్రెట్ స్మైలీ ఈ ఘటనను ధ్రువీకరించారు. నల్లటి దుస్తులు ధరించిన ఓ వ్యక్తి ఈ కాల్పులకు పాల్పడి, ఇంజినీరింగ్ భవనం నుంచి పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, అధికారులు సురక్షితమని ప్రకటించే వరకు బయటకు రావద్దని మేయర్ విజ్ఞప్తి చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు. ఘటన జరిగిన వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు యూనివర్సిటీ అధికారులు తొలుత ప్రకటించినా, ఆ తర్వాత ఆ సమాచారాన్ని సరిదిద్దారు. నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోందని స్పష్టం చేశారు. తొలుత అదుపులోకి తీసుకున్న వ్యక్తికి ఈ ఘటనతో సంబంధం లేదని తేలినట్లు మేయర్ స్మైలీ పేర్కొన్నారు. ఈ దాడిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఘటన గురించి అధికారులు తనకు వివరించారని, బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా విచారం వ్యక్తం చేస్తూ, దర్యాప్తులో ఎఫ్‌బీఐ సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం క్యాంపస్‌ను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని, దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# 12 చిన్న ప్రావిన్సులుగా పాకిస్థాన్ అంతర్గత విభజన!



**ఇస్లామాబాద్, డిసెంబరు 14:** స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత పాకిస్థాన్‌లో మళ్లీ విభజన అంశం ప్రస్తావనకు వచ్చింది. ఒకటి, రెండుకాదు.. ఏకంగా 12 భాగాలుగా పాకిస్థాన్‌ను విభజించాలని పాక్‌షరీఫ్ ప్రభుత్వం యోచిస్తోంది. అయితే ఇది కేవలం అంతర్గత విభజన. పాక్ జాతీయ సమాచార శాఖ మంత్రి అబ్దుల్ అలీమ్ ఖాన్ విభజన గురించి ప్రకటించడంతో దీనిపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. పాలనా సౌలభ్యం, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే పాకిస్థాన్‌ను 12 చిన్న ప్రావిన్సులుగా విభజించాలని నిర్ణయించామని మంత్రి చెప్పారు. పాకిస్థాన్‌లో ప్రస్తుతం ఉన్న నాలుగు ప్రావిన్స్‌లు - పంజాబ్, సింధ్, ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ లను విభజించి 12 చిన్న ప్రావిన్సులుగా చేయడానికి రంగం సిద్ధమైందని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. దీని గురించి పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌ల మధ్య ఇప్పటికే చివరి దశ చర్చలు ముగిశాయని మరి కొద్ది రోజుల్లోనే ఈ విభజన ప్రక్రియ మొదలవుతుందన్న ప్రచారం జోరందుకుంది. స్వాతంత్ర్యం నాటికి అంటే 1947 కాలంలో పాకిస్తాన్‌లో ఐదు ప్రావిన్సులు ఉన్నాయి. అవి బలుచిస్తాన్, తూర్పు బెంగాల్, సింధ్, పశ్చిమ పంజాబ్, వాయువ్య సరిహద్దు ప్రావిన్స్. మెరుగైన సేవలు, పరిపాలనా సౌలభ్యం కోసమే చిన్న ప్రావిన్సుల ఏర్పాటు చేయాలనుకుంటున్నట్టు పాక్ పాలకులు చెబుతున్నా దేశంలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతకొంతకాలంగా ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్తాన్ ప్రాంతాల్లో ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ రెండు ప్రాంతాల ప్రజలు తమను స్వతంత్ర దేశాలుగా ప్రకటించాలని గత కొంత కాలంగా ఆందోళనలు చేస్తున్నారు. అలానే పాక్ ప్రధాని, అసిమ్ మునీర్‌ల పాలన మీద ప్రజల్లో వ్యతిరేకత రోజు రోజుకు పెరుగుతోంది. దీంతో విభజన చర్చ తెర మీదకు వచ్చింది.

# పవార్ పుట్టినరోజు వేడుకల్లో అదానీ, రాహుల్ కరచాలనం!



**ముంబయి, డిసెంబరు 14:** ఎన్సీపీ అధినేత శరద్ పవార్ పుట్టినరోజు విందులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆయన నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ముఖాముఖిగా కలుసుకున్నారు. ఇద్దరూ కరచాలనం కూడా చేసుకున్నారు. ఈ అరుదైన దృశ్యం కెమెరాల్లో బందీ కాకుండా నిర్వాహకులు చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈనెల 11న శరద్ పవార్ 85వ పుట్టినరోజు సందర్భంగా ఈ విందు జరిగింది. రాజకీయాలకు అతీతంగా సంబంధాలు నెరిపే పవార్, ఈ కార్యక్రమానికి అన్ని పార్టీల నేతలతో పాటు వ్యాపార ప్రముఖులను కూడా ఆహ్వానించారు. ఈ విందులో రాహుల్ గాంధీ, పవార్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్న ఫోటోలు బయటకు వచ్చినా, రాహుల్, అదానీ కలిసిన ఫోటోలు మాత్రం కనిపించలేదు. సీనియర్ జర్నలిస్టులు రాజ్‌దీప్ సర్దేశాయ్, ఆదేశ్ రావల్ ఒక చర్చా కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించారు. రాహుల్, అదానీ ముఖాముఖిగా కలవడం నేను చూడటం అదే మొదటిసారి. కానీ ఆశ్చర్యంగా వారి ఫోటో ఒక్కటి కూడా బయటకు రాలేదుఅని సర్దేశాయ్ తెలిపారు. ఆ సమయంలో పవార్ కుమార్తె, బారామతి ఎంపీ సుప్రియా సూలే జోక్యం చేసుకుని, వారిద్దరి ఫోటోలు ఎవరూ తీయకుండా అడ్డుకున్నారని ఆదేశ్ రావల్ వివరించారు. ఈ ఫోటో బయటకు వస్తే రాజకీయంగా కాంగ్రెస్‌కు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవు తాయని ఆమె భావించి ఉండవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలు లేకపోయినా, విషయం తెలిసిన వెంటనే బిజెపి కాంగ్రెస్‌పై విమర్శలు ఎక్కుపెట్టింది. అదానీపై నిత్యం గొంతు చించుకునే రాహుల్ గాంధీ, ఇప్పుడు ఆయనతో కలిసి విందులో పాల్గొనడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని బిజెపి నేతలు ఆరోపించారు. గత కొన్నేళ్లుగా అదానీ గ్రూప్‌ను లక్ష్యంగా చేసుకుని రాహుల్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఇటీవల కాంగ్రెస్ వైఖరిలో మార్పు కనిపిస్తోందని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అదానీ గ్రూప్ భారీ పెట్టుబడులు పెట్టడమే దీనికి నిదర్శనమని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# సంక్షిప్తంగా..

## సిఐసి ప్రధాన కమిషనర్‌గా రాజ్‌కుమార్ గోయల్



**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** కేంద్ర సమాచార కమిషన్ (సిఐసి) నూతన ప్రధాన కమిషనర్‌గా రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రాజ్‌కుమార్ గోయల్ నియమితులయ్యారు. ఆయనతో పాటు మరో 8 మందిని కమిషనర్లుగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీనేతృత్వంలోని త్రిసభ్య కమిటీ చేసిన సిఫారసుల మేరకు ఈ నియామకాలు జరిగాయి. కొత్తగా నియమితులైన వారిలో సీనియర్ జర్నలిస్టులు పీఆర్ రమేశ్, అశుతోష్ చతుర్వేది, రైల్వే బోర్డు మాజీ చైర్‌పర్సన్ జయవర్మ సిన్హా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుధారాణి రేలంగి వంటి ప్రముఖులు ఉన్నారు. సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాజ్‌కుమార్ గోయల్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నియామకాలతో సిఐసిలో ఖాళీగా ఉన్న చీఫ్ సహా మొత్తం 9 పోస్టులు భర్తీ అయ్యాయి. సుమారు తొమ్మిదేళ్ల తర్వాత కమిషన్ పూర్తిస్థాయి సామర్థంతో పనిచేయనుండటం గమనార్హం.

## దక్షిణాఫ్రికాలో కుప్పకూలిన హిందూదేవాలయం

**డర్బన్, డిసెంబరు 14:** దక్షిణాఫ్రికాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. క్వాజులునాటల్ ప్రావిన్స్‌లో నిర్మాణంలో ఉన్న నాలుగు అంతస్తుల హిందూ దేవాలయం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో భారత సంతతికి చెందిన వ్యక్తిసహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. డర్బన్‌కు ఉత్తరాన ఉన్న రెడ్‌క్లిఫ్ ప్రాంతంలో న్యూ అహోబిలం టెంపుల్ ఆఫ్ ప్రొటెక్షన్ పేరుతో ఈ ఆలయ నిర్మాణం జరుగుతోంది. కార్మికులు పనుల్లో నిమగ్నమై ఉండగా భవనంలోని ఒక భాగం ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆలయ ట్రస్ట్ కార్యవర్గ సభ్యుడు, నిర్మాణ ప్రాజెక్ట మేనేజర్ అయిన విక్కీ జైరాజ్ పాండే (52) మరణించినట్లు అధికారులుగుర్తించారు. ఈ ఘటనలో మొత్తం నలుగురు మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు.

## దట్టమైన పొగమంచుతో వాహనాలు ఢీ

**చండీగఢ్, డిసెంబరు 14:** హర్యానాలో దట్టమైన పొగమంచు కారణంగా ఇవాళ పలుచోట్ల ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగాయి. రోడ్లపై కనీసం దారి కూడా కనిపించకపోవడంతో బస్సులు, ట్రక్కులతో సహా దాదాపు 40 వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదాల్లో పలువురు డ్రైవర్లు, ప్రయాణికులు గాయపడ్డారు. ముఖ్యంగా రోహ్తక్, హిసార్, రేవాడీ జిల్లాల్లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. రోహ్‌తక్‌లోని మెహమ్ ప్రాంతంలో ఒక హైవే కూడలి వద్ద సుమారు 35 నుంచి 40 వాహనాలు గొలుసుకట్టుగా ఢీకొన్నాయి. మొదట ఒక ట్రక్కు, కారు ఢీకొనగా, వెనుక వస్తున్న వాహనాలు ఒకదాని తర్వాత ఒకటి ఢీకొంటూ వెళ్లాయి. ఈ ఘటనలో అనేక వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు.

## రాజస్థాన్‌లో రామ్‌నామ్ డిపాజిట్ బ్యాంకు

**జైపూర్, డిసెంబరు 14:** బ్యాంకు అంటేనే సహజంగా గుర్తుకు వచ్చేది సొమ్ముడిపాజిట్లు లావాదేవీలు. కానీ రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఒక విభిన్నమైన బ్యాంకు ఉంది. ఇక్కడ ధనానికి బదులుగా రామ నామాలను డిపాజిట్లుగా స్వీకరిస్తారు. గోవింద్ దేవ్ జీ ఆలయ ప్రాంగణంలో రామ్ నామ ధన సంగ్రహ బ్యాంక్ పేరుతో ఇది కొనసాగుతోంది. ఇప్పటివరకు ఈ బ్యాంకులో సుమారు 14 వేల కోట్లకు పైగా రామనామాలను భక్తులు డిపాజిట్ చేశారు. బాలకృష్ణ పురోహిత్ అనే వ్యక్తి 1987లో ఈ బ్యాంకును ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులు తాము రాసిన రామనామ పుస్తకాలను ఇక్కడ డిపాజిట్ చేస్తారు. ప్రతి భక్తుడికి ఒక మంత్ర అకౌంట్‌ను కేటాయిస్తారు.

## విమానంలో కుప్పకూలిన మహిళకు మాజీ ఎమ్మెల్యే సిపిఆర్

**బెంగళూరు, డిసెంబరు 14:** గాలిలో ఉన్న విమానంలో తీవ్ర అస్వస్థతకు గురైన ఓ మహిళా ప్రయాణికురాలిని కర్ణాటక రాష్ట్రానికి చెందిన మాజీ ఎమ్మెల్యే సిపిఆర్‌చేసి ప్రాణాలు కాపాడారు. విమానం గాల్లో ఉండగా అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన మహిళా ప్రయాణికురాలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఒక్కసారిగా కుప్పకూలిన ఆమెకు అదే విమానంలో ప్రయాణిస్తున్న ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే, డాక్టర్ అంజలి నింబాల్కర్ సిపిఆర్ చేసి కాపాడారు. అంజలి గతంలో కర్ణాటక రాష్ట్రం బెళగావి జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు. ఆమె ప్రయాణికురాలిని కాపాడటంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రశంసలు కురిపించారు.

# కొత్తసంవత్సరంలోనూ రెండు చంద్రగ్రహణాలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** కొత్త సంవత్సరంలో రెండు చంద్రగ్రహణాలు కనువిందు చేయబోతున్నాయి. 2025 సంవత్సరంలో కూడా రెండు చంద్రగ్రహణాలు ఏర్పడిన విషయం తెలిసిందే. కొత్త సంవత్సరంలో మార్చి, ఆగస్టు మాసాల్లో చంద్రగ్రహణాలు ఏర్పడనున్నాయి. వాస్తవానికి చంద్రుడు సొంతంగా ప్రకాశించలేడు. సూర్యకిరణాలు చంద్రుడిపై పడినప్పుడు అవి అక్కడి నుంచి ప్రతిబింబిస్తాయి. అందుకే చంద్రుడు ప్రకాశించినట్లుగా మనకుకనిపిస్తుంది. సూర్యుడిచుట్టూ భూమి కక్ష్యలో ఉన్నప్పుడు, చంద్రుడు సూర్యుడికి మధ్యలో భూమి వస్తుంటుంది. ఆ సమయంలో సూర్యకాంతి చంద్రుడిపైపడదు. సూర్యుడు,భూమి, చంద్రుడు వాటికక్ష్యలో ఒకే వరుసలో ఉన్న సమయంలో మాత్రమే ఇలా జరుగుతుంది. ఆ సమయంలో భూమి నీడ చంద్రుడిపై పడుతుంది. దీంతో, చంద్రుడిపై నీడ ఉన్న భాగం చీకటిగా మారుతుంది. మనం భూమిపై నుంచి చూసిన సమయంలో ఆ భాగం మొత్తం నల్లగా కనిపిస్తుంది. దాన్నే మనం చంద్రగ్రహణంగా పిలుస్తుంటాం. 2026లో తొలి చంద్రగ్రహణం మార్చి 3న ఏర్పడుతుంది. ఇది పాక్షిక చంద్రగ్రహణం. ఈ గ్రహణం తూర్పు యూరప్, ఆసియా, ఆస్ట్రేలియా, నార్త్ అమెరికా, సౌత్ అమెరికా, ఫసిఫిక్, అట్లాంటిక్, ఆర్కిటిక్, అంటార్కిటికా ప్రాంతాల్లో కనిపిస్తుంది. అలాగే, భారత్‌లోనూ ఈ గ్రహణం దర్శనమిస్తుంది. భారతకాలమానం ప్రకారం సాయంత్రం 6.26 గంటలకు మొదలై.. 6.46 గంటలకు ముగుస్తుంది. రెండో చంద్రగ్రహణం ఆగస్టు 28న ఏర్పడుతుంది. ఈ గ్రహణం భారత్‌లో కనిపించేందుకు అవకాశం లేదు. రెండో గ్రహణం యూరప్, వెస్ట్ ఆసియా, ఆఫ్రికా, నార్త్ అమెరికా, సౌత్ అమెరికా, ఫసిఫిక్, అట్లాంటిక్ ప్రాంతాల్లో కనిపిస్తుంది.



# భారత్‌పై అక్కసు వెళ్లగక్కిన లష్కరే ఉగ్రవాది

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ భారత్‌పై తన అక్కసు వెళ్లగక్కాడు. ఢిల్లీని ఆక్రమిస్తాం అనే అర్థం వచ్చేలా 'పెళ్లిపిల్లనుచేస్తాం' అనే వ్యాఖ్యలు చేయడాన్ని భారత్ తీవ్రంగా పరిగణిస్తోంది. భారత వైమానిక దళంపైనా ఆ ఉగ్రవాది నోరుపారేసుకున్నాడు. లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు అబ్దుల్ రవూఫ్ అత్యంత సన్నిహితుడు. పాకిస్థాన్ ఆర్మీ అతడిని గతంలో సాధారణ పౌరుడిగా, అమాయకుడిగా పేర్కొన్నది. అయితే ఇప్పుడు భారత్‌పై దాడులకు బహిరంగంగా పిలుపునిస్తూ చేసిన వ్యాఖ్యల్లో అతడిలోని ఉగ్ర భావజాలం స్పష్టమవుతున్నది. తాజాగా అతడు మాట్లాడుతూ జమ్మూకశ్మీర్‌లో పోరాటం సమసిపోయిందనే వాదనలను కొట్టిపారేశాడు. జమ్ముకశ్మీర్‌లో పోరాటం ముగియలేదని, వివాదం మరింత తీవ్రమవుతుందని హెచ్చరించాడు. ఎల్‌ఇటి సహ వ్యవస్థాపకుడు అబ్దుల్ రెహమాన్ మక్కీని ఉద్దేశిస్తూ భారత రాజధానిని స్వాధీనం చేసుకోవడమే తమ గ్రూపు లక్ష్యమన్నాడు.

# ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో హమాస్ కమాండర్ హతం

**జెరూసెలెం, డిసెంబరు 14:** ఇజ్రాయెల్‌పై హమాస్ భీకర ఉగ్రదాడిచేసింది. 1200 మందినిక్రూరంగా హతమార్చిన ఈ సంఘటనకు పథకరచనచేసిన అసలు కమాండర్‌ను ఇజ్రాయెల్ హతమార్చింది. ఈ మారణహోమానికి సూత్రధారుల్లో ఒకరుగా ఉన్న సీనియర్ హమాస్ సైనిక కమాండర్‌పై వైమానిక దాడిచేసి హతమార్చింది. కస్సామ్‌బ్రిగేడ్స్‌లో సీనియర్ సభ్యుడుగా ఉన్న రాద్‌సాద్‌ను ఐడిఎఫ్‌దళాలు హతమార్చాయి. హమాస్‌కు ఆయుధాలు సమీకరించుకునేందుకు, తయారుచేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. హమాస్ ప్రస్తుత సైనిక అధిపతి ఇజ్ అల్‌దిన్ హద్దాద్‌కు డిప్యూటీగా ఆతడు పరిగణించబడ్డాడని ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. ఈదాడికి సంబందించిన విడియోను కూడా విడుదలచేసింది. ఒక వాహనం పేలిపోతున్నట్లు ఇందులోఉంది. రషీద్‌కోస్టల్‌రోడ్‌లో కారులో పారిపోతున్న సమయంలో సాద్‌పై దాడిజరిగింది.

గాజాలో ఇప్పటికీ పనిచేస్తున్న హమాస్ కమాండర్లలో సాద్‌కూడా ఒకరని ఐడిఎఫ్ ప్రకటిం చింది. ఇజ్రాయల్ బలగాలపై దాడులుచేయడానికి సాద్ అనేక ప్రయత్నాలు చేసాడని కాల్పుల విరమణ ఒప్పందాన్ని కూడా ఉల్లంఘిస్తున్నట్లు ఇజ్రాయెల్ ఆరోపించింది.

# లిబియాలో గుజరాత్ కుటుంబం కిడ్నాప్

## లోకల్ నేరగాళ్ల చెరలో ఉన్నట్లు గుర్తింపు

**హైదరాబాద్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** అక్రమంగా విదేశాల్లో స్థిరపడాలని భావిస్తున్న గుజరాత్‌కు చెందిన మరో కుటుంబం అస్థిరంగా వుంటూ ఉగ్రవాదులకు అడ్డాగా వున్న ఆఫ్రికా దేశం లిబియాలో కిడ్నాపర్లకు బందీలుగా చిక్కారు. దుబాయ్ నుంచి లిబియా మీదుగా యూరోపియన్ దేశం పోర్చుగల్‌కు వెళ్లి అక్కడ అక్రమంగా స్థిరపడాలని గుజరాత్‌కు చెందిన కిస్మత్‌సింగ్ చావ్డా కుటుంబం భావించి మధ్యలో కిడ్నాపర్ల వద్ద బందీలుగా వున్నారు. గుజరాత్‌లోని మొహసానా జిల్లా బాదల్‌పురాకు చెందిన కిస్మత్ సింగ్ చావ్డా సోదరుడు పోర్చుగల్‌లో స్థిరపడ్డాడు. తాను కూడా ఆ దేశంలో స్థిరపడాలని కిస్మత్ సింగ్ చావ్డా భావించాడు. ఇందుకు పోర్చుగల్‌లో వున్న అతని సోదరుడు అంగీకరించాడు. దీని తరువాత గత నెల 29వ తేదీన కిస్మత్ సింగ్ చావ్డా తన భార్య హీనా బెన్, కుమార్తె దేవాన్షిలతో కలిసి దుబాయ్ వెళ్లి అక్కడి నుంచి లిబియాలోని బెంఘాజి నగరానికి వెళ్లాడు. లిబియా నుంచి పోర్చుగల్‌కు వెళ్లే క్రమంలో వీరిని బెంఘాజి నగరంలో అక్కడి నేరగాళ్లు కిడ్నాప్ చేశారు. వీరిని ప్రాణాలతో వదలాలంటే రెండు కోట్ల రూపాయలు ఇవ్వాలని కిడ్నాపర్లు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని రెండు రోజుల క్రితం కిస్మత్ సింగ్ చావ్డా గుజరాత్‌లోని తన కుటుంబానికి చెప్పగా వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి సహాయం చేయాలని కోరారు. దీంతో మెహసానా జిల్లా కలెక్టర్ ప్రజాపతితో పాటు పోలీసు అధికారులు కేంద్ర హోం శాఖ అధికారులకు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించిన కేంద్ర హోం శాఖ లిబియాలోని భారత రాయబార కార్యాలయానికి సమాచారం అందించి కిడ్నాపర్ల చెరలో వున్న బాధితులను కాపాడాలని కోరింది. దీనిపై లిబియా దేశ పోలీసులు విచారణ చేబట్టారని గుజరాత్ పోలీసులు తెలిపారు. కాగా రెండు నెలల క్రితం అమెరికాకు అక్రమంగా వెళ్లాలని భావించిన ఓ కుటుంబం ఇరాన్‌లో ఉగ్రవాదుల బందీగా మారగా కేంద్ర హోం శాఖ ఇరాన్ ప్రభుత్వంతో చర్చించి విడుదల చేయించింది.

# కొత్త పరిశ్రమలకు ప్రోత్సాహకాలు

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: పారిశ్రామిక పాలసీలో భాగంగా అనేక సంస్థలకు ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పరిశ్రమలశాఖ, పర్యాటక శాఖలు సంయుక్తంగా ఉత్తర్వులు జారీ చేశాయి. కొత్త పాలసీలోని ఎర్లీ బర్డ్ పథకం కింద కొన్ని సంస్థలకు పెట్టుబడి రాయితీలు ప్రకటించగా, మరికొన్ని సంస్థలకు ఉన్న రాయితీలను కొనసాగించాలని నిర్ణయించారు. మరికొన్ని సంస్థలకు భూ కేటాయింపులు కూడా చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రధానంగా బాపట్ల జిల్లాలోని వలపర్లలో జెడ్ఆఐటి సంస్థ రూ.198 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న 1000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుకు ప్రోత్సాహకాన్ని కొ నసాగించాలని, కర్నూలు జిల్లాలోని గొండివర్ల పారిశ్రామిక వాడలో టిజివి స్రాక్ లిమిటెడ్ రూ.1,216 కోట్ల ప్రాజెక్టుకు కూ డా ప్రోత్సాహకాల కొనసాగింపునకు ఉత్తర్వులు ఇచ్చారు. కృష్ణా జిల్లాలోని సురవరంలో వెంకటేశ్వర బయోటెక్ లిమిటెడకు 30శాతంతో పెట్టుబడి రాయితీగా 25.8 కోట్లు కేటాయించాలని, అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రెన్యూ ఫోటో వాల్టాం యిక్స్ లిమిటెడ్‌కు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని, ఏలూరు జిల్లాలోని రమణ్సింగ్ గ్లోబల్ ఫుడ్ పార్కు 20 శాతం పెట్టుబడి రాయితీగా రూ.30.5 కోట్లు ఇవ్వాలని, రేణిగుంటలో రూ.305 కోట్ల పెట్టుబడితో ఉన్న మల్లాది డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్‌కు ప్రోత్సాహకాల కొనసాగించాలని నిర్ణయించారు. గాయత్రి రెన్యూవబుల్ ఫ్యూయల్స్ ప్రోత్సాహకాల కొనసాగింపు, ఎమర్జ్ గ్లాస్ ఇండస్ట్రీస్‌కు రూ.39 కోట్ల పెట్టుబడి రాయితీ కల్పిస్తూ పరిశ్రమలశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే పర్యాటక రంగంలో కూడా తిరుపతిలో నాలుగు నక్షత్రాల నాంది హోటల్స్, బాపట్ల జిల్లాలోని పాండురంగాపురం బీచ్‌లో యాగంటి ఎస్టేట్స్‌కు ప్రోత్సాహకాలు అందించేందుకు పర్యాటకశాఖ నిర్ణయించింది. అలాగే విశాఖలోని ఎండాడలో పివి ఆర్ హాస్పిటాలిటీస్ ద్వారా ఫైవ్ స్టార్ హోటల్‌కు భూమితోపాటు ప్రోత్సాహకాలు అందించేందుకు, మధురవాడలో మెగన్ లీసర్స్ ద్వారా ఐదు నక్షతాల హోటల్, మెగా కన్వెన్షన్ సెంటర్‌కు ప్రోత్సాహకాలను, తిరుపతిలో ఒబరాయ్ హోటల్ అభివృద్ధికి 20 ఎకరాల భూమిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

# బొత్స చెప్పేవన్నీ అబద్ధాలు

## - టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావు

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర అప్పులపై శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ అసత్యాలు చెబుతున్నారని టిడిపి రాష్ట్రఅధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌రావు విమర్శించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేయడంతో పాటు రూ.1.40 లక్షల కోట్లు బకాయిలు పెట్టిందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బకాయిల్లో ఇప్పటికే రూ.40 వేల కోట్లకు పైగా కూటమి ప్రభుత్వం తీర్చిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ.10 వేల కోట్లు మ్యాచింగ్ నిధులు గత ప్రభుత్వం చెల్లించలేదని, ఈ నిధుల్ని చెల్లించి కేంద్ర పథకాలు పునరుద్ధరించామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రూ.12 వేల కోట్లు చెల్లించామని వివరించారు. జగన్ ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వమే సంక్షేమంపై ఖర్చు చేస్తోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి తమ ప్రభుత్వం భారీగా ఖర్చు చేస్తోందన్నారు. జగన్ పాలనలో రూ.10 లక్షల కోట్లు అప్పు చేసినా అభివృద్ధి శూన్యమని విమర్శించారు. అప్పులకు వడ్డీ కట్టడానికి, బకాయిలు తీర్చడానికే అధిక శాతం అప్పులు చేయడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందడం చూసి ఓర్వలేక, జగన్ చేసిన అప్పుల్ని కప్పి పెట్టుకోవడానికే నేటి అప్పులపై జగన్ అసత్యాలు ప్రచారం చేస్తోందని పల్లా శ్రీనివాస్‌రావు ఆరోపించారు.

# కోడి గుడ్ల ధరలకు రెక్కలు

## - 100 గుడ్లు రూ.690లు



విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీలో రోజు రోజుకూ కోడి గుడ్ల ధరలు సామాన్యులకు అందనంతగా ఆకాశంలోని దూసు కెళ్తున్నాయి. నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ నిర్ణయించిన రేట్ల ప్రకారం ఇవాళ విజయవాడలో 100 గుడ్ల ధర అత్యధికంగా రూ.690గా ఉంది. అంటే ఒక్కో గుడ్డు రూ.6.90లుగా ఉంది. రిటైల్‌లోకి వచ్చే సరికి రూ.7 నుంచి రూ.8.50 వరకు ఉంది.ఇది కుడా సాధారణ మార్కెట్‌ల్లో లభిస్తున్న ధర. ఇక కార్పోరేట్ మాల్స్‌లో ఒక్కో గుడ్డు రూ.10 అమ్ముతుంది. ఉమ్మడి గోదావరి జిల్లాలో అనపర్తి, తణుకులో 100 గుడ్ల ధర రూ.665, విజయనగరం, శ్రీకాకుళంలో100 గుడ్ల ధరరూ.664, చిత్తూరులో 100 గుడ్లు రూ.663, విశాఖలో 100 గుడ్లు రూ.660 పలుకుతోంది. రిటైల్లో 810 రూపాయలకి అమ్ముతున్నారు. 4 నెలల కిందట ఈ రేటు రూ.5.50గా ఉండేది. గుడ్ల ఉత్పత్తి తగ్గడంతోనే రేట్లు అధికమయ్యాయని వ్యాపారులు చెబుతున్నారు.

# పిన్నెల్లి సోదరులకు పరామర్శలా!

## టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: మున్సిపల్ చైర్మన్ పదవి కోసం వేలంపాట పెట్టి, దాడులు మరియు హత్యలకు పాల్పడిన దుర్మార్గులు పిన్నెల్లి సోదరులు అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న తీవ్రంగా విమర్శించారు. వారికి నాయకత్వం వహించిన వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి అని, వీళ్ళంతా కలిసి రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చాలని చూస్తున్నారని ఆరోపించారు. విజయవాడలో టీడీపీ నేత బుద్ధా వెంకన్న మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలతో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలను అరెస్టు చేస్తే, దానిని తప్పు, అన్యాయం అని మాజీ సీఎం జగన్ మాట్లాడడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో టీడీపీ మద్దతుదారులను చంపేయాలని లక్ష్యంగా పెట్టుకున్న వ్యక్తులు పిన్నెల్లి బ్రదర్స్ అని, ఒక కులాన్ని టార్గెట్ చేసుకుని బూతులు మాట్లాడిన చరిత్ర వారిదని మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సామాజికవర్గం పైనా దుర్మార్గాలకు తెగబడ్డారని, తమపై దాడులు చేసిన ఘటనలకు సంబంధించిన వీడియోలు కూడా ఉన్నాయని తెలిపారు. జై వైసీపీ అనలేదని పీక కోసి చంపిన ఘటనలు ఉన్నాయని, చనిపోవడానికి సిద్ధమైన చంద్రయ్య ఖిజై టీడీపీఖి అని ప్రాణాలు విడిచారని, అది తమ బడుగు బలహీన వర్గాలకు టీడీపీపై ఉన్న కమిట్‌మెంట్ అని స్పష్టం చేశారు.

# ఆ క్రికెటర్లకు భరోసా ఇచ్చి... పవన్ చేసి చూపించారు!



## దీపిక, కరుణకుమారి ఇళ్లకు గృహోపకరణాలు అందజేత

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: అంధుల మహిళా ప్రపంచ క్రికెట్ కప్ గెలిచిన జట్టు సభ్యులు దీపిక, కరుణకుమారి ఇళ్లకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గృహోపకరణాలు పంపించారు. ఆ క్రికెట్ జట్టుతో ఇటీవల పవన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆ కుటుంబాల ఆర్థిక పరిస్థితులు ఆయన దృష్టికి వచ్చాయి. దీంతో ఆ ఇద్దరు మహిళా క్రికెటర్లకు తక్షణమే గృహోపకరణాలు పంపాలని పవన్ నిర్ణయించారు. ఇందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేశారు. పార్టీ నాయకుల ద్వారా వీటిని అక్కడికి చేరవేయించారు. "ఎక్స్" వేదికగా ఈ విషయాన్ని డీ సీఎం కార్యాలయం వెల్లడించింది. శ్రీ సత్యసాయి జిల్లా తంబలహట్టి తండాలో జట్టు కెప్టెన్ దీపిక కుటుంబానికి, అల్లూరి సీతారామరాజు జిల్లా వంట్లమామిడిలో కరుణ కుమారి కుటుంబానికి వంట సామాగ్రి, టీవీ, టేబుల్ ఫ్యాను, మిక్సర్ గ్రైండర్, కుర్చీలు, చాపలు, స్టీల్ ప్లేట్లు, ప్రెషర్ కుక్కర్లు, ఎల్ఈడీ బల్బులు, ఇస్త్రీ పెట్టె, పాత్రలు, దుప్పట్లు, దిండులు, కుటుంబం మొత్తానికి వాళ్ల ఇళ్లకు ఇవి చేరుకున్నాయి. హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ టీసీ.వరుణ్, జనసేన నాయకుడు పొదిలి బాబూరావు తదితరులు తంబలహట్టి తండాకు వెళ్లి ఈ వస్తు సామాగ్రిని దీపిక కుటుంబానికి అందించారు. నూతన ఏపీ జానపద కళలు, సృజనాత్మక అకాడమీ ఛైర్మన్ వంపూరు గంగులయ్య, జనసేన నేత వన్నెంరెడ్డి సతీష్‌రెడ్డి తదితరులు కరుణకుమారి ఇంటికి వెళ్లి వస్తువులను అందజేశారు. ఇద్దరు తెలుగు క్రికెటర్లకు క్రీడా కారుల కోటా కింద కొత్త గృహాలు నిర్మించి ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. కొత్త ఇళ్లు నిర్మించిన తర్వాత వాటికి తగిన విధంగా ఇతర అవసరమైన గృహోపకరణాలు సమకూర్చాలని నిర్ణయించారు.

# బహు క్రీడా దేశంగా భారత్

## అర్జున్ అవార్డు గ్రహీత సతీష్ శివలింగం

## తిరుపతి ఐఐటిలో 58వ ఇంటర్ ఐఐటి స్పోర్ట్స్ మీట్



శ్రీకాళహస్తి, డిసెంబరు 14 ప్రభాతవార్త: ప్రపంచ దేశాల్లో భారత దేశం బహుక్రీడా దేశంగా అభివృద్ధి చెందుతుందని ఒలింపియన్, అర్జున్ అవార్డు గ్రహీత సతీష్ శివలింగం అన్నారు. ఆదివారం తిరుపతి ఐఐటి అవరణలో తిరుపతి, మద్రాస్, హైదరాబాద్‌లు కలసి 58వ ఇంటర్ ఐఐటి స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఇది సంస్థ అభివృద్ధికి సాంకేతం అన్నారు. ఈ సందర్భంగా అతిథి శివలింగం మాట్లాడుతూ 'ఖేలో ఇండియా' తాజా జాతీయ క్రీడా విధానాలుయువతకు దేశవ్యాప్తంగా ఉన్న అవకాశాలను దిశ దెశ నిర్దేశం చేస్తుందని వివరించారు. తిరుపతి ఐఐటిలోనూ ఇతర భాగస్వామ్య ఐఐటిలలో అభివృద్ధి చెందుతున్న ప్రపంచస్థాయి క్రీడా సదుపాయాలు భవిష్యత్ ఛాంపియన్లను తయారు చేయటంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని అభినందించారు. భారత క్రీడల భవిష్యత్తు స్పోర్ట్స్ సైన్స్, డేటా అనలిటిక్స్ మరియు టెక్నాలజీ ఆధారంగా ముందుకు సాగుతుందని చెబుతూ ఐఐటి విద్యార్థులు కేవలం ఆటగాళ్ళుగా కాకుండా ఆవిష్కర్తలు, ఇంజనీర్లు, వ్యాపారవేత్తలుగా క్రీడా రంగంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇలాంటి వేదికలు స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, హై-పర్ పార్మెన్స్ స్పోర్ట్స్ వాటి అనుబంధ రంగాల్లో మార్గలను తెరిస్తా యని అన్నారు. క్రమశిక్షణ జట్టు స్ఫూర్తి, సహనాన్ని జీవితంలో కొనసాగించాలని శివలింగం ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన 58వ ఇంటర్ ఐఐటి స్పోర్ట్స్ మీట్‌ను 2025కు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా బెలూన్లను ఆకాశంలోకి వదిలిపెట్టారు. తిరుపతి ఐఐటిలో శ్రీకారం చుట్టిన స్పోర్ట్స్ మీట్‌లో సాంస్కృతిక ప్రదర్శనల్లో సంప్రదాయ కళలకు పెద్దపీట వేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. గ్రామాల్లో సాధన చేసే కర్రసాము, ఇతర నృత్య ప్రదర్శనలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. చదరంగం, టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు శ్రీకారం చుట్టారు.



# భవాని దీక్ష విరమణ సేవలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్తప్రతినిధి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న భవాని దీక్షల విరమణ సేవలలో 100 మంది జిల్లా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు( ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మేరిస్టెల్లా కళాశాల, విజయ ఇన్స్టాప్ టెక్నాలజీ ఫర్ ఉమెన్) నుంచి భవాని దీక్షల విరమణకు విచ్చేసిన భక్తులకు దేవస్థానం వారు ఏర్పాటుచేసిన సదుపాయాల మీద అభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు. దేవస్థానం అధికారుల పిలుపుమేరకు కృష్ణా యూనివర్సిటీ ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు 11 నుంచి 15 వరకు దేవస్థానం వారు అందిస్తున్న సేవల మీద అభిప్రాయ సేకరణ నిర్వహించమని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను కోరారు అందులో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు భక్తులు నుంచి దేవస్థానం వారు కల్పించిన సదుపాయాల పైన భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు వాలంటీర్లు తెలిపారు.

# భారత్... ప్రగతి పథంలో దూసుకెళ్తోంది

- ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి
- తిరుపతిలో అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ



తిరుపతి, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: భారతదేశ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పిస్తూ, ఆయన జీవితం, ఆశయాలు, ప్రజాస్వామ్య విలువలు భారత దేశానికి ఎప్పటికీ మార్గదర్శకమని ఉత్తరాఖండ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి పేర్కొన్నారు. ఆదివారం రేణిగుంట హైవేలోని మర్రిగుంట కూడలి నందు నిర్వహించిన అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ విష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి, మాజీ ఎం.పి వరప్రసాద్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుష్కర్‌సింగ్ ధామి మాట్లాడుతూ.. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్న ఈ పవిత్ర క్షేత్రంలో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరికీ కలియుగ దైవం సుఖసంతోషాలు, శాంతి, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నానని" తెలిపారు. యమునా, గంగా పవిత్ర నదులు ప్రవహించే దేవభూమిగా పేరుగాంచిన ఉత్తరాఖండ్ నుంచి వచ్చిన తనకు ఈ శుభ కార్యంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అద్భుతమైన వాక్చాతుర్యం, గంభీరమైన ఆలోచనాశక్తి, విశాల హృదయం కలిగిన నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి అని పేర్కొన్నారు. "పదవుల కంటే ప్రజలే ముఖ్యమని నమ్మిన నాయకుడు వాజ్‌పేయి. అధికారం కన్నా మానవీయ విలువలకు ప్రాధాన్యత ఇచ్చిన మహనీయుడు" అని కొనియాడారు. పార్లమెంటులో ప్రజా సమస్యలపై గళమెత్తి, జీవితాంతం దేశ సేవకే అంకితమై పనిచేశారని గుర్తు చేశారు. అటల్ బిహారీ వాజ్‌పేకి ఎవరూ శత్రువులు లేరని, అందుకే ఆయనను అజాతశత్రువుగా దేశం మొత్తం గౌరవించిందని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యార్థి దశ నుంచే వాజ్‌పేయి గారి మార్గదర్శకత్వంలో పనిచేసే అవకాశం తనకు లభించిందని, లక్నో పార్లమెంట్ నియోజకవర్గంలో విద్యార్థి నాయకుడిగా ఆయన ఎన్నికల సమయంలో పనిచేసిన అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. దేశాభివృద్ధికి బలమైన పునాది వేసిన నాయకుడు వాజ్‌పేయి అని పేర్కొంటూ, ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన ద్వారా గ్రామాలకు రహదారులు, స్వర్ణ చతుర్భుజి ప్రాజెక్ట్ ద్వారా దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల నిర్మాణం, టెలికాం విప్లవానికి శ్రీకారం చుట్టిన ఘనత ఆయనదేనని అన్నారు. సంకీర్ణ ప్రభుత్వాన్ని పూర్తి కాలం విజయవంతంగా నడిపిన తొలి ప్రధాని కూడా అటల్ బిహారీ వాజ్‌పేయి అని తెలిపారు. అభివృద్ధి, సుపరిపాలన, పారదర్శకతను ప్రాతిపదికగా తీసుకుని పాలన అందించిన ఆయన, సమాజంలో అట్టడుగున ఉన్న వర్గాల జీవితాల్లో వెలుగులు నింపారని చెప్పారు. వాజ్‌పేయి ఆశయాల నుంచి స్ఫూర్తి పొందిన నేటి ప్రధాని నరేంద్ర మోడీ కూడా సేవ, సుపరిపాలన, అభివృద్ధి లక్ష్యంగా దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. లోకల్ ఫర్ లోకల్, స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి వినూత్న కార్యక్రమాలతో భారత్‌ను స్వయం సమృద్ధ, ఆత్మనిర్భర దేశంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. డిసెంబర్ 25న అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా అమరావతిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మోడీ సహకారంతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. డబుల్ ఇంజన్ సర్కార్ కారణంగా అభివృద్ధి అత్యంత వేగంగా జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బిజెపి జిల్లా అధ్యక్షులు చామంచి శ్రీనివాస్, టిటిడి బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహా యాదవ్, హస్తకళల ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



# మంత్రాలయమంతా భక్తజనం

## అశేష భక్తుల నడుమ శ్రీ రాఘవేంద్రులు పల్లకి ఉత్సవం

మంత్రాలయంటౌన్, డిసెంబరు 14 ప్రభాతవార్త; పవిత్ర పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై నిత్యం వివిధ రాష్ట్రాల నుండి వేలాదిమంది భక్తులు విచ్చేస్తుంటారు. అందులో భాగంగానే ఆదివారం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై లక్షలాదిమంది వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేశారు. అయితే శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం విచ్చేసిన భక్తులకు శ్రీ మఠం అధికారులు,శ్రీ మఠం పీఠాధిపతులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిత్య అన్నదానం నిర్వహించారు. అంతే కాకుండా స్వామివారి దర్శనార్థమై విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండగా స్వామివారి దర్శనం ఏర్పాటు గావించారు.ఇదిలా ఉండగా భక్తులు పవిత్ర తుంగభద్ర నదిలో స్నానలాచరించి లక్షలాది సంఖ్యలు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శ్రీ మఠం ధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం అశేష భక్తుల నడుమ, ఉదయం నుండి శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పంచామృతాభిషేకం, తులసి అర్చన, అష్టోదకం, సుప్రభాత సేవలతో మొదలై, వేద పండితులు వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలు మూల బృందావనానికి నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకి ఉత్సవం, స్వర్ణ రథోత్సవం నవరత్న రత్నత్సవం, గజవాహన ఉత్సవం, శ్రీ మఠం పీఠాధిపతుల శ్రీ మూల రాముల ప్రత్యేక పూజా కార్యక్రమాలు, భక్తులను అశేషంగా అలరించాయి, అనంతరం శ్రీ మఠం పీఠాధిపతులు భక్తులకు ఫలమంత్రాక్షతలిచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో, శ్రీ మఠం మేనేజర్లు, శ్రీనివాస చారి, వెంకట్ జోషి, ఐపి నరసింహామూర్తి, శ్రీపతి, వ్యాసరాజ చారి, అనంత స్వామి, తంబి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి భక్తులతో కిటకిట



శ్రీకాళహస్తి, డిసెంబరు 14 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచి ఆలయంలో ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటు చేసుకుంది. వేకువ జాము నుంచే ఆలయంలో భక్తులు శివనామ స్మరణ చేస్తూ పునీతం చేసారు. ఆలయాధికారులు సమాచారం మేరకు పాతిక వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఇఓ డి.బాపిరెడ్డి వివరించారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు అభిషేకాలు 56 మంది పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించే మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రభిషేకాలు 27 జరిగాయి. కాగా రాహుకేతుదోష నివారణ పూజలు సుమారు 5వేలు జరిగినట్లు వివరించారు. ఇక సంస్కరణలతో ప్రతి ఒక్కరు టిక్కెట్లు కొనుగోలు చేయాలనే నిబంధనలతో ప్రత్యేక దర్శనానికి వెళ్ళె భక్తులు అతిథులు సుమారు 6వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు వివరించారు. ఇక ప్రసాదాలు సుమారు పాతికవేలు అమ్ముడుపోయినట్లు వివరించారు. ఓ వైపు చలి వణిస్తున్నా భక్తులు ఖాతరు చేయక ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.



# వదలని గజరాజులు

## లక్షలాది రూపాయల పంట నష్టం

కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా), డిసెంబర్ 14 ప్రభాతవార్త: పార్వతీపురం మన్యం జిల్లాలో గజరాజుల వల్ల లక్షల రూపాయలు వంట నష్టం వాటిల్లినట్లు రైతులు అంటున్నారు. గత కొన్నేళ్లుగా కురుపాం నియోజవర్గంలో కురుపాం, కొమరాడ, జిఎం వలస, గరుగుబిల్లి మండలాల్లో ఏనుగులు తిరుగుతూ చేతికందే పంటలు నాశనం చేస్తూ రైతులకు లక్షల రూపాయలు నష్టము వాటిల్లే విధంగా చేస్తున్నాయి. ఆదివారం కురుపాం మండలం సీతంపేట గ్రామంలో చేతికందే పంటలు కోకో, కర్బుజ మొక్కలు, మోటర్ పైపులు ఏనుగులు గుంపు ధ్వంసం చేశాయి. సుమారు 100 టన్నుల చెరుకు పంటను గజరాజులు నాశనం చేశాయి. సుమారు 3 లక్షల వరకు పంటనష్టం జరిగిందని రైతు చిన్నారావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల తరలింపుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# నో హెల్మెట్... నో పెట్రోల్

## తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పోలీసులు భద్రతపై ఫోకస్!



తిరుపతి, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి ,చిత్తూరు జిల్లాల వ్యాప్తంగా రోడ్డు భద్రతపై పోలీసులు ప్రత్యేక ఫోకస్‌చేశారు. ఇప్పటి వరకు అటూఇటూ ఉదారతతో వ్యవహరించిన పోలీసులు ఇప్పుడు కొరఢా ఝుళిపించనున్నారు. ఈ రెండు జిల్లాల్లో ద్విచక్ర వాహనాలు నడిపే వ్యక్తులు హెల్మెట్ ధరించకుంటే నేటి నుండి పెట్రోల్ పట్టరని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బారాయుడు స్పష్టం చేశారు. ఆదివారం హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ తిరుపతిలో చేపట్టారు. దేశంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో సుమారు 45 మరణాలు ద్విచక్ర వాహనదారుల మితిమీరిన వేగం మరియు హెల్మెట్ లేకుండా ప్రయాణం వల్ల జరుగుచున్నవని గణాంకాలు తెలియజేస్తున్నాయి. 40 మరణాలు హెల్మెట్ వాడకం వల్ల తగ్గే అవకాశం ఉన్నట్లు జాతీయ గణాంకాలు సూచిస్తున్నాయి. సరియైన రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోతే కుటుంబంలో ఒకరు మరణిస్తే కుటుంబం చిన్నాభిన్నం అవుతుంది. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బారాయుడు, చిత్తూరు ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాలతో నేటి నుండి ద్విచక్ర వాహనదారులకు నో హెల్మెట్ నో పెట్రోల్ నిబంధనలను అమలు చేసేలా పెట్రోల్ బంకుల యజమానులకు ఆదేశాలిచ్చారు. ప్రజలకు, విద్యావంతులైన ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, యువత మరియు అందరూ ద్విచక్ర వాహనదారులు అనగా వాహనం నడుపుతున్న వారు, వెనుక కూర్చొని వున్నవారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు.

# అందరి సమన్వయంతో సంబరం చేద్దాం

## -రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

## ప్లాస్టిక్ వినియోగం నియంత్రించాలి : జిల్లా కలెక్టర్



మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా), డిసెంబరు 14 ప్రభాతవార్త: సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాతర ఏర్పాట్లను పూర్తిచేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ గిరిజన శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. వచ్చే ఏడాది జనవరి నెలలో ప్రారంభం కానున్న శంబర జాతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలితో కలిసి దేవాదాయ శాఖ అదికారులు, దేవాలయ కమిటీ, ఇతర శాఖల అధికారులతో మంత్రి శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సంబర పోలమాంబ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు అధికారులకు పలు సూచనలు జారీ చేసారు. గ్రామ పెద్దలు, అధికారులు సమన్వయంతో నెల రోజుల ముందుగా అవసరమైన ఏర్పాట్లను చేపట్టాలని అన్నారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు ఉండరాదని, కొళాయిలు, బోర్లు పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్లు సిద్ధం చేయాలని, పారిశుధ్యం నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. అమ్మవారి మారు జాతర ముగిసే వరకు పారిశుధ్యంపై ప్రణాళిక వేసుకోవాలని తెలిపారు. పార్కింగ్ స్థలాలు, ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాలు పక్కాగా ఉండాలని, అత్యవసర సమయంలో అంబులెన్సులు వెళ్ళుటకు రహదారి అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అవసరమగు విద్యుత్ సరఫరాకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపక యంత్రాలను ఏర్పాటు చేయాలని, ప్రజలకు సమాచారం ఇచ్చుటకు, సమాచారం స్వీకరించుట మైక్‌ల ద్వారా ప్రకటించుటకు పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. కంట్రోల్ ఏర్పాటు చేసి అచ్చట నుండి సమాచారం అందించాలని సూచించారు.

మైక్ ద్వారా ఇచ్చే సమాచారం జాతర జరిగే మొత్తం ప్రాంతంలో వినిపించాలని, రవాణాకు ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని రహదారులు భవనాలు శాఖను సూచించారు. వచ్చే భక్తులకు రవాణా సౌకర్యం ఇబ్బందులు ఉండకుండా తగిన బస్సులు ప్రజా రవాణా శాఖ ఏర్పాటు చేయాలన్నారు. దేవదాయ శాఖ అవసరమగు సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. 2026 జనవరి 26 నుండి 28 వరకు జరగనున్న ఈ ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించేందుకు సంబంధించిన ఏర్పాట్లు, కార్యాచరణ ప్రణాళికలపై ప్రధానంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎస్.పి మనీషా రెడ్డి జిల్లా దేవాదాయ శాఖ అధికారి రాజారావు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ఆయనకు 80, నడక, పరుగులో యువత రాదు అతనితో పోటీకి

● ముదిమిలోను జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులు, రివార్డులు అందుకుంటున్న స్ట్రాంగ్‌మెన్ కనగాల మల్లిఖార్జునరావు

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: వయస్సు మీరినా ఉరకలు తీసే ఉత్సాహ ప్రవంతికి అడ్డకట్టవేయలేమని ఎనిమిది పదుల జీవన అనుభవశాలి కనగాల మల్లిఖార్జునరావు, యువతకు దీటుగా వేగంగా పరుగులు దీస్తూ, వడివడిగా నడుస్తూ జొరా ! అని ముక్కున వేలు వేయిస్తున్నారు. జట్టు నెరుపులోనే కాదు వయసు సోగసులోను మెరుస్తున్నారు, కనగాల మల్లికార్జునరావు స్వగ్రామం కృష్ణాజిల్లా గన్నవరం మండలం బాహుబలేంద్రనిగూడెం. పెద్దఅవుటపల్లిలోని కో ఆపరేటివ్ బ్యాంకులో ఉద్యోగం చేసేవారు. ఆయనకు వ్యవసాయంపై ఎంతో మక్కువ. మల్లికార్జునరావుకు ఉన్న ఇష్టంతో సాగు సైతం చేసేవారు. 2004లో క్యాన్సర్‌తో భార్య నిర్మలకుమారి మరణించారు. ఆమె మరణంతో బాగా కుంగిపోయారు. అతనికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య చనిపోయిన తర్వాత స్వగ్రామంలో ఉండలేక 2008లో విజయవాడ పటమటలోని ఆర్టీసీ కాలనీకి వచ్చి స్థిరపడ్డారు.

నగరంలో ఎస్టీడీ బూత్ ఆపరేటర్‌గా పని చేశారు. పక్కనే ఉండే వ్యాపారవేత్త శ్రీనివాస్‌తో స్నేహం కుదిరింది. ఆయనతో లయోలా కళాశాల మైదానంలో వాకింగ్‌కు తీసుకెళ్లారు. అలా వారిద్దరూ ప్రతిరోజూ కలిసి వాకింగ్‌కు వెళ్ళడం ప్రారంభించారు, ఉదయపు నడకకు వెళ్లినప్పుడు ఆరంభంలో భయం వేసినా శ్రీనివాస్ ధైర్యాన్ని ఇచ్చారని మల్లికార్జునరావు తెలిపారు. అప్పటి నుంచి రోజూ ఒక గంట వాకింగ్, సాయంత్రం యోగా సాధన చేస్తున్నాను. ఎటు వెళ్లాలి అనిపించినా అది ఎంత దూరమైన సైకిల్ పైనే ప్రయాణం చేస్తాను. 2009లో ఉగాది వేడుకల్లో లయోలా మైదానంలో జరిగిన 5 కిలోమీటర్ల వాకింగ్ పోటీల్లో మల్లికార్జునరావు మొదటి స్థానంలో నిలిచారు. విజయవాడలో 2016, 2017లో 21 కి.మీ అమరావతి మారథాన్ పోటీల్లో సీనియర్ సిటిజన్ (60+) కేటగిరీలో పాల్గొన్నారు. ఆ పోటీల్లో వరుసగా రెండుసార్లు విజేతగా నిలిచారు. దీనిని కేవలం 2 గంటల 18 నిమిషాల్లో పూర్తి చేశారు. కృష్ణా జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘంలో 2022లో సభ్యత్వం తీసుకున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో అనేక పతకాలు సాధించారు. దాంతో ఆయన జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌నకు సైతం ఎంపిక అయ్యారు. వయసు 80 ఏళ్లు అయినా అది కేవలం ఒక సంఖ్య మాత్రమేనని కనగాల మల్లికార్జునరావు నిరూపించారు. ఆయనకు ఉన్న ఆసక్తితో 17 స్వర్ణ పతకాలు, ఒక కాంస్యం గెలిచారు. గత నవంబరులో చెన్నైలో జరిగిన ఏషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లోనూ 2 కాంస్య పతకాలు సాధించారు. ఇప్పటి వరకు తనకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని, క్రీడా పోటీలతో సమాజంలో గౌరవం లభిస్తోందని కనగాల మల్లికార్జునరావు చెబుతున్నారు.



# విజయవాడ రైల్వే స్టేషన్ పిపిపి మోడ్‌లో అభివృద్ధి

## రైల్వే శాఖ సమాయత్తం... బ్లూప్రింట్ సిద్ధం

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతి రాజధాని అభివృద్ధికి సమాంతరంగా విజయవాడ రైల్వే స్టేషన్‌ను పిపిపి మోడ్‌లో అభివృద్ధి చేయడానికి రైల్వే శాఖ సంసిద్ధమైంది. ఇప్పటికే ప్రతిపాదనలపై ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ద్వారా రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సెంట్రల్ గవర్నమెంట్ రూ.661.11 కోట్ల నిధులు కూడా మంజూరు చేయడంతో రైల్వే యంత్రాంగం ఈ ప్రతిపాదనలకు శ్రీకారం చుట్టింది. మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్ వంటి తరహాలో అమరావతి రాజధానికి అతి సమీపంలోని విజయవాడ రైల్వే స్టేషన్ ను అభివృద్ధి చేసేందుకు ఎన్డీఏ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రతిపాదనలు రూపొందించారు. రైల్వే స్టేషన్ అభివృద్ధికి కావాల్సిన బ్లూ ప్రింట్ ను కూడా తయారు చేశారు. విజయవాడ రైల్వే స్టేషన్ ప్రాంతంలో 83.367 చదరపు మీటర్లుగా నిర్ణయించుకోగా వ్యాపార లావాదేవీలకు, స్టాల్స్, హోటల్ లాంటివి దగ్గర నుంచి రైల్వే కోటర్స్, స్టేషన్ కార్యాలయం వరకు 81.948 చదరపు మీటర్లలో అభివృద్ధి చేయనున్నారు. బెజవాడ రైల్వే స్టేషన్ ను విజయవాడ నగరానికి ఆకర్షణీయంగా నిలిచే విధంగా తూర్పు, పడమర వైపు ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నారు.

తూర్పు ముఖద్వారం వైపు పార్లమెంటు ముఖద్వారానికి ధీటుగా సూపర్ లుక్‌తో ఆకట్టుకునే విధంగా నమూనాలను ఇప్పటికే తయారు చేశారు. అలాగే పడమర వైపు వన్ టౌన్ ప్రాంతమంతా కూడా వ్యాపారాలకు ప్రసిద్ధి. ఆ ప్రాంతంలో రైల్వే స్టేషన్ లో సైతం వివిధ వ్యాపారులకు అనుకూలంగా ఉండే విధంగా భవనాలను నిర్మిస్తున్నారు. ఇందులో రెండు మూడు అంతస్తులు వ్యాపారులకు అనుకూలంగా నిర్మించడానికి రంగం సిద్ధం చేశారు. ప్రస్తుతం విజయవాడ రైల్వే స్టేషన్ లో మూడు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి. అయితే పెరిగిన రైళ్లకు తోడు ప్రయాణికుల సంఖ్య అత్యధికంగా పెరిగింది. దీంతో బడ్జెట్ను కూడా కేటాయించారు. ఇదిలా ఉండగా రైల్వే స్టేషన్ కు తూర్పు వైపు బయట ఉన్న సిటీ బస్టాండ్, స్కూటర్ పార్కింగ్ దగ్గర నుంచి టవర్ క్లాక్ ప్రాంతమంతా కూడా ఈ అభివృద్ధిలో మార్పులు చోటుచేసుకుని ఉన్నాయి. ఈ ప్రాంతం దగ్గర్లో స్టేషన్‌కు చెందిన 41.70 చదరపు మీటర్ల ప్రాంతంలో జి ప్లస్ టు భవనం నిర్మించనున్నారు. అలాగే పడమర వైపు జి ప్లస్ టు 6.647 చదరపు మీటర్ల పరిధిలో భవనాలను నిర్మించనున్నారు.

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంతో రైల్వే అధికారులు చర్చలు జరిపారు. తూర్పు వైపు నిర్మించనున్న ముఖద్వారం కానీ జి ప్లస్ టు వంటి భవన నిర్మాణాలే కానీ అన్నిటికీ అనుకూలమైన ప్రదేశం ఉండగా పడమర వైపు గాంధీ హిల్ కొండ ప్రాంతంలోని 100 మీటర్ల మేర ఇప్పటికే రైల్వే వెస్ట్ బుకింగ్ కార్యాలయం, టీటీల విశ్రాంతి భవనంతో పాటు ఆర్పీఎఫ్ విశ్రాంతి భవనాలు నిర్మించి ఉన్నాయి. రైల్వే స్టేషన్ నిర్మాణానికి ఇప్పటికే గాంధీ హిల్కొండ ప్రాంతంలో మరికొంత భాగం స్టేషన్ అభివృద్ధికి కేటాయించాలని ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వంతో ఇప్పటికే చర్చలు జరిగినట్టు సమాచారం దీనికి ప్రభుత్వం సానుకూలం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది.



# అమ్మ భవాని అస్తమయం

వి.ఆర్.పురం, డిసెంబరు 14 ప్రభాతవార్త: అల్లూరి సీతారామరాజు జిల్లా, వి.ఆర్.పురం మండలం, వి.ఆర్.పురం కు చెందిన సుప్రసిద్ధ భవాని భక్తురాలు పర్వతవర్ధిని (85) (అమ్మ భవాని) ఆదివారం ఒడిశా రాష్ట్రం, మోటు లో అస్తమయం చెందారు. మోటు నుండి విజయవాడ బయలుదేరిన భవాని భక్తులకు ఇరుముడులు ఎత్తేందుకు ఈమె మోటు వెళ్ళారు. మాలధారణ చేసిన భక్తులకు ఇరుముడులు ఎత్తి సాగనంపి, (బిక్ష) భోజనం చేస్తున్న క్రమంలో ఆమె గుండెపోటుకు గురై పడిపోయారు. అక్కడ ఉన్న వారంతా అమ్మభవాని ని హుటా హుటీన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు దేవీకరించారు. అమ్మ భవాని అంత్యక్రియలు సోమవారం వి.ఆర్.పురం మండలంలోని వడ్డిగూడెం గ్రామం వద్ద పవిత్ర శబరి, గోదారి సంగమ ప్రాంతంలో నిర్వహించన్నట్లు ఆమె కుటుంబ సభ్యులు, భక్తులు తెలిపారు. 40 ఏళ్ళ క్రితం భవాని దీక్ష బూనిన ఈమె పూర్తిగా గుడికే అంకిత మయ్యారు. ఈమె ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్ ఘడ్, ఒడిషా నాలుగు రాష్ట్రాలోని భవాని భక్తులకే కాకుండా సామాన్య ప్రజానికానికి సుపరిచితురాలు. మృతురాలికి చోడేశ్వరావు, విశ్వనాద్, సంతోష్ కుమారులు ఉన్నారు.



## బైక్ - కారు ఢీ: భార్యాభర్తలు మృతి

ఆత్మకూరు (నెల్లూరు), డిసెంబరు 14 ప్రభాతవార్త: ఆత్మకూరులోని ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో భార్యా భర్తలిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఆత్మకూరు మండలం బి.చిరువెళ్ళకు చెందిన మాధవ, మనోజలు ఆత్మకూరులోని గురుకుల పాఠశాలలో చదువుతున్న తమ చిన్న కుమార్తె వద్దకు వెళ్ళారు. ఆదివారం కావడంతో ఇంటి నుంచి తీసుకెళ్ళిన భోజనం తమ బిడ్డకు తినిపించారు. తిరిగి ఇంటికి బైక్ పై వెళుతుండగా కడప వైపు నుండి నెల్లూరుకు వస్తున్న ఇన్నోవా కారు ఢీకొట్టింది. దాంతో భార్యాభర్తలిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో మేస్త్రీ మృతి

విడవలూరు (నెల్లూరు), డిసెంబరు 14 ప్రభాతవార్త: ఇతర ప్రాంతాల నుండి వచ్చే కూలీలకు పని కల్పిస్తున్న మేస్త్రీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన విడవలూరు మండలం రామతీర్థం గ్రామంలో చోటుచేసుకొంది. రామతీర్థం నుండి దండిగుంటవైపు వెలుతున్న కాంక్రీట్ మిక్సర్ లారీను బైక్ ముందుకు సాగించే క్రమంలో అదుపుతప్పి లారీ కింద పడిపోవడంతో కావలి వెంకటరమణయ్యపై లారీ వెళ్ళడంతో అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి స్వల్పగాయాలు అయ్యాయి. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దండిగుంట గ్రామానికి చెందిన కావలి వెంకటరమణయ్య కొంతకాలం నుంచి బుచ్చిరెడ్డిపాలెం గ్రామం గాంధీనగర్‌లో నివాసం ఉంటూ కూలీలకు పనులు కల్పించేందుకు దండిగుంట గ్రామానికి వచ్చి ఇతర గ్రామాల్లో కూలీపనులు చేయించే వాడని పోలీసులు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృత్యువాత విన్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు. ఇంటి యజమాని ఇక లేరని మరణ వార్త వినడంతో గ్రామంలో ప్రజలను కలిచివేసింది. ప్రమాదానికి గురైన లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిమిత్తం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.నరేష్ తెలిపారు.

# మత్స్య సంపదతో సుస్థిర ఆర్థికాభివృద్ధి



● ఆధునిక, సాంకేతికతలతో కూడిన లాభదాయక పద్ధతులపై అధ్యయనం
● ఉప ముఖ్యమంత్రి చొరవతో రెండు బృందాలుగా తరలిన ఉప్పాడ మత్స్యకారులు
● తమిళనాట కేజ్ కల్చర్, రిఫ్ కల్చర్, ఆధునిక మార్కెటింగ్ వ్యవస్థలపై శిక్షణ
● కేరళలో మోడల్ ఫిషింగ్ హార్బర్, అత్యాధునిక వలల తయారీపై అధ్యయనం

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించిన 100 రోజులు ప్రణాళికలో భాగంగా ఉప్పాడ మత్స్యకారుల శిక్షణ విజయవంతంగా ముగిసింది. వారం రోజుల శిక్షణా తరగతులు ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు అధ్యయనం, అవగాహన, శిక్షణ కార్యక్రమాలతో మొదలయ్యాయి. తమిళనాడు, కేరళ రాష్ట్రాలు అవలంభిస్తున్న సాంకేతికత సాయంతో ఉప్పాడ, కాకినాడ తీర ప్రాంత మత్స్యకారులకు వసతులు కల్పించేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మత్స్యశాఖ అధికారులకు సూచించారు. ఇందుకు అనుగుణంగా మత్స్య సంపదతో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అవసరం అయిన అధునాతన పద్ధతులపై అధ్యయనం చేసేందుకు ఉప్పాడకు చెందిన మత్స్యకారులను తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు పంపారు. ఈ నెల 8వ తేదీన మొత్తం 60 మంది రెండు బృందాలుగా ఆయా రాష్ట్రాలకు వెళ్లారు. స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించడం ఎలా అనే అంశంపై రెండు రాష్ట్రాల్లో మూడు రోజుల పాటు శిక్షణ ఇప్పించారు. అధునాతన కేజ్ కల్చర్, రిఫ్ కల్చర్, మార్కెటింగ్ వ్యవస్థల ఏర్పాటు, అన్ని హంగులతో నిర్మించిన హార్బర్ల సందర్శన, హ్యాచరీల్లో చేపల గుడ్లు పొదిగించడం, వలల తయారీ తదితర అంశాల్లో సెంట్రల్ సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నేషనల్ ఇన్నిట్యూట్ ఆఫ్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీలతో శిక్షణ ఇప్పించారు. మొదట పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అక్కడ అమలు చేస్తున్న విధానాలను వివరించారు. తదుపరి క్షేత్ర స్థాయిలో సందర్శనలకు ఏర్పాటు చేశారు.

### మండపం, విల్లుపురంలో మొదటి బృందం అధ్యయనం

తమిళనాడు సందర్శనకు వెళ్లిన ఉప్పాడ మత్స్యకార బృందం చెన్నైలోని మండపం వద్ద ఉన్న సి.ఎస్.ఎం.సి.ఆర్.ఐ.ని సందర్శించారు. అక్కడ మెరైన్ నిపుణులు కృత్రిమ, సహజ పద్ధతుల్లో సాగు చేస్తున్న కేజ్ కల్చర్, రిఫ్ కల్చర్ లపై మత్స్యకారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. సముద్ర తీర ప్రాంతంలో జీవ వైవిధ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సముద్ర వనరుల దీర్ఘకాలిక సంరక్షణకు అవలంబించాల్సిన శాస్త్రీయ విధానాలను ఉప్పాడ మత్స్యకారులకు తెలియజేశారు. అనంతరం విల్లుపురంలోని గోల్డెన్ మెరైన్ హార్వెస్ట్ హ్యాచరీని సందర్శించి మత్స్య సంపద సృష్టిలో వస్తున్న నూతన సాంకేతికతపై అధ్యయనం చేశారు. చెన్నై మెరినా బీచ్ సమీపంలోని ఆధునిక మౌలిక వసతులతో కూడిన చేపల మార్కెట్ ని సందర్శించారు. మార్కెట్ వద్ద చేపలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకునేందుకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్షేత్ర స్థాయి పరిశీలనలో పరిశుభ్రమైన వాతావరణంలో చేపల అమ్మకం, కోల్డ్ స్టోరేజ్ వ్యవస్థలు, మత్స్య సంపద గ్రేడింగ్, వేలం నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ విధానాలు, సప్లయి చైన్ తదితర అత్యాధునిక సదుపాయాలపై అవగాహన తెచ్చుకున్నారు. ఈ పర్యటన ద్వారా ఆధునిక సదుపాయాల కల్పన ద్వారా మత్స్యకారుల ఆదాయం ఎలా వృద్ధి చెందుతుంది అనే అంశాన్ని తెలుసుకున్నారు.

### సాంకేతికత సాయంతో మత్స్య సంపద వృద్ధిపై కేరళలో అధ్యయనం

కేరళ పర్యటనలో భాగంగా ఉప్పాడకు చెందిన రెండో మత్స్యకార బృందం ఎన్.ఐ.పి.హెచ్.టిలో మూడు రోజులపాటు నిపుణుల పర్యవేక్షణలో శిక్షణ తీసుకున్నారు. వేటలో సాంకేతిక మేళవింపు, స్థిరమైన ఆదాయార్జన, ఆర్థికంగా లాభదాయక విధానాలు అవలంబించడం ఎలా? అనే అంశాలపై వీరు అధ్యయనం చేశారు. మునంబంలోని మోడల్ ఫిషింగ్ హార్బర్ సందర్శించి అక్కడ ఆధునిక పద్ధతులలో వలల తయారీ ప్రక్రియ, వారు పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలు, మార్కెటింగ్ విధానాలను తెలుసుకున్నారు. చేపల గుడ్లు పొదిగించడం, రకరకాల జాతుల చేప పిల్లల హ్యాచరీలు సందర్శించారు. మత్స్య కారుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అమలు చేస్తున్న అధునాతన విధానాలు, వాటివల్ల కలుగుతున్న లాభాలపై ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారులకు ప్రత్యక్షంగా అధ్యయనం చేసే అవకాశం కలిగింది.



# అభివృద్ధి, సంక్షేమంలో రాజీపడొద్దు

## - పోలవరం ఎమ్మెల్యే బాలరాజుతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వారికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడంలో ఏ దశలోనూ రాజీపడకూడదు. గెలిచిన ప్రతి ఎంఎల్ఏ నియోజక వర్గ అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రజలకు సంతృప్తి కల్గించేలా పని చేయాలి' అని ఉప ముఖ్యమంత్రి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ దిశా నిర్దేశం చేశారు. నియోజక వర్గాల్లో అభివృద్ధితో పాటు పార్టీ కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారు. దీనిలో భాగంగా జనసేన ఎమ్మెల్యేలు ప్రతి ఒక్కరితో ఆయన విడివిడిగా (వన్ టూ వన్) భేటీ కానున్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో తొలి సమావేశం నిర్వహించారు. ఏడాదిన్నర కాలంలో పోలవరం నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన సమీక్షించారు. పెండింగ్ పనుల గురించి తెలుసుకున్నారు. నియోజక వర్గానికి దక్కిన నామినేటెడ్ పోస్టుల అంశాన్ని ఉప ముఖ్యమంత్రి చర్చించారు. అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం నిర్దేశిత లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. ఎంఎల్ఏలూ ఆ దిశగా వెళ్ళాలి. ఐఎస్ జగన్నాథపురం పర్యటనకు వచ్చినపుడు తిమ్మనకుంట- గవరవరం రోడ్డు లేక కెండు దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్న అంశాన్ని ఒక మహిళ నా దృష్టికి తీసుకువచ్చారు. అలాంటి సమస్యలను ఎంఎల్ఏగా గుర్తించి పరిష్కరించేలా పని చేయాలి' అని పవన్ కల్యాణ్ ఎంఎల్ఏతో అన్నారు. కూటమి ధర్మాన్ని అనుసరిస్తూనే జనసేన పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యే బాలరాజు ఉప ముఖ్యమంత్రికి అందించారు. సమావేశంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడుగోవిందరావు పాల్గొన్నారు.

# హిందూ ధర్మవ్యాప్తికి టిటిడి విశేష కృషి



తిరుమల, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: ధార్మిక సంస్థ టిటిడి హిందూ ధర్మవ్యాప్తికి చేస్తున్న కృషి అభినందనీయమని, తిరుమలలో భక్తుల సౌకర్యాలు బావున్నాయని ఉత్తరాఖండ్ సిఎం పుష్కరసింగ్‌దామి తెలిపారు. త్వరగా దర్శనం కల్పించడంలో ఎఐ సేవలు అమలుచేయించే ప్రయత్నంతో భక్తులకు మేలుజరుగుతుందన్నారు. కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకోవడం మనసు ఆనందంగా ఉందన్నారు. ఆదివారం సాయంత్రం తిరుమలకు చేరుకున్న ఉత్తరాఖండ్ సిఎం పుష్కరసింగ్ దామి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర నేత రమేశ్, టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డిలు ఆలయం వద్దకు చేరుకున్నారు. రాత్రి నైవేద్యవిరామ సమయంలో స్వామివారిని దర్శించుకున్నారు. టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు

## - రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: సత్యసాయి జిల్లా ఓడీ చెరువు మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్‌తో మంత్రి ఫోన్ మాట్లాడుతూ, హాస్టల్ లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డుకు పైగా రావడానికి కారణాలు తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన ఆదివారం విడుదల చేశారు. శ్రీసత్యసాయి జిల్లా ఓడీ చెరువు మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌లో లక్ష్మీనరసింహా తొమ్మిదో తరగతి, భార్గవ్ ఎనిమిదో తరగతి చదువుతున్నారు. హాస్టల్ సమీపంలోని బైపాస్ రోడ్డులో ఉన్న అయ్యప్ప స్వాములు ఏర్పాటు చేసుకున్న మండపానికి ప్రసాదం కోసం వంట పాత్రలతో వెళ్లారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న కారు ఇద్దరు విద్యార్థులను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మీనరసింహా తలకు బలమైన గాయం కావడంతో అనంతపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మరో విద్యార్థి భార్గవ్‌ను కదిరి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందజేస్తున్నారు. ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్‌తో ఫోన్ లో మాట్లాడి, విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలన్నారు. వంట పాత్రలిచ్చి ప్రసాదం ఎవరు తీసుకు రమ్మనారో తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హాస్టల్‌లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డుపైకి ఎందుకొచ్చారని డీఎస్డబ్ల్యూవో రెడ్డి బాలాజీని మంత్రి ఫోన్‌లో ప్రశ్నించారు. తక్షణమే గాయడిన విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారమందించాలని, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

# ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అనూహ్య మద్దతు

## - వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి



విజయవాడ, డిసెంబరు 14 ప్రభాత వార్త ప్రతినిధి: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల నుండి అనూహ్య మద్దతు వస్తోందని, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని వైసిపి రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లి లోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు కోటి సంతకాల ఉద్య మాన్ని జాతీయస్థాయిలోకి తీసుకెళ్లా లని తెలిపారు. దీన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని, 15న జిల్లాస్థాయిలో జరిగే ర్యాలీలు ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా హోరెత్తాలని తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా వైసిపి అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు. కోటి సంతకాల పేరుతో వైసిపి చేపట్టిన ప్రజా ఉద్యమం విజయవంతమైందన్నారు. రాష్ట్రంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలని, పరిహారాన్ని ఏడు లక్షలకన్నా పెంచి తక్షణం అందజేయాలని వైసిపి ప్రధాన కార్యదర్శి ఎంవిఎస్ నాగిరెడ్డి అన్నారు. ఆత్మహత్య చేసుకున్న వారంలోనే రైతు కుటుంబానికి పరిహారం అందించేలా చూడాలని కోరారు. వ్యవసాయం గిట్టుబాటుకాక ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని, ప్రతివారం కనీసం ఇద్దరు రైతులు చనిపోతున్నారని వివరించారు. అయినా కూటమి ప్రభుత్వంలో చలనం రావడం లేదని పేర్కొన్నారు. నెల్లూరు కార్పొరేషన్లో ప్రభుత్వం అనైతిక రాజకీయాలు చేస్తోందని వైసిపి అధికార ప్రతినిధి నాగార్జునయాదవ్ అన్నారు. మేయర్ పదవికోసం ప్రభుత్వం దిగజారిందని అన్నారు.

# వైభవంగా భవానీ దీక్షల విరమణ



ఇంద్రకీలాద్రి, డిసెంబరు 14 ప్రభాత వార్త: మూడోరోజు భవానీ దీక్షలు విరమణ ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. దీక్షధారులు భక్తుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. వారికి సరైన వసతులు, సౌకర్యాలు అందేలా ఇఒ, చైర్మన్ పాలకమండలి, అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. భక్తిశ్రద్ధలతో దీక్షాధారులు ఇరుముడులను శిరస్సున ధరించి దుర్గమ్మవారి ఆలయానికి జై దుర్గా.. జైజై దుర్గా నామస్మరణతో చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి ఇరు ముడులు భక్తితో సమర్పించుకున్నారు. శ్రీ అమ్మవారు దీక్షల సందర్భంగా అమ్మవారి ప్రత్యేక పూల అలంకరణతో భక్తులను అనుగ్రహించారు. దుర్గమ్మవారి ఆలయంలో శ్రీ భవానీ దీక్షల విరమణల సందర్భంగా ప్రసాదాల అమ్మకాలు, కేశఖండన తది తరాల ద్వారా మొత్తం రు,62,09,425ల ఆదాయం లభించిందని ఇఒ తెలిపారు.

### దేవాదాయ శాఖ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

రాష్ట్ర దేవదాయ శాఖ కమీషర్ కె రామచంద్రమోహన్ ఆదివారం దుర్గమ్మవారి ఆలయంలో ఆకస్మిక తనిఖీ చేశారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం నుండి శ్రీ భవాని మండల దీక్షధారులకు అందుతున్న సేవలను కమీషనర్ స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. చివరిరోజైన సోమవారం సుమారు లక్షమంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని ఆమేరకు ఏర్పాట్లు సిద్ధం చేశామని భక్తుల సంఖ్య పెరిగినప్పటికి తగిన సౌకర్యాలు, లడ్డూ ప్రసాదాలు, అన్నప్రసాద వితరణ, దర్శనం తదితర అన్ని ఏర్పాట్లు సిద ం చేశామని కమీషనర్, ఇఒలు సంయుక్తంగా తెలిపారు. అనంతరం ఇఒ వికె శీనా నాయక్‌తో కలిసి భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

### భవాని దీక్ష విరమణల్లో విశేష సేవలు

బ్యాటరీ వాహనాలద్వారా వృద్ధులను, దివ్యాంగులను శ్రీ అమ్మవారి దర్శనానికి తీస్కెళ్లడం కోసం నాలుగు బ్యాటరీ వాహనాలను ఇఒ వికె శీనా నాయక్ భవాని దీక్ష విరమణల కోసం ఏర్పాటు చేయడంతో వాటి ద్వారా అందుతున్న సేవలపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు భవాని దీక్షలు ఏర్పాట్లు పరిశీలించి అనంతరం శ్రీ అమ్మవారి దర్శనము చేసుకున్నారు.

# మూడో టి20లో భారత్ ఘనవిజయం

● ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా 2-1తో ఆధిక్యం ● భారత్ బౌలింగ్‌తో దక్షిణాఫ్రికా బ్యాటర్లు పెవిలియన్ క్యూ

ధర్మశాల, డిసెంబరు 14: ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో దక్షిణాఫ్రికాపై భారత్ ఆధిక్యంలోకి వచ్చింది. రెండో టి20లో ఘోరంగా ఓడిన భారత జట్టు మూడో టి20తో ఫామ్‌లోకి వచ్చింది. ధర్మశాల వేదికగా ఆదివారం జరిగిన మూడో టి20లో భారత జట్టు 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. 118 పరుగుల లక్ష్యాన్ని భారత జట్టు కేవలం 15.5 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అభిషేక్ శర్మ 18 బంతుల్లో 35; 3 ఫోర్లు, 3 సిక్సర్లు బాదేసి మరోసారి మెరుపులు మెరిపించాడు. తిలక్ వర్మ కూడా 26 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. 3 ఫోర్లుసైతం సాధించి చివరి దాకా క్రీజులో ఉండి మ్యాచ్‌ను ముగించాడు. శుబ్‌మన్ గిల్ (28) టెస్టు బ్యాటింగ్ చూపించాడు. సూర్యకుమార్ యాదవ్ 12 పరుగులకే నిరాశ పరిచాడు. ఈ మ్యాచ్‌లో గెలవడంతో భారత జట్టు ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో నిలిచింది. నాలుగో టి20 ఈనెల 17న జరగనుంది. స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు అభిషేక్ శర్మ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. తొలి బంతినే సిక్సర్ బాది దూకుడు మీద కనిపించాడు. క్రీజులో ఉన్నంతసేపు బౌండరీల వర్షం కురిపించాడు. 3 ఫోర్లు 3 సిక్సర్లతో అదరగొట్టాడు. మరో ఎండ్‌లో ఉన్న గిల్ మరోసారి డకౌట్ అయ్యేవాడు. అంపైర్ అవుటివ్వగా రివ్యూలో బంతి బ్యాట్‌కు తాకినట్లుగా తేలింది. దాంతో బతికిపోయాడు. అయితే చాలా సమయాల్లో బంతి అతడి బ్యాట్ ఎడ్జ్ తీసుకొని స్లిప్‌లోకి వెళ్లింది. అయితే అక్కడ ఫీల్డర్ లేకపోవడంతో బతికిపోయాడు. తక్కువ లక్ష్యం ఉన్నా కూడా గిల్ ఆకట్టుకోలేకపోయాడు. క్రీజులో ఇబ్బంది పడుతూనే ఆడాడు. అయితే అభిషేక్ శర్మ మెరుపు ఆరంభం ఇవ్వడం ఆ తర్వాత తిలక్ వర్మ నిలబడటంతో భారత్ ఆడుతూ పాడుతూ లక్ష్యాన్ని ఛేదించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 20 ఓవర్లలో 117 పరుగులు మాత్రమే చేసి ఆలౌటైంది. కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్ 46 బంతుల్లో 61; 6ఫోర్లు, 2 సిక్సర్లు సాధించి ఒంటరి పోరాటం చేశాడు. డెనొవాన్ ఫెరీరా 20, నోకియా 11 మినహా మిగిలిన ప్లేయర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిలకు తలా 2 వికెట్లు లభించాయి. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబేలకు



చెరో వికెట్ లభించింది. తొలుత బ్యాటింగ్ కు దిగిన దక్షిణాఫ్రికాను అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణాలు తమ పేస్ బౌలింగ్‌తో హడలెత్తించారు. ఫలితంగా పవర్ ప్లేలో సౌతాఫ్రికా పూర్తిగా తడబడింది. కేవలం 25 పరుగులు మాత్రమే చేసింది. 3 వికెట్లను కోల్పోయింది. గత మ్యాచ్‌లో 90 పరుగులు చేసిన క్వింటన్ డికాక్ ఈ మ్యాచ్‌లో ఒక్క పరుగు చేసి అవుటయ్యాడు. రీజా హెండ్రిక్స్ డకౌట్ అయ్యాడు. డివాల్డ్ బ్రెవిస్ 2, స్టబ్స్ 9, బాష్ 4 ఇలా వచ్చి అలా వెళ్లారు. కెప్టెన్ మార్క్‌రమ్ అర్ధ సెంచరీ చేయడంతో సౌతాఫ్రికా 100 పరుగులు చేయగలిగింది. లేదంటే 50లోపే ఆలౌట్ అయ్యి ఉండేది. భారత బౌలర్లు పిచ్ నుంచి దక్కిన సహకారాన్ని చక్కగా ఉపయోగించుకున్నారు.

# హైందవ సంస్కృతిని పరిరక్షించాలి

కందుకూరు (నెల్లూరు), డిసెంబరు 14 ప్రభాత వార్త: హైందవసంస్కృతిని పరిరక్షించాలని శ్రీశ్రీ పరిపూర్ణ సిద్దానంతస్వామీజీ అన్నారు. ఆదివారం కందుకూరు అంకమ్మతల్లి దేవాలయ ప్రాంగణంలో ఆర్ఎస్ఎస్ హైందవ సమ్మేళన నిర్వహణ సమితి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒంగోలు శ్రీ అచలనంద ఆశ్రమానికి చెందిన స్వామీజీ ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. భారతదేశానికి సమాజానికి ఆత్మ, ప్రాణం.. హిందూ ధర్మం, హిందూ సంస్కృతి అన్నారు. ప్రతి మనిషికి కన్నతల్లి భరతమాత అనే ఇద్దరు తల్లులన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు సంస్కారం నేర్పాలన్నారు. తల్లిదండ్రులకు గురువులకు, పెద్దలకు, భరతమాతకు నమస్కారం చేయడం భారతీయ సంస్కారమన్నారు. అదే భగవద్గీత సారాంశమని విశదీకరించారు. కుటుంబ సభ్యులతోపాటు పెద్దలతో ఎలా మెలగాలనేదే భగవద్గీత సారాంశమని వివరించారు. ఆంగ్ల సంస్కృతిని స్వామీజీ తప్పుపట్టారు. విద్యార్థి దశ నుంచే పిల్లలకు తీసుకోవడం నేర్పడముతోపాటు తిరిగి ఇవ్వడం నేర్పాలని సూచించారు. పిల్లలకు భారతీయ సంస్కృతీ, సాంప్రదాయాలు నేర్పాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. పరిసర కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటుచేసుకొని ధర్మాధర్మాలను చర్చించాలని సూచించారు. ధర్మాన్ని ఆచరించాలని, అనుభవించాలని ఆయన సూచించారు. మరో అతిథి డా॥ అశోక్ చౌదరి మాట్లాడుతూ రామాయణం, భాగవతంల ఆదర్శంగా సభ్యత సంస్కారం

కందుకూరులో హిందూ సమ్మేళనలో స్వామిజీ



నేర్పాలన్నారు. అడ్వకేట్ పి.ఫణికుమారి మాట్లాడుతూ కర్మ మోక్షం, మార్గ సిద్ధాంతాలను వివరించారు. హైందవ ధర్మానికి కృషిచేసిన చత్రపతి శివాజీ, జిజియాబాయిల పూర్వగాధను ఉదాహరణగా వివరించారు. ప్రతిఒక్కరూ సనాతనాధర్మాలను ఆచరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరెడ్డి, హరిణీ వైద్యశాల డాక్టర్ తన్నీరు మల్లికార్జునరావు, ఆక్స్‌పర్డ్ విద్యా సంస్థల అధినేత ఉన్నం బాస్కరరావు, గ్రామదేవతల ధర్మకర్త దివి లింగయ్యనాయుడు, విశ్రాంత డీఈ మంచిరాజు మరళీమోహన్, విజ్ఞాన్ విహార సంస్థ డైరక్టర్ హరిబాబు, ఆర్యవైశ్య మీడియా చైర్మన్ చక్కా వెంకటకేశవరావు తదితరులు పాల్గొన్నారు.


# తెలుగును వెలిగించిన బాపు

డా.గజల్ శ్రీనివాస్

విజయవాడ, డిసెం బరు 14 ప్రభాత వార్త ప్రతినిధి: తన సినిమాల ద్వారా, చిత్రాల ద్వారా, కార్టూన్ల ద్వారా తెలుగును వెలిగించిన చిరస్మరణీయుడు బాపును స్మరించుకోవడం మన బాధ్యతగా భావించాలని సుప్రసిద్ధ గజల్ గాయకుడు మాస్ట్రో డా. గజల్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక భారతీయ విద్యాభవన్‌లోని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో ఆదివారం బాపురమణ బాలు కళాపీఠం, మల్లెతీగ సంయుక్త ఆధ్వర్యంలో బాపు జయంతి బాపు స్మారక పురస్కారాల సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా వచ్చిన గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ అందమైన స్త్రీని బాపు బొమ్మగా మనం ప్రశంసిస్తున్నామంటే అది బాపు చిత్రాలకున్న గొప్పతన మన్నారు. తెలుగు వారున్నంత కాలం బాపు సినిమాలు, చిత్రాలు, కార్టూన్లు సజీవంగా వుంటాయ న్నారు. బాపురమణబాలు కళాపీఠం వ్యవస్థాపకులు డా. రమణ యశస్వి, సుప్రసిద్ధ రచయిత డా.యం. ప్రభాకర్, సాహితీ సమాఖ్య గుంటూరు కార్యదర్శి ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ బాపు ప్రతిభను తెలిపే సంగతుల్ని గుర్తు చేశారు. ఈ సభలో సుప్రసిద్ధ సినీ దర్శకులు వర ముళ్ళపూడి, చిత్రకారుడు అరసవల్లి గిరిధర్, కార్టూనిస్టు హరి వెంకటరమణలకి బాపు స్మారక పురస్కారాలను అందజేశారు.

# మక్తాపురంలో అభివృద్ధి పనులకు మంత్రి ఆనం శ్రీకారం

సంగం (నెల్లూరు), డిసెంబరు 14 ప్రభాతవార్త: సంగం మండలం మక్తాపురం గ్రామంలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రూ.95 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రూ.63 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను మంత్రి ప్రారంభించారు. అలాగే రూ.32 లక్షలతో గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన గ్రామంలో నిర్మాణంలో వున్న శివాలయాన్ని సందర్శించారు. మక్తాపురం గ్రామంలో డ్రైన్‌లకు మరో రూ.75 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మరో రూ.10 లక్షలు సిమెంట్ రోడ్లకు అవసరమని చెప్పగా వెంటనే స్పందించిన మంత్రి రూ.10 లక్షలు కూడా మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రం అవినీతి మయమని విమర్శించారు. కూటమి ప్రభుత్వం హయాంలో రాష్ట్రం అన్ని రంగాలలో ముందుకు దూసుకొని పోతున్నదని అన్నారు. ఆత్మకూరులో 100 పడగల హాస్పటల్‌ని మరో 150 పడకలు పెంచి 250 పడకల హాస్పటల్‌గా నెల్లూరుకి దీటుగా చేస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్‌డిఓ పావనీ, కిమ్స్ హాస్పటల్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ తాళ్లూరు గిరినాయుడు, సోమశిల ప్రాజక్టు చైర్మన్ వేలూరు కేశవచౌదరి, ఆత్మకూరు డిఎస్‌పి వేణుగోపాల్, రవీంద్రరెడ్డి, తహసీల్దారు సోమ్లానాయక్, ఎంపిడిఓ షాలెట్, మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులు రెడ్డి, పడమటపాళెం నీటి సంఘం అధ్యక్షుడు గంగపట్నం చంద్రశేఖరయ్య, అన్నారెడ్డిపాళెం నీటి సంఘం అధ్యక్షుడు సూరా శ్రీనివాసులు రెడ్డి, వెంగారెడ్డిపాళెం గ్రామ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, సీనియర్ నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, సంగం పిఏసిఎస్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాస్ యాదవ్, దువ్వూరు పిఏసిఎస్ అధ్యక్షుడు బండా హరికిషోర్‌రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి మెట్టు విజయకృష్ణారెడ్డి, పగడాల రఘురామయ్య, మక్తాపురం నాయకులు సురేంద్ర, రమేష్, కుష్వంత్‌రెడ్డి, జెండాదిబ్బ నాయకులు పర్వతాల వెంకటరత్నం, నెల్లూరు



పెంచలయ్య, కంచర్ల నారాయణ నాయుడు, దువ్వూరు నాయకులు జడపల్లి దయాకర్‌గౌడ్ పంచాయితీరాజ్ ఇఇ, సుధాకర్‌రెడ్డి, ఏఇ రామయ్య, ఇరిగేషన్ ఏఇ వినయ్‌కుమార్, నరేష్ చౌదరి, మర్రిపాడు నాయకులు జనార్ధన్‌రెడ్డి, హరిరెడ్డి, మక్తాపురం సెక్రటరీ అరుణకుమారి, అన్నారెడ్డిపాళెం సెక్రటరీ మల్లికార్జున, సచివాలయం సిబ్బంది, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# వైసిపి నేత బొత్సపై మంత్రి ఆనం ఫైర్

సంగం (నెల్లూరు), డిసెంబరు 14 ప్రభాతవార్త: వైసిపి నేత మాజీ మంత్రి బొత్ససత్యనారాయణ విమర్శలను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తిప్పికొట్టారు. సంగం మండలం మక్తాపురంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ... వైసిపి ప్రభుత్వం అప్పులు చేసిపోతే కూటమి ప్రభుత్వం వడ్డీలు కడుతోందన్నారు. గడిచిన ఐదేళ్ళలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేశారని విమర్శించారు. వైసిపి పాలనలో రాష్ట్రానికి ఒక్క ప్రాజక్టు అయినా వచ్చిందా అని నిలదీశారు. ప్రభుత్వంలో పెన్షన్ తీసుకుంటున్న ఉద్యోగులందరికి మొండి చెయి చూపించి రూ.32 వేల కోట్లు నిధులు బకాయిలు పెట్టారని గుర్తు చేశారు. గత వైసిపి పాలనలో తెచ్చిన వేల కోట్లు అప్పులు వాళ్ళ పౌడర్లు, సోకులకు వాడారని ఎద్దేవా చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లాలో అన్నమయ్య ప్రాజక్టు కొట్టుకొని పోతే పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. సీనియర్ నాయకుడు బొత్ససత్యనారాయణ విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి కన్నబాబు జగన్ మాయలో పడి దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు.

# కూటమి ప్రభుత్వానికి జిల్లాల విభజన సెగ

## రాజంపేట, రైల్వేకోడూరులలో నిరాహార దీక్షలు

రాజంపేట, డిసెంబరు 14 ప్రభాతవార్త: ఉమ్మడి కడప జిల్లాలో కూటమి ప్రభుత్వానికి స్వపక్షం లోనే సెగ ప్రారంభమైంది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టిన ప్రభుత్వానికి రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేస్తూ కూటమి నేతలు జేఏసీగా ఏర్పడి నిరవధిక నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టారు. రాజంపేటలో చేపట్టిన ఆందోళనలు ఐదో రోజుకు చేరాయి. తాజాగా ఆదివారం నుంచి రైల్వేకోడూరు నియోజకవర్గంలో కూడా నిరవధిక నిరాహార దీక్షలను కూటమి నేతలు ప్రారంభించారు. రెండు నియోజకవర్గాల నేతలు చర్చల అనంతరం ఈనెల 19న ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చేందుకు ప్రజా గర్జనకు పిలుపునిచ్చాయి. రాజంపేటలో జిల్లా కేంద్రం చేసే విషయంలో ప్రభుత్వం ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటుందని రాజంపేట తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్‌రాజు నిరాహారదీక్ష శిబిరంలో పేర్కొన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి ప్రజల మనోభావాలను వివరిస్తామని, రాజంపేట జిల్లా కేంద్రం సాధించుకుంటామని ఆయన ధీమా



వ్యక్తం చేశారు. మరోవైపు ఒక అడుగు ముందుకేసి రైల్వే కోడూరు నియోజవర్గ ఇన్చార్జ్, కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, రైల్వేకోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ ఇప్పటికే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ను కలిసి రాజంపేట జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇరువురి నుంచి వీరిద్దరికీ స్పష్టమైన హామీ ఇంకా లభించలేదు.
మరోవైపు వైసీపీ చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవికుమార్ కూడా ఆర్ అండ్ బి బంగ్లా వద్ద రాజంపేట జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్షలకు పది రోజుల క్రితమే శ్రీకారం చుట్టారు.

# పిన్నెల్లి సోదరులకు జగన్ మద్దతు దారుణం

మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

గుంటూరు, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: 'పిన్నెల్లి' వంటి నరరూప రాక్షసులకు జగన్మోహన్ రెడ్డి మద్దతు ఇస్తున్నారని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. నరహంతకుడు జైలుకు పోయాడన్నారు. మాచర్ల ప్రజలు మళ్లీ దీపావళి సంబరాలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఆనందంగా ఉంటుంటే, వైసీపీ రాజకీయ కక్షతో డ్రామాలు ఆడుతోందని విమర్శించారు. అధికార మదంతో చేసిన నేరాలు, ఘోరాలు శాపాలుగా వెంటాడుతున్నప్పుడు, అక్రమ కేసులని సానుభూతి కోసం టాపిక్ డైవర్షన్ రాజకీయాలు చేయటం వైసీపీకే చెల్లుతుందన్నారు. పిన్నెల్లి సోదరులు చేసిన దాడులు, దౌర్జన్యాలు, హత్యలను ప్రజలు కళ్లారా చూశారని, తురకా కిషోర్ వంటి రాక్షసులను తయారు చేసి ప్రజల మీద వదిలేసి, వారి ఆర్తనాదాల మధ్య జగన్మోహన్ రెడ్డితో కలిసి పిన్నెల్లి సోదరులు సైకో ఆనందం పొందారన్నారు. జై జగన్ అనలేదని తోట చంద్రయ్యను పీక కోసేశారని, జల్లయ్యని పొట్టన పెట్టుకున్నారన్నారు. బడుగుబలహీన వర్గాలను హింసించి, హతమార్చి ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేసారని బ్రహ్మారెడ్డి దుయ్యబట్టారు, జగన్మోహన్ రెడ్డి లాంటి సైకో నాయకులు రాష్ట్రంలో ఉండటం రాష్ట్రానికి ప్రమాదకరమన్నారు. మాచర్లలో గత ఐదేళ్లు పిన్నెల్లి రాజ్యాంగం, చట్టమే అమలైంది. అక్రమ వ్యాపారాలు, భూదందాలు, గనుల అక్రమ తవ్వకాలతో పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడ్డారన్నారు. పోలింగ్ కేంద్రాల్లో చొరబడి ఈవీఎంలను ధ్వంసం చేశారని, సీఐపై హత్యాయత్నం చేసి బరితెగించారని, బడుగుబలహీన వర్గాల గొంతు నొక్కి, రక్తం తాగిన ఈ ఇద్దరు నరరూప రాక్షసులు చట్టం ముందు అడ్డంగా దొరికిపోయారన్నారు.. చేసిన పాపాలు ఊరికే పోతాయా?



మాచర్లలో మరోసారి దీపావళి వేడుకలు జరుగుతున్నాయని ప్రజలు సంతోషంగా ఉంటే జగన్మోహన్ రెడ్డి తట్టుకుపోలేక పోతున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు.

# ఎరువుల ఫ్యాక్టరీ కేంద్ర కార్యాలయాన్ని తెలంగాణకు తరలించాలి

**హైదరాబాద్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) కేంద్ర కార్యాలయాన్ని నోయిడా నుంచి రాష్ట్రానికి తరలించాలని ఫెర్టిలైజర్స్ స్టాండింగ్ కమిటీ కేంద్రానికి లేఖ రాసింది. ఆర్ఎఫ్‌సీఎల్‌లో వరుస సాంకేతిక అవరోధాలతో ప్లాంట్ తరచూ షట్ డౌన్ అవు తోంది. హల్దర్ టాప్స్ సమకూర్చిన హెచ్‌టీఆర్ టెక్నాలజీ వైఫల్యం చెందడంతో తరచూ షట్‌డౌన్‌లు కలుగడం, వాటిని సరి చేసే సమ యంలో నిర్ణయాల జాప్యం వల్ల సరైన సమ యంలో మరమ్మతులు పూర్తికాక ఉత్పత్తికి నష్టం ఏర్పడుతుంది. తద్వారా తెలంగాణ రైతాంగానికి యూరియా సరఫరాలో ఆటంకాలు ఏర్పడుతు న్నాయి. మరోపక్క దేశ వ్యాప్తంగా ఆర్ఎఫ్‌సీఎల్ సింగిల్ యూనిట్ ప్లాంట్‌గా ఉన్నా కేంద్ర కార్యా లయం నోయిడాలో ఉండడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. క్లిష్టమైన సమయంలో సంస్థ సీఈఓ, డైరెక్టర్(ఫైనాన్స్), హెచ్‌ఆర్ డైరెక్టర్లు నోయిడాలో ఉండడం వల్ల నిర్ణయాలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం ఏర్పడుతుందనే విమర్శలున్నాయి. ఆర్ఎఫ్‌సీఎల్ యేటా 12లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో పని చేయాల్సి ఉంటుంది. అయితే తరచూ సాంకేతిక అవరో ధాలతో ఎరువులు ప్రధానంగా యూరియా ఉత్పత్తికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

# కొవిడ్ వ్యాక్సిన్‌తోనే గుండెపోటు అపోహాలే

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** దేశంలో యువతలో ఆకస్మిక మరణాలపై కొంతకాలంగా నెలకొన్న ఆందోళనలకు ఢిల్లీ ఎయిమ్స్ క్లారిటీ ఇచ్చింది. కోవిడ్19 వ్యాక్సిన్‌కు, యువతలో సంభవిస్తున్న ఆకస్మిక మరణాలకు ఎలాంటి శాస్త్రీయ సంబంధం లేదని స్పష్టం చేసింది. వ్యాక్సిన్లు సురక్షితమైనవేనని, వాటి సమర్థతను ఈ అధ్యయనం మరోసారి ధృవీకరించిందని పరిశోధకులు ఆదివారం తెలిపారు. భారత వైద్య పరిశోధన మండలికి చెందిన ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌లో ఈ అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి. ఏడాది పాటు సాగిన ఈ పరిశోధనలో భాగంగా, 18 నుంచి 45 ఏళ్ల వయసు మధ్య ఆకస్మికంగా మరణించిన వారి కేసులను ఎయిమ్స్ వైద్యులు క్షుణ్ణంగా విశ్లేషించారు. ఇందుకోసం పోస్టుమార్టం, ఇమేజింగ్,





హిస్టోపాథలాజికల్ పరీక్షలతో పాటు మృతుల కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఈ విశ్లేషణలో కోవిడ్19 వ్యాక్సిన్ తీసుకున్న వారికి, తీసుకోని వారికి మధ్య ఆకస్మిక మరణాల విషయంలో గణాంకపరంగా ఎటువంటి తేడా లేదని తేలింది. యువతలో సంభవించిన మరణాలకు ప్రధాన కారణంగా గుండె సంబంధిత వ్యాధులు ఉన్నట్లు గుర్తించారు. శ్వాసకోశ సమస్యలు, ఇతర అనారోగ్యాలు కూడా కొన్ని కేసులలో మరణానికి దారితీశాయని తేలింది. ఈ ఫలితాలు ప్రపంచవ్యాప్తంగా జరిగిన శాస్త్రీయ పరిశోధనల ఫలితాలతో సరిపోలుతున్నాయని ఎయిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్ అరవ తెలిపారు. వ్యాక్సిన్ల వల్లే యువత చనిపోతున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు ప్రచారాలు, నిరాధారమైన ప్రచారాన్ని ఈ అధ్యయనం ఖండిస్తోంది. ప్రజలు ఈ అపోహలను నమ్మకుండా, శాస్త్రీయ ఆధారాలను మాత్రమే విశ్వసించాలని ఆయన సూచించారు. యువతలో ఆకస్మిక మరణాలకు గుర్తించని అనారోగ్య సమస్యలే కారణమని, క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు, జీవనశైలి మార్పుల ద్వారా ఇలాంటి ముప్పులను తగ్గించుకోవచ్చని ఆరోగ్య ఎయిమ్స్ నిపుణులు సూచించారు.

# మా పిల్లలపైనా సోషల్‌మీడియా వినియోగంపై ఆంక్షలు పెట్టా..

## యూట్యూబ్ సిఇఓ నీల్‌మోహన్

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** సోషల్‌మీడియా ప్లాట్ ఫామ్‌లపై చిన్నపిల్లలు అధికంగా సమయం వెచ్చించడం ఆరోగ్యదాయకం కాదని అందుకే తనతోపాటు తన భార్య హేమామోహన్ కూడా తమ ముగ్గురు పిల్లల్ని సోషల్‌మీడియా వినియోగంపై ఆంక్షలు విధించినట్లు యూట్యూబ్ సిఇఓ నీల్‌మోహన్ చెప్పారు. చిన్నపిల్లలకు అవసరమైన విజ్ఞానంతో కూడిన సమాచారం అందించేందుకే తాము 2015లో కిడ్స్ యూట్యూబ్ ప్లాట్‌ఫామ్ రూపొందించినట్లు తెలిపారు. 52 ఏళ్ల సీనియర్ ఎగ్జిక్యూటివ్ మాట్లాడుతూ తమ పిల్లల్ని నిర్దిష్ట మైన సమ యా లకు మాత్ర



మే సోషల్ మీడి యా వినియో గానికి నిర్ణయిం చామని, ఇతర సమయాల్లో చదువు ఇతర కీలక అంశాల పైనే దృష్టిపెట్టే చర్యలు తీసుకుంటామ న్నారు. యూట్యూబ్ ఇతర ప్లాట్‌ఫారాలతోపాటు ఇతర మీడియా ప్లాట్ ఫారాల వినియోగంపైనా తమ పిల్లలకు ఆంక్షలు పెట్టామని అన్నారు. వారాంతాల్లో మరింత కఠినంగా ఉంటామని, వారాంతంలో కూడా వాటినిపరిమితంగా వినియోగించేందుకు మాత్రమే వెసులుబాటు కల్పిస్తామని నీల్‌మోహన్ చెప్పారు. సోషల్‌మీడియా వినియోగంపై పిల్లలు అత్యధికంగా సమయం వెచ్చించకుండా చూడాల్సిన బాధ్యత తల్లితండ్రులదేనని ఆయన అన్నారు. ఆస్ట్రేలియా ఇటీవలే 16 ఏళ్లలోపువారికి సోషల్ మీడియా వినియోగంపై నిషేధం విదించిన సం దర్భాన్ని పురస్కరించుకుని ఆయన ఈ వ్యాఖ్యలు చేసారు. 16 ఏళ్లలోపు పిల్లలు టిక్‌టాక్, ఆల్ఫాబెట్ యూట్యూబ్, మెటా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌ల వినియోగంపై చిన్నారులకు నిషేధం ప్రకటించిన సంగతి తెలిసిందే. సోషల్‌మీడియా అతి వినియోగం అనర్థాలకు దారితీస్తుందని నీల్‌మోహన్ అభిప్రాయపడ్డారు.



# వైభవంగా కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవం

**కొమురవెల్లి, డిసెంబరు 14, ప్రభాతవార్త:** భక్తుల కొంగు బంగారం కొమురవెళ్ళి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి క్షేత్రంలో ఆదివారం ఉదయం 10.45 నిమిషాలకు కన్నుల పండువగా జరిగింది. స్వామి వారి కళ్యాణానికి ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సమర్పించారు. దేవాలయ ప్రాంగణంలోని తోట బావి వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక వద్ద వైదికుల మంత్రోచ్చారణలు, భాజా భజంత్రీలతో స్వామి వారి కల్యాణాన్ని వెండి సింహాసనంపై కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి రాష్ట్ర నలుమూల నుంచి కాకుండ పక్క రాష్ట్రాల నుంచి భక్తజనం వేలాదిగా మల్లన్న దేవాలయానికి తరలివచ్చారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని వీరశైవ ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. గర్భాలయంలో స్వామి కళ్యాణం నిర్వహించగా స్వామి తరపున పడిగన్నగారి వంశస్థులు అంజనేయులు శారద, అమ్మవార్ల తరుపున మహాదేవుని భాస్కర్ దంపతులు కన్యాదానం స్వీకరించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అర్చ కులు ఆలయ నుంచి పోలీసు బొమ్మ, రాతిగీ రలు, ఆలయ పరిసరాలలో ఊరేగించారు. అమ్మవారి తరపున మహాదేవుని వినయ్‌కుమార్ దంపతులు,స్వామి వారి తరపున పడిగన్నగారి వంశస్తులు చిన్న మల్లేశం దంపతులు కన్యాదానం స్వీకరించారు. వీరశైవ ఆగమ పండితులు, పురో హితులు, నందుల మఠం శశిభూషణ సిద్దాంతి స్వామిలతో పాటు ఆగమ పాఠశాల వేదపండి తులు, విద్యార్థులు స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య, దేవాదాయశాఖ కమిషనర్ హరీష్, మాజీ మంత్రి మల్లారెడ్డి, ఈవో టంకశాల వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.



# వ్యర్థాలతో ఉపాధి

నిర్వహణ కర్రర.... నీటిలో తేలుతూ... ప్రవాహాన్ని అడ్డుకునే గుర్రపు డెక్కలు అందరికీ వ్యర్థంగానే కనిపిస్తున్నాయి. కానీ, వాటిని ఉపయోగించే మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. పూర్ణిమా బోర్గోహైన్. ఆమెకి ఈ ఆలోచన ఎలా వచ్చిందంటే.... ప్రకృతి మనకు ఇచ్చిన వనరులెన్నో. వాటిని వినియోగించుకోవడం మనకు తెలియాలంతే. కాస్త సృజనాత్మకత ఉండాలే కానీ చుట్టూ ఉన్న ఏ వస్తువు వృథా కాదు. ఆఖరికి చెరువులు, చిత్తడినేలల్లో పనికిరాని మొక్కగా భావించే గుర్రపు డెక్క కూడా పూర్తిగా. అసోంలోని శివసాగర్ జిల్లా, భోరోలువా గ్రామం ఆమెది. అక్కడ చెరువుల సంఖ్య ఎక్కువ. కానీ అవన్నీ ఎక్కడికక్కడ గుర్రపు డెక్కలతో నిండి ఉండటం గమనించారామె. 'వీటిని ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా బ్యాగులు వస్తువుల తయారీలో వాడితే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది. వెంటనే సాధ్యాసాధ్యాల దిశగా దృష్టి సారించా. తెలిసిన వాళ్లని అడిగితే... మందుల తయారీకి వాడుతున్నారని కొందరు చెబితే, ఉపకరణాలు తయారు చేస్తారు. వాడొచ్చు అన్నారు మరికొందరు. ఇలాంటి వాటికి శిక్షణ ఇచ్చే కేంద్రం అహ్మదాబాద్‌లో ఉందని తెలుసుకుని అక్కడకు వెళ్లా'నని గుర్తుచేసుకుంటారు పూర్ణిమ. అక్కడ నైపుణ్యాలను అందిపుచ్చుకుని.. మాస్టర్ ట్రైనర్గా మారారామె. తర్వాత అసోంకు వచ్చి, స్థానిక మహిళలకూ ఈ నైపుణ్యాలను నేర్పారు. అలా అసోంలో వందల మందికి ఈ విద్యను అందించారు. తన ఇంటి వెనక కొంత శిక్షణ కేంద్రంగా మలిచి... చెరువులూ, నదుల్లోంచి సేకరించిన గుర్రపుడెక్కని శుద్ధి చేస్తున్నారు. తర్వాత వాటితో డైనింగ్ టేబుల్ మ్యాట్లూ, చాపలూ, బ్యాగులూ, పరు నిలువు తయారుచేస్తున్నారు. ఓ చిన్న పరిశ్రమను ప్రారంభించి, మరింత మంది మహిళలకు ఉపాధి కల్పించాలనేదే తన కోరిక అంటారు పూర్ణిమ.

# సమయం వృథా చేయకండి

మనం స్నేహితులను కలవడానికి వెళ్తున్నప్పుడు ట్రాఫిక్ జామ్ అయిదనుకోండి. అప్పుడు మీకు ఏమనిపి స్తుంది? అబ్బా ఈ ట్రాపిక్‌లో ఎంతసేపూ సమయం గడవదే అనే కదా! అదే మరి స్నేహితులతో సరదాగా ముచ్చట్లాడు తుంటే ఏమనిపిస్తుంది. అప్పుడు టైమ్ అయిపోయిందా! అని కదా. సమయం ఎప్పుడూ ఒకలానే ఉంటుంది. మరిమనికి ఎందుకు అలా అనిపిస్తుందో తెలుసా!

'సమయమే డబ్బు', 'సమయాన్ని ఆదా చేయడం, ఖర్చుచేయడం' లాంటి మాటలు ప్రస్తుత జీవనశైలిలో మనం సమయానికి ఇచ్చే ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా ఇవి పట్టణ వాతావరణంలో నివసించే వారికి బాగాసరిపోతాయి. ఎందుకంటే వీళ్ల ప్రకృతి సూచనల కంటే ఇంట్లో గడియారాన్ని అనుసరించే రోజువారీ పనులు చేసుకుంటారు కాబట్టి. నిజానికి సమయంపై ఇంతలాధారపడడం, మన ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం చూపిస్తుందని టుర్కూ యూనివర్సిటీ చేసిన పరిశోదనల్లో వెల్లడైంది. సమయం సరిపోవట్లేదు అనే భావనా ఇందులో



నుంచి వచ్చిందేనట. అందుకే నగరాల్లో ఉండేవారు ఎక్కువగా ప్రకృతిలో ఎక్కువ సమయం గడిపేలా చూసుకోవాలి. అప్పుడే మనకు 'బ్యాలెన్స్‌డ్ సెన్స్ ఆఫ్ టైమ్' వస్తుంది. సహజసిద్ధ వాతావరణంలో ఉండేవారికి, పట్టణ వాతావరణంలో ఉండేవారికీ సమయాన్ని గడపడంలో తేడా ఉంటుందట. అంతేకాదు కొంతమందిని గతంలో జరిగిన చేదు విషయాలూ, చెడు సంఘటనలూ వర్తమానంలో పదేపదే గుర్తుకు వస్తూ వేధిస్తుంటాయి. అటువంటి వారూ ప్రకృతిలో గడపడం వల్ల వాటినుంచి బయటపడ గలుగుతారట. అందుకే మన నగరాలు పట్టణాలను పార్కులూ, పచ్చదనం ఉండేలా నిర్మించుకోవాలని పరిశోధనలు సూచిస్తున్నాయి.

# జల సంరక్షణలో ఉత్తమ ప్రతిభ



**సివిల్ సర్వీస్ పరీక్షల్లో ఆలిండియా టాపర్‌గా, ఈ ఘనత సాధించిన తొలి దళిత చరిత్ర సృష్టించిన టీనా దాబి గుర్తున్నారు కదా! వ్యక్తిగత విషయాల్లోనే కాదు... ఐఎఎస్‌గా ఆబాధ్యతలు తీసుకున్నప్పటి నుంచీ తాను చేపట్టిన కార్యక్రమాలతో ఎప్పుడూ వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. తాజాగా వర్షపు నీటి సంరక్షణలో అత్యుత్తమ పనితీరు కనబజనాభాగీదారి (జేఎస్సీబీ) అవార్డును** అందుకున్నారు.

ఐఎఎస్ అధికారిణి టీనా దాబి తన కెరియర్‌లో మరో అద్భుత విజయాన్ని నమోదు చేసుకున్నారు. తాజాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జల్‌సంచయ్-జన్‌భాగీదారీ (జన భాగస్వామ్యంతో జల సంరక్షణ) అవార్డు, రూ.2 కోట్ల నగదు బహుమతిని అందుకున్నారు రాజస్థాన్‌లోని బాడ్మేర్ జిల్లా కలెక్టర్‌గా క్యాచ్ ది రెయిన్ వేర్ ఇట్ ఫాల్స్... వెన్ ఇట్ అంటూ తన బృందంతో కలిసి జల సంరక్షణకు నడుం కట్టారు. ఇందులో భాగంగానే ట్యాంకులు, చెరువులు, దిగుడు బావులు... వంటివాటిని నిర్మించారు. వర్షపు చినుకుల్ని ఒడిసి పట్టారు. ఈ పనిలో ప్రజల్ని పెద్ద ఎత్తున అందజేయ గలిగారు. ఫలితంగా వర్షపు నీరు ఆదా అవ్వడమే కాదు... భూగర్భ జలాలూ పెరిగాయి. చెరువులు, కుంటలు, సరస్సులన్నీ నీటితో కళకళలాడు తున్నాయి. ఇలా పొదుపు చేసిన జలాన్ని ప్రజలు తాగడానికి నీరు అవసరాలకోసం ఉపయోగించగలుగుతున్నారు.

**మహిళలకోసం...** గ్రామాల స్వయం సమృద్ధి, మహిళా సాధికారతే లక్ష్యంగా పని చేస్తారు టీనా. రాజస్థాన్ లోని అజ్మీర్‌లో అసిస్టెంట్ కలెక్టర్‌గా తొలిపోస్టింగ్. ఆపై భిల్వాడా జిల్లా సబ్ డివిజ విధులు నిర్వర్తించారు. ఆ సమయంలో కోవిడ్ కట్టడి




చర్యలతో వార్తల్లో నిలిచారామె. జైపూర్ జాయింట్ సెక్రటరీగా పనిచేసిన టీనా జైసన్ శక్తి (లేడీస్ ఫస్ట్) పేరుతో బాలికలు ఆరోగ్యం, రక్షణ, చదువులపై దృష్టి పెట్టారు. అందరి దృష్టినీ ఆకర్షించారు. గతేడాది కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాక 'మరు ఉడాన్' పేరుతో మరో తెలుగు రూపకల్పన చేశారు. పరిసరాల స్వచ్ఛతే లక్ష్యంగా 'నవో బాడ్మేర్' ప్రోగ్రామ్‌ని నడిపించారు. అప్పటికి 22 ఏళ్ల... టీనా దాబి భోపాల్‌లో పుట్టిపెరిగారు. ఈమె తండ్రి జస్వంత్ దాబి బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి తల్లి హిమాలీ ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్ మాజీ అధికారిణి... తన ఇద్దరు పిల్లల్ని పెంచడానికి స్వచ్ఛందపదవీ విరమణ చేశారు. చెల్లి రియా కూడా అక్కబాటలోనే నడిచి ఐఎఎస్ అధికారిణిగా పనిచేస్తోంది.

టీనా దాబి భోపాల్‌లోని కార్మెల్ కాన్వెంట్‌లో విద్యాభ్యాసం పూర్తి చేశారు.. ఢిల్లీలోని లేడీ శ్రీరాం కాలేజీలో డిగ్రీ చదివారు. ఆపై 2015లో సివిల్‌సర్వీసెస్ పరీక్షలు రాశారు. టీనా తొలి ప్రయత్నంలోనే ఐఎఎస్ టాపర్‌గా నిలిచారు. అప్పటికి ఆమె వయసు 22 ఏళ్లే. ఆ ఘనత సాధించిన తొలి దళిత మహిళగానూ గుర్తింపు పొందారు. టీనా దాబీకి ఫాలోయింగ్ కూడా ఎక్కువే 1.5 మిలియన్లకు పైగానే ఫాలోయర్లు ఉన్నాయి.

# పరమశివుడి అనుమతి

సీతాపహరణ తర్వాత రామలక్ష్మణులు దండకారణ్యంలో సంచరిస్తుంటే. వాళ్లకో మనోహరమైన ప్రాంతం కనిపించింది. సీతమ్మవారి జాడ తెలిసేవరకూ అక్కడే నివసించాలనుకున్నా శ్రీరాముడు. అతడి సంకల్పాన్ని బలపరిచాడు లక్ష్మణుడు. సోదరా నాతో ఏకీభవించినందుకు సంతోషం. అయితే ఇదెవరిదో తెలుసుకోవాలి. వారి అనుమతి లేకుండా ఉండటం భావ్యం కాదు కదా! కనుక చుట్టుపక్కల ఎవరైనా ఉన్నారేమో చూడు, వారితో మాట్లాడుదాం అన్నాడు రాముడు. వెంటనే లక్ష్మణుడు పరిసరాలను పరిశీలిస్తూ కొంత దూరం వెళ్లగా.. ఉసిరి, మారేడు చెట్ల మధ్యన శివాలయం కనిపించింది. కానీ అక్కడెవరూ లేరు. తిరిగొచ్చి సంగతి తెలియజేశాడు. అయితే ఈ ప్రాంతానికి పరమ శివుడే అధిపతి అయ్యుంటాడు. ఆయన అనుమతి తీసుకో లక్ష్మణా అన్నాడు రాముడు. లక్ష్మణుడు శివాలయం వద్దకు వెళ్లి, శివుడి ఆజ్ఞకై అర్థించాడు. వెంటనే శివలింగం నుంచి ఉజ్వలంగా ఉన్న మూర్తి వెలువడి, అద్భుతంగా నృత్యం చేసి అదృశ్యమైంది. అలా ఎందుకు జరిగిందో, దాని భావం ఏమిటో లక్ష్మణుడికి అర్థం కాలేదు. సోదరుడి వద్దకు వచ్చి విషయం చెప్పాడు. రాముడు చిన్నగా నవ్వి. సోదరా! శివుడి ఆజ్ఞ లభించింది! కుటీరం నిర్మించు అన్నాడు. ఆజ్ఞ ఎప్పుడు లభాంచింది? ఆశ్చర్యంగా అడిగాడు లక్ష్మణుడు. లక్ష్మణా! మితిమీరిన స్వార్థం, జిహ్వా చాపలనయత్రం, కామ వికారాలే కష్టాలకు మూలం. వీటిని గనుక నియంత్రించుకోగలిగితే.. ఇక్కడే కాదు- ఎక్కడైనా సుఖంగా జీవించవచ్చు! ఈ మూడింటినీ మనం నిగ్రహించుకోగలమని పరమశివుడు గ్రహించాడు. కనుకనే నృత్య భంగిమలో దర్శనమిచ్చి తన అంగీకారాన్ని తెలియజేశాడు అంటూ వివరించాడు శ్రీరాముడు.

# ముగ్గులకు ఆహ్వానం



ధనుర్మాసం అంటే ముగ్గుల మాసంకదా! ఈ నెలంతా ముగ్గులు వేస్తారు. ఈ సందర్భంగా 'చెలి' పేజీలో ముగ్గుల ప్రచురణ కోసం ఆహ్వానం పలుకుతున్నాం. ఆసక్తిగల మహిళలు ముగ్గులు వేసి పంపించగలరు.

**సూచనలు :**

- ★ గతంలో ప్రచురించిన ముగ్గులను పంపవద్దు. కొత్తముగ్గులు మాత్రమే పంపించగలరు.
- ★ ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోను జతచేయగలరు. పాతఫొటోలను పంపవద్దు.
- ★ మీ పూర్తి చిరునామా, ముగ్గుల సంఖ్యను రాయాలి.
- ★ ఏ4 పేజీలో ఒకసైడు మాత్రమే ముగ్గుల్ని వేయాలి.
- ★ ముగ్గులు క్లీయర్‌గా, రంగు లతో కనిపించాలి.
- ★ మీ ముగ్గులను మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు.

**మా చిరునామా**

ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్‌ట్యాంక్ బండ్, డిబిర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. Gmail: cheli@vaartha.com

**కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు**

# పంజాబీ ఛోలే...



**కావలసినవి :** శనగలు-2 కప్పులు, టొమాటో గుజ్జు-రెండున్నర కప్పు, ఉల్లి తరుగు కప్పు, అల్లం వెల్లుల్లి ముద్ద-ఒకటిన్నర చెంచా, యాలకులు -5, బిర్యానీ ఆకులు-2. దాల్చినచెక్క-అంగుళం ముక్క మిరియాలు పావు చెంచా , లవంగాలు -4, ఉప్పు-తగినంత, ఛోలే మసాలా-3 చెంచాలు, గరం మసాలా - పావు చెంచా, కారం-అర చెంచా, కొత్తమీర, తరుగు-అర కప్పు, జీలకర్ర పొడి-ఒకటిన్నర చెంచా, సన్నగా తరిగిన అల్లం పాదుచెంచా, మెంతి ఆకుల పొడి-అర చెంచా, నూనె-2 చెంచాలు, నెయ్యి-ఒక టేబుల్ స్పూన్.

**తయారీ :** శనగలు ముందు రోజు రాత్రి నానబెట్టి, ఆ నీళ్ల తీసేయాలి. వాటికి ఐదు కప్పుల నీళ్ల, ఉప్పు జతచేసి కుక్కర్‌లో ఐదు విజిల్స్ వచ్చేవరకూ ఉడికించాలి. కడాయిలో నూనె వేడయ్యాక బిర్యానీ ఆకులు, దాల్చినచెక్క మిరియాలు, యాలకులు, లవంగాలు వేయాలి. మంచి వాసన వస్తుండగా అల్లం వెల్లుల్లి ముద్ద , ఉల్లి తరుగు వేసి బంగారు రంగు వచ్చేవరకూ వేగనివ్వాలి. అందులో టొమాటో గుజ్జు వేసి ఉడికించాలి. మధ్యలో అడుగంటకుండా కలియబెడుతుండాలి. పావు గంట తర్వాత ఛోలే మసాలా, కారం ఉప్పు, జీలకర్ర పొడి, ఉడికించిన శనగల, కప్పు నీళ్ల ఇంకో ఆరేడు నిమిషాలు ఉడికించాలి. నీళ్ల ఇగిరి, చక్కగా ఉడికిందనుకున్నాక.. నెయ్యి, అల్లం తరుగు, గరం మసాలా, మెంతి ఆకులు పొడి, కొత్తిమీర తరుగు వేసి కలియబెట్ట దించేయాలి. అంతే ఘుమఘుమలాడే పంజాబీ ఛోలే తిని ఆనందించడమే తరువాయి.

# తెర

## సంక్రాంతి పెర్‌ఫెక్ట్ ఎంటర్ టైనర్



మెగాస్టార్ చిరంజీవి, బ్లాక్‌బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి 'మన శంకరవర ప్రసాద్ గారు ' షూటింగ్ పూర్తి, జనవరి 12న సంక్రాంతి కానుకగా గ్రాండ్‌గా రిలీజ్‌మెగాస్టార్ చిరంజీవి మాస్‌అండ్‌ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ బ్లాక్‌బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం ఆకట్టుకునే ప్రమోషనల్ కంటెంట్, దూకుడుగా సాగుతున్న ప్రచార కార్యక్రమాలతో సంచలనం సృష్టిస్తోంది. విక్టరీ వెంకటేష్ కీలకమైన ప్రత్యేక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తుండగా, అర్చన సమర్పిస్తున్నారు. ఈ రోజు చిత్ర నిర్మాతలు సినిమా విడుదల తేదీని ప్రకటించడానికి ఒక గ్రాండ్ ఈవెంట్ నినిర్వహించారు. 'మన శంకరవర ప్రసాద్ గారు' పూర్తి షూటింగ్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులను వేగంగా జరుపు కుంటోంది. ఈ చిత్రం సంక్రాంతికి కేవలం2 రోజుల ముందు, జనవరి 12న థియేటర్లలో విడుదల కానుంది. మెగాస్టార్ చిరంజీవి యంగ్ అండ్ డైమనిక్ గా కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ అదిరిపోయింది. రెడ్ కార్ పై బ్లాక్ సూట్ లో కాఫీ సిప్ చేస్తూ మెగా స్వాగ్ తో మెస్మరైజ్ చేశారు చిరంజీవి.

## ఘనంగా 'విధాత' మూవీ ట్రైలర్ లాంచ్

ఏబీసీ ప్రొడక్షన్ పతాకం పై భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రదారులుగా మణికంఠ రాజేంద్ర బాబు దర్శకత్వం లో అప్పిన పల్లి భాస్కరాచారి నిర్మించిన చిత్రం "విధాత". వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందిన ఈ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోదర్శకుడు మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ సినిమా పరిశ్రమలో అవకాశాల కోసం ఎంతో ప్రయత్నించాను. ఇక్కడ లభించని అవకాశం మా ఊరిలో మా ప్రొడ్యూసర్ భాస్కరాచారి రూపంలో దక్కింది.



అతిథిగా వచ్చిన నటుడు కాదంబరి కిరణ్ మాట్లాడుతూ ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ పలు పోరాటాల రూపంలో విధాత అడుగుపెడతాడు. తప్పుచేసిన వారిని శిక్షి స్తాడు. నిర్మాత డాక్టర్ అప్పిన పల్లి భాస్కరాచారి మాట్లాడుతూ మా విధాత సినిమా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ కు అతిథిగా వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. కొన్ని వాస్తవ ఘటనల నేపథ్యంతో ఈ సినిమాను నిర్మించాం.

## 'దేఖ్‌లేంగే సాలా' గీత ఆవిష్కరణ వేడుక



'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి తొలి గీతంగా 'దేఖ్‌లేంగే సాలా విడుదలైంది. ఈ గీతావిష్కరణ కార్యక్రమం రాజమండ్రిలో జరిగింది. అభిమానుల కోలాహలం నడుమ వైభవంగా జరిగిన కార్యక్రమంలో దర్శకుడు హరీష్ శంకర్, సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్, నిర్మాత నవీన్ యెర్నేని, గీత రచయిత భాస్కరభట్లలు పాల్గొన్నారు.

అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుంచి విడుదలైన తొలి గీతం 'దేఖ్‌లేంగే సాలా' అభిమానులు, సినీ ప్రేమికుల్లో ఒక్కసారిగా భారీ ఉత్సాహాన్ని రేపింది. ఉత్సాహభరితమైన సంగీతం, అద్భుతమైన నృత్య రీతులతో రూపొందిన ఈ పాటలో పవన్ కళ్యాణ్ తన అత్యంత ప్రజాదరణ పొందిన అవతారంలో కనిపిస్తున్నారు. వింటేజ్ స్టైల్, రా ఇంటెన్సిటీతో ఒకప్పుడు ప్రేక్షకులను ఉర్రూతలూగించిన ఆయన తన ఐకానిక్ బ్లాక్‌బస్టర్ పాటల జ్ఞాపకాలను మళ్లీ గుర్తు చేస్తున్నారు. ఉండబోతుందో తెలిపేలా సాహిత్యం అద్భుతంగా కుదిరింది. ఇక విశాల్ దద్లానీ గాత్రం పాటకు మరింత పవర్‌ను జోడించి, దీనిని ఖచ్చితంగా అందరూ ఇష్టపడే గీతంగా మార్చింది.

## సాంగ్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ రావడం ఆనందానిచ్చింది

**మ్యూజిక్ డైరెక్టర్ మిక్కీ జే మేయర్**



ఆకట్టుకునే కథలను అందించడంలో స్వప్న సినిమాస్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుంది. వారి అప్ కమింగ్ మూవీ ఛాంపియన్ ఆసక్తికరమైన ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణ లో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. మిక్కీ జే మేయర్ అందించిన పాటలు చార్ట్ బస్టర్ అయ్యాయి. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఛాంపియన్ ప్రీ ఇండిపెండెన్స్ టైం లో జరిగే కథ..

**ఈ సినిమాకి మ్యూజిక్ చేయడం ఎలా అనిపించింది?**

ఇండిపెండెన్స్ సమయంలో జరిగే కథలు ఇప్పుడు వరకు చాలానే వచ్చాయి. ఆ చిత్రాల్లో బ్రిటీషర్స్ తో జరిగిన పోరాటాన్ని చూపించడం జరిగింది. పీరియడ్ సినిమాలు చేయడం నాకు చాలా ఇష్టం. ఎందుకంటే ఒక టైం నుంచి మరో టైం లోకి వెళ్లి ఒక కాలాన్ని చూడడమనేది ఎప్పుడూ ఆసక్తికరంగా ఉంటుంది. మహానటి సినిమా కూడా అలాంటి అనుభూతిని ఇచ్చిన సినిమానే. ఛాంపియన్ మ్యూజిక్ విషయానికి వచ్చేసరికి తెలంగాణ జానపదంతో పాటు వెస్ట్రన్ మ్యూజిక్ ని మిళితం చేసి ఒక జానెర్ క్రియేట్ చేసే అవకాశం ఈ కథ కల్పించింది.

**డైరెక్టర్ ప్రదీప్‌ఈ కథ చెప్పినప్పుడు మీ రియాక్షన్ ఏమిటి?**

డైరెక్టర్ ప్రదీప్ ఈ కథని నాకు ఫోన్ లో చెప్పారు. అయినా కథ చెప్పినప్పుడే నాకు చాలా నచ్చింది. ఖచ్చితంగా ఈ సినిమా చాలా ప్రత్యేకంగా ఉండబోతుంది అనిపించింది.

**గిరగిర పాటకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది కదా.. ఆ సిచువేషన్ గురించి చెప్పండి?**

ఆ పాటకు మంచి రెస్పాన్స్ రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. అది మంచి కమర్షియల్ సాంగ్. నిజానికి హీరో ఇంట్రో సాంగ్ అది. మంచి మెలోడీ. మంచి బీట్ కూడా ఆడ్ అవ్వడంతో చాలా కొత్త ఫ్లేవర్ వచ్చింది .

## డి.వి.ఎస్ రాజు 97వ జయంతి

తెలుగు సినిమాకు అపారమైన సేవలందించిన డి.వి.ఎస్. రాజు. ఈరోజు డిసెంబర్ 13 డి.వి.ఎస్ రాజు 97వ జయంతి జరువుకున్నారు. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఉన్న తెలుగు సినిమా రంగాన్ని ఎఫ్.డి.సిఅధ్యక్షుడుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలించడంలోను, రిచర్డ్ అటెన్ బరో నిర్మించిన ఆస్కార్ అవార్డు సినిమా గాంధీ లాభాల్లోకొంత భాగాన్ని ఎన్.ఎఫ్.డి.సి అధ్యక్షుడుగా భారతీయ కార్మికుల నిధిని ఏర్పాటు చెయ్యడంలోను కీలకమైన భూమిక పోషించారు. సినిమా నిర్మాణం చేస్తూనే సినిమా రంగ సంస్థలను బలోపేతం చెయ్యడంలో విశేషమైన కృషి చేశారు. 1950లో మహానటుడు ఎన్.టి. రామారావుతో పరిచయం రాజు జీవితాన్ని ఊహించని మలుపు తిప్పింది. రాజుని తన భాగస్వామిగా చేసుకొని నేషనల్ ఆర్ట్ థియేటర్ సంస్థలో ఎన్.టి.ఆర్ ఎన్నో గొప్ప చిత్రాలను నిర్మించారు. 1960లో రాజు డి.వి.ఎస్ ప్రొడక్షన్స్ సంస్థను ప్రారంభించారు. అయినా రాజుతో రామారావు మైత్రీ బంధం కొనసాగింది. 1983లోరామారావు ముఖ్యమంత్రి గా బాధ్యతలు చేపట్టిన తరువాత రాజుని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థకు అధ్యక్షుడుగా నియమించారు ఫిలింనగర్ సోసిటీ, చలన చిత్ర వాణిజ్య మండలి, దక్షి ణ భారత చలన చిత్ర వాణిజ్య మండలి, ఎఫ్ .డి.సి,ఎన్ .ఎఫ్.డి.సి, ఫిలిం ఫెడరేషన్, ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ మొదలైన సంస్థల అభివృద్ధిలో రాజు కృషి ఎంతో వుంది,.రాజు నిస్వార్థ సేవ, అంకిత భావం, అవిరళ కృషి ని గుర్తించిన భారత ప్రభుత్వం 2001వ సంవత్సరంలో పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది .



## 25న 'బ్యాడ్ గాళ్స్ 'చిత్రం విడుదల

ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్, నీలి నీలి ఆకాశం క్రియేషన్స్, ఎన్‌వీఎల్ క్రియేషన్స్ బ్యానర్స్ పై అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, రోహన్ సూర్య, మొయిన్ ముఖ్య తారాగణంతో 30 రోజుల్లో ప్రేమించడం ఎలా సినిమా తో మంచి విజయాన్ని అందుకున్న డైరెక్టర్ ఫణి ప్రదీప్ ధూళిపూడి దర్శకత్వంలో వస్తున్న మరో ఎంటర్టైనర్ చిత్రం "మా 'బ్యాడ్ గాళ్స్'కానీ చాలా మంచోళ్లు అనేది ట్యాగ్ లైన్. శశిధర్‌నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేష్ ఈ చిత్రానికి నిర్మాతలు.అయితే ఈ చిత్రం క్రిస్మస్ పండుగ కానుకగా డిసెంబర్ 25న విడుదల చేస్తున్నారు చిత్ర యూనిట్. ఈ సందర్భంగా.. ఈ చిత్ర దర్శకుడు ఫణి ప్రదీప్ ధూళిపూడి మాట్లాడుతూ "మా 'బ్యాడ్ గాళ్స్' పూర్తి ఎంటర్టైనర్ చిత్రం. జాతిరత్నాలు, మ్యాడ్ లాంటి హిలేరియస్ చిత్రాలు అమ్మాయిలు చేస్తే ఎలా ఉంటుందో అలాంటి చిత్రం మా బ్యాడ్ గాళ్. సినిమా చాలా బాగా వచ్చింది. అందరికీ నచ్చుతుందని అనుకుంటున్నాను.



# బంగ్లాదేశ్ సూపర్ విక్టరీ

## అఫ్ఘానిస్థాన్‌పై 3 వికెట్ల తేడాతో గెలుపు



**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ జట్టు అఫ్ఘానిస్తాన్‌పై 3 వికెట్ల తేడాతో ఉత్కంఠభరితమైన విజయాన్ని నమోదు చేసింది. దుబాయ్‌లో జరిగిన పురుషుల అండర్ 19 ఆసియా కప్ గ్రూప్ బి మ్యాచ్‌లో ఓపెనర్లు రిఫత్ బేగ్, జావాద్ అబ్రార్ అర్ధ సెంచరీలు సాధించారు. ఫైసల్ షినోజాడా 103 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన తర్వాత అఫ్ఘనిస్తాన్ 283/7 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ ఆలస్యంగా పతనమైనప్పటికీ ఒక ఓవర్ మిగిలి ఉండగానే ఛేదనను పూర్తి చేసింది. బంగ్లాదేశ్ 236/2 వద్ద ఛేదనకు నియంత్రణలో ఉన్నట్లు కనిపించింది. ఎనిమిది వికెట్లు చేతిలో ఉండగా 45 బంతుల్లో 48 పరుగులు మాత్రమే అవసరం. కానీ నాలుగు ఓవర్ల వ్యవధిలోనే 4 వికెట్లు పడటంతో అఫ్ఘనిస్తాన్‌కు ఆశలు చిగురించాయి. ఆల్ రౌండర్ రిజాన్ హోసాన్ 17 పరుగులతో నాటౌట్‌గా నిలిచి బంగ్లాదేశ్‌ను 7 బంతులు మిగిలి ఉండగానే విజయతీరాలకు చేర్చాడు. ఓపెనర్లు అబ్రార్, బేగ్ 151 పరుగుల అద్భుతమైన భాగస్వామ్యంతో బంగ్లాదేశ్ విజయానికి వేదికగా నిలిచారు. 27వ ఓవర్లో బేగ్ 62 పరుగులకు ఔట్ కాగా, అబ్రార్ సెంచరీ మిస్ అయ్యాడు. రూహుల్లా అరబ్ 96 పరుగుల వద్ద అవుట్ అయ్యాడు. కెప్టెన్ అజీజుల్ హకీమ్, కలాం సిద్దికి మూడో వికెట్‌కు 66 పరుగులు జోడించారు. కానీ మిడిల్ ఆర్డర్‌లో తడబాటు కారణంగా హోసాన్ జోక్యంతో లక్ష్యాన్ని చేధించారు. అఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్ షినోజాదా 103 పరుగులతో నిర్మించబడింది. అతను ఉస్మాన్ సదత్‌తో 66, ఉజైరుల్లా నియాజైతో 89 పరుగుల భాగస్వామ్యంతో స్కోరును 200 దాటించాడు. అయితే అఫ్ఘనిస్తాన్ 46వ ఓవర్లో 225/7కి పడిపోయింది, అజీజుల్లా మియాఖిల్ (38), అబ్దుల్ అజీజ్ (26) వారిని 283 పరుగులకు చేర్చారు.

# ఒడిశా మాస్టర్స్‌లో ఉన్నతి, కిరణ్‌కు టైటిళ్లు



న్యూఢిల్లీ: ఒడిశా మాస్టర్స్ 2025లో భారత్ షట్లర్లు ఉన్నతి హుడా, కిరణ్ జార్జ్ సింగిల్స్ టైటిళ్లను గెలుచుకున్నారు. భువనేశ్వర్‌లో ఆదివారం జరిగిన మాస్టర్స్ సూపర్ 100 టోర్నీలో భారత షట్లర్లు రెండు టైటిళ్లతో వరల్డ్ టూర్‌ను ముగించారు. ఉన్నతి మొత్తం భారత మహిళల సింగిల్స్ ఫైనల్లో ఇషారాణి బారువాను ఓడించింది. ఆమె తన క్లాస్‌ను ప్రదర్శించి, వరుస గేమ్‌లలో 21-17, 21-10 తేడాతో ఆధిపత్య విజయాన్ని నమోదు చేసింది. ఈ సంవత్సరంలో ఆమెకు ఇది మొదటి విజయం. మరోవైపు, కిరణ్ ఇండోనేషియా యువ ఆటగాడు మొహమ్మద్ యూసుఫ్‌తో జరిగిన మూడు గేమ్‌ల మ్యాచ్‌లో 21-14, 13-21, 21-16 తేడాతో చాలా కఠినమైన ఆటతీరును కనబరిచాడు. మొదటి గేమ్‌లో మంచి ఆధిక్యాన్ని కొనసాగించి 21-14తో గెలుచుకున్నాడు. రెండవ గేమ్‌లో యూసుఫ్ మెరుగ్గా కనిపించి కిరణ్‌పై ఒత్తిడి తెచ్చాడు, కానీ భారత ఆటగాడు స్కోర్‌లను అదుపులో ఉంచుకుని ఒక పాయింట్ మాత్రమే వెనుకబడి ఉన్నాడు. అయితే, అతను వరుసగా 8 పాయింట్లు ఇచ్చి రెండవ గేమ్‌ను కోల్పోయాడు. దీనితో కిరణ్ దానిని విజయంగా మార్చుకున్నాడు.

ఆట

# ఐపిఎల్‌లో దిగ్గజాలు ఔట్

## ముగిసిన స్టార్ ప్లేయర్ల హిస్టరీ











**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 కోసం జోరుగా సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి. అయితే ఈ ఐపీఎల్‌కు సంబంధించి ఈ నెల 16 న అబుదాబిలో జరగబోయే మినీ వేలం దగ్గర పడుతున్న కొద్దీ, పలువురు స్టార్ ఆటగాళ్లు ఈ సీజన్ నుంచి తాము తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఐపీఎల్ చరిత్రలో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఈ ఆటగాళ్ల నిర్ణయాలు చర్చనీయాంశమైంది. వీరిలో కొంతమంది ఆటగాళ్లు ఇతర లీగ్‌లను ఎంచుకోగా, మరికొందరు రిటైర్మెంట్, బ్రేక్ తీసుకుంటున్నారు. ఇంగ్లాండ్‌కు చెందిన సీనియర్ ఆల్‌రౌండర్ మోయిన్ అలీ ఐపీఎల్ 2026 లో ఆడకూడదని నిర్ణయించుకుని, బదులుగా పాకిస్తాన్ సూపర్ లీగ్ వైపు మొగ్గు చూపాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున అలీ గత సీజన్ అంతగా బాగా ఆడకపోయినా, మోయిన్ ఆల్‌రౌండ్ సామర్థ్యాలకు మంచి గుర్తింపు ఉంది. ఐపీఎల్‌లో 73 మ్యాచ్‌ల్లో 1167 పరుగులు చేసి, 41 వికెట్లు పడగొట్టాడు. అలాగే దక్షిణాఫ్రికా దిగ్గజం ఫాఫ్ డు ప్లెసిస్ కూడా పాకిస్తాన్ సూపర్ లీగ్ ప్రాధాన్యత ఇవ్వాలని డిసైడ్ అయ్యాడు. ఐపీఎల్ తనకు సంవత్సరాలుగా గుర్తింపు మరియు గౌరవాన్ని ఇచ్చిందని, అయితే ఈ నిర్ణయం తీసుకోవడం తనకు చాలా కష్టమైందని పేర్కొన్నాడు. చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ జట్ల తరపున అద్భుతంగా రాణించిన ఫాఫ్, ఐపీఎల్‌లో మొత్తం 4773 పరుగులు చేసి నమ్మదగిన బ్యాట్స్‌మన్‌గా ఉన్నాడు. ఇక ఆస్ట్రేలియాకు చెందిన విధ్వంసకర ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ ఏ కారణం చెప్పకుండానే వచ్చే ఐపీఎల్ వేలం నుంచి తన పేరును ఉపసంహరించుకున్నాడు. గత రెండు సీజన్లలో అతని ప్రదర్శన చాలా పేలవంగా ఉంది. 15 ఇన్నింగ్స్‌లలో కేవలం 100 పరుగులు మాత్రమే చేయగలిగాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్ ఐపీఎల్ నుంచి అధికారికంగా రిటైర్మెంట్ ప్రకటించాడు. రస్సెల్ ఐపీఎల్‌లో అత్యంత ప్రమాదకరమైన ఆటగాళ్లలో ఒకడుగా గుర్తింపు తెచ్చుకున్నాడు. 140 మ్యాచ్‌లలో 2651 పరుగులు, 123 వికెట్లు రస్సెల్ పవర్ తెలియజేస్తాయి. కాగా భారత దేశపు మంచి ఆఫ్‌స్పిన్నర్లలో ఒకడైన రవిచంద్రన్ అశ్విన్ కూడా ఐపీఎల్ కెరీర్‌కు ముగింపు పలికాడు. ఆగస్టులో ఐపీఎల్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన అశ్విన్ 187 వికెట్లతో ఐపీఎల్ చరిత్రలో టాప్5 బౌలర్‌లలో ఒకరిగా ఉన్నాడు. 2010, 2011 లో చెన్నై సూపర్ కింగ్స్ టైటిల్ విజయాల్లో అతడు కీలక పాత్ర పోషించాడు. అయితే ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర టీ20 లీగ్‌లలో ఆడతానని అశ్విన్ స్పష్టం చేశాడు.



# స్క్వాష్ ప్రపంచ కప్‌లో ఫైనల్‌కు భారత్

## సింగిల్స్‌ను గెలిచిన వేలవన్, అనహత్

### 3-0 తేడాతో ఈజిప్టు ఓటమి

**న్యూఢిల్లీ:** స్క్వాష్ ప్రపంచ కప్-2025లో ఈజిప్టును ఓడించిన భారత్ తొలి ఫైనల్‌కు చేరుకోవడం ద్వారా చరిత్ర సృష్టించింది. స్క్వాష్ ప్రపంచ కప్ ఫైనల్‌కు భారత్ రెండుసార్లు డిఫెండింగ్ ఛాంపియన్స్ ఈజిప్ట్‌ను 3-0 తేడాతో ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. జాతీయ ఛాంపియన్లు, భారత్‌కు చెందిన వేలవన్ సెంథిల్‌కుమార్ మరియు అనహత్ సింగ్ పురుషుల మరియు మహిళల సింగిల్స్‌ను గెలుచుకున్నారు. సెంథిల్‌కుమార్ 3-0 తేడాతో గెలిచినప్పటికీ, అనాహత్ 3-2 తేడాతో గెలవడానికి తీవ్రంగా పోరాడాల్సి వచ్చింది. అభయ్ సింగ్ 3-1 తేడాతో విజయాన్ని సాధించాడు,పురుషుల ర్యాంకింగ్స్‌లో 45వ స్థానంలో ఉన్న సెంథిల్‌కుమార్, ప్రపంచ 96వ ర్యాంకర్ ఇబ్రహీం ఎల్కబ్బానీని తొలి మ్యాచ్‌లో 7-1, 7-3, 7-6 తేడాతో ఓడించి భారత్‌ను ఆధిక్యంలోకి నెట్టాడు. ఇక 17 ఏళ్ల వయసులో ప్రపంచ కప్ అరంగేట్రం చేసిన అనాహత్ సింగ్, 44వ ర్యాంక్‌లో ఉన్న నూర్ హైకల్‌పై 6-7, 7-5, 7-3, 3-7, 7-3 తేడాతో గట్టి పోరాటం చేసి ఆతిథ్య జట్టు ఆధిక్యాన్ని 2-0కి పెంచాడు. ఆ తర్వాత అభయ్ సింగ్ ఆడమ్ హవాల్‌ను 3 -1 (7-5, 6-7, 7-5, 7-6) తేడాతో ఓడించి ఫైనల్‌లో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు.

# పాక్ ఘోర ఓటమి

## టీమిండియా 90 రన్స్‌తో ఘన విజయం

**న్యూఢిల్లీ:** అండర్ 19 ఆసియా కప్-2025లో యువ భారత్ జట్టు జోరు కొనసాగుతోంది. ఈ టోర్నీలో భాగంగా ఆదివారం దాయాది పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 90 పరుగుల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత్ బౌలర్లు అద్భుతం చేశారు. 241 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక పాకిస్థాన్ చతికల పడింది. భారత్ బౌలర్ల ధాటికి పాక్ జట్టు 41.2 ఓవర్లలో కేవలం 150 పరుగులకే కుప్పకూలింది.

దీపేష్ దేవేంద్రన్, కన్షిక్ చౌహాన్ తలా 3 వికెట్లతో పాక్ పతనాన్ని శాసించారు. వీరితో పాటు, కిషాన్ కుమార్ 2 వికెట్లు సాధించారు. పేసర్ దీపేష్ పవర్ ప్లేలోనే మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని దెబ్బతీశాడు. పాక్ బ్యాటర్లలో హుజైఫా అహ్సాన్ (70) ఒంటరి పోరాటం చేశాడు. ఓ వైపు వికెట్లు పడతున్నప్పటికీ అహ్సాన్ మాత్రం దూకుడుగా ఆడి భారత్‌పై వత్తిడి పెంచాడు. ఈ క్రమంలో వైభవ్ సూర్యవంశి క్యాచ్‌లో పెవిలియన్‌కు పంపాడు. పాకిస్తాన్ ఇన్నింగ్స్‌లో ముగ్గురే ముగ్గురు డబుల్ డిజిట్ స్కోర్ సాధించారు. అంతకు ముందు బ్యాటింగ్ చేసిన భారత్ 46.1 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌట్ అయింది. భారత్ బ్యాటర్లలో ఆరోన్ జార్జ్ (85) టాప్ స్కోరర్‌గా నిలవగా, కనిష్క్ చౌహాన్ (46), మాత్రే (38) రాణించారు. ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశి (5) చెత్త ప్రదర్శన చేశాడు. పాక్ బౌలర్లలో మహ్మద్ సయ్యామ్, అబ్దుల్ సుభాన్ తలా మూడు వికెట్లు పడగొట్టారు.



# వాణిజ్యం

## టాప్ 8 కంపెనీల్లో రూ.79వేల కోట్లకుపైగా మార్కెట్‌క్యాప్ పతనం!

**ముంబయి, డిసెంబరు 14:** దేశీయ స్టాక్ మార్కెట్లలో గత వారంనెలకొన్న ధోరణులతో టాప్10 కంపెనీలలో 8 సంస్థలు భారీగా నష్టపోయాయి. ఈ కంపెనీలు వారం వ్యవధిలో తమ మార్కెట్ విలువల నుంచి ఏకంగా రూ.79,129.21 కోట్లను కోల్పోయాయి. ఇందులో బజాజ్ ఫైనాన్స్ అత్యధికంగా నష్టపోయిన సంస్థగా నిలిచింది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ విలువ ఏకంగా రూ.19,289.7 కోట్లు తగ్గి రూ.6,33,106.69 కోట్లకు చేరింది. ఆ తర్వాతి స్థానంలో ఐసీఐసీఐ బ్యాంక్ ఉంది. ఈ బ్యాంకు మార్కెట్ క్యాప్ రూ.18,516.31 కోట్లు క్షీణించి రూ.9,76,668.15 కోట్లకు పడిపోయింది. ఇదే బాటలో భారతీ ఎయిర్‌టెల్ రూ.13,884 కోట్లు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.7,846 కోట్లు, ఇన్ఫోసిస్ రూ.7,145 కోట్లు, టీసీఎస్ రూ.6,783 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.4,460




కోట్లు కూడా భారీగా నష్టపోయాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి)కూడా రూ.1,201కోట్లు నష్టపోయింది. ప్రతికూల మార్కెట్ పరిస్థితుల్లోనూ రిలయన్స్ ఇండస్ట్రీస్, లార్సెన్ టూబ్రో (ఎల్ అండ్‌టి) లాభాలను నమోదు చేశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.20,434.03 కోట్లు పెరిగి రూ.21,05,652.74 కోట్లకు చేరుకుంది. లార్సెన్ అండ్ టూబ్రో విలువ రూ.4,910.82 కోట్లు పెరిగి రూ.5,60,370.38 కోట్లకు చేరింది. గత వారం బీఎస్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్ సెన్సెక్స్ 444.71 పాయింట్లు (0.51 శాతం) పడిపోవడం ఈ నష్టాలకు ప్రధాన కారణం. మార్కెట్ ఒడిదొడుకులకు గురైనప్పటికీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్,రిలయన్స్, టీసీఎస్ సంస్థలు దేశంలోఅత్యంత విలువైన కంపెనీలుగా స్థానాలను నిలబెట్టుకున్నాయి.

## 2510.86 మిలియన్ డాలర్ల

# జ్యుయెలరీ ఎగుమతులు!

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** దేశవ్యాప్తంగా గతనెలలో జెమ్స్ అండ్ జ్యుయెలరీ ఆభరణాల ఎగుమతులు 2510.86 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఒక్క నవంబరునెలలోనే 19.64శాతం పెరిగినట్లు అసోసియేషన్ వెల్లడించింది. గత ఏడాది ఇదే నవంబరునెలలో 2098.59 మిలియన్ డాలర్లకంటే గణనీయంగా ఎగుమతులు వృద్ధిచెందినట్లు సంఘం ప్రకటించింది. ఇదేరంగంలో స్థూల దిగుమతులు



కూడా నవంబరునెలలో 1894.92 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. గత ఏడాది నవంబరునెలలో 1393.23 మిలియన్ డాలర్లకంటే 36.01 శాతం పెరిగినట్లు జిజెపిఇసి ప్రకటించింది. ఏప్రిల్‌నుంచి నవంబరు నవలవరకూ స్థూల ఎగుమతులు 18867.43 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. స్వల్పంగా అంటే 0.07శాతం పెరిగాయి. గత ఏడాది ఇదే కాలంలో 18854.83 మిలియన్ డాలర్లుగా ఉన్నట్లు సంఘం నివేదిక విడుదలచేసింది. అలాగే ఏప్రిల్‌నుంచి నవంబరువరకూ దిగుమతులు కూడా పెరిగాయి. 6.87శాతంపెరిగి 12,932.06 మిలతియన్ డాలర్లనుంచి 13,820.863 మిలియన్ డాలర్లకు చేరినట్లు వెల్లడించింది. ఎగుమతి దిగుమతుల గణాంకాలను పరిశీలిస్తే దేశీయంగా డిమాండ్‌పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఉత్పత్తిరంగంలో చురుకుదనం, కస్టమర్లలో విశ్వాసం పెరగడంతోపాటు పండుగలు, పెళ్ళిళ్ల సీజన్ రానుండటంతో మరింతగా ఎగుమతిదిగుమతులుండవచ్చని చెపుతోంది. కామా జ్యూయెలరీ ఎండి కోలిన్‌షా మాట్లాడుతూ గ్లోబల్‌స్థాయిలో సవాళ్లు ఎదురవుతున్నా భారతజెమ్స్ అండ్ జ్యూయెలరీ సెక్టార్ గణనీయమైన వృద్ధిని నమోదుచేసిందన్నారు. భౌగోళిక ఉద్రిక్తతలు ఎదురయినప్పటికీ అంతర్జాతీయ మార్కెట్లలో మంచి డిమాండ్‌ను సాధించిందన్నారు. భారత్, యుఎఇ సెపా వంటి ఒప్పందాలుకూడా ఎగుమతులకు దోహదంచేసినట్లు జెమ్స్ అండ్ జ్యూయెలరీ ప్రోత్సాహక మండలి ప్రకటించింది.

# టోకు ధరల సూచీ ద్రవ్యోల్బణ గణాంకాలే కీలకం!

## ఈ వారం మార్కెట్లను ప్రభావితం చేయనున్న అంశాలివే!




**ముంబయి, డిసెంబరు 14:** అంతర్జాతీయ మార్కెట్ల ధోరణులు, టోకుధరలసూచీ ద్రవ్యోల్బణం గణాంకాలు, భారత్ అమెరికా వాణిజ్యచర్చల్లో పురోగతి వంటి అంశాలు వచ్చే వారం మార్కెట్లను ప్రభావితంచేయనున్నాయి. అదేవిదంగా అంతర్జాతీయంగా డాలర్ రూపాయి చెలామణి కదలికలతోపాటు విదేశీ ఇన్వెస్టర్ల కార్యకలాపాలపైనా ట్రేడర్లు ఆసక్తి పెంచుతారని తెలుస్తోంది. గత వారం మార్కెట్లలో ఇన్వెస్టర్లు భారీగానే కుమ్మరించారు. బిఎస్ఇలో జాబితా అయిన మొత్తం కంపెనీల విలువ రూ.466.6 లక్షలకోట్లనుంచి ఒక్కసారిగా రూ.470 లక్షలకోట్లకు పెరిగింది. అంటే మూడు లక్షలకోట్లు ఒక్కరోజులోనే పెరిగింది. ఈవారం కూడా ఇన్వెస్టర్ల తీరుతెన్నులు కొంత కీలకం అవుతాయని అంచనా. కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ టోకుధరల సూచీ ద్రవ్యోల్బణ గణాంకాలు ఈనెల 15వ తేదీ అంటే సోమవారం విడుదలచేస్తులంది. భారత్ అమెరికాలు నిర్మాణాత్మక వైఖరితో వాణిజ్యచర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే భారత ప్రతినిధుల బృందం అమెరికా డిప్యూటీ ట్రేడ్ రిప్రజెంటేటివ్ రిక్ స్విట్జర్‌బృందంతో చర్చలు జరుపుతున్నది. రెండుదేశాలకు ప్రయోజనకారి కాగల వాణిజ్య ఒప్పందం దిశగా వేగంగా చర్చలు కొనసాగుతున్నాయని రెండుదేశాలప్రతినిధులు చెపుతున్న సంగతి తెలిసిందే. కేంద్రం తరపున వాణిజ్య మంత్రి పియూష్‌గోయల్‌బృందం చర్చలు జరుపుతున్నది. అయితేఈ ఏడాది మార్కెట్లలో విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు నికర విక్రేతలుగా మారారు. గడచిన రెండుదశాబ్దాల్లో ఎన్నడూలేనంతగా పెట్టుబడులు విత్‌డ్రాచేసారు. ఈ అంశాలకుతోడు గ్లోబల్ మార్కెట్ల ధోరణులపైనా ఇన్వెస్టర్లు దృష్టిపెట్టే అవకాశాలున్నాయి.




# కృత్రిమమేధలో భారత్ నం.3

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ తన సత్తా చాటుతోంది. ప్రపంచంలోనే అత్యంత పోటీ ఉన్న దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. అమెరికాకు చెందిన ప్రతిష్మాత్మక స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ఆదివారం విడుదల చేసిన గ్లోబల్ ఏఐ వైబ్రెన్సీ టూల్ ర్యాంకింగ్స్‌లో భారత్‌కు 3వ ర్యాంకు ఇచ్చిది. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ రంగం, నైపుణ్యం కలిగిన మానవ వనరులే ఈ ఘనతకు కారణమని సంస్థ పేర్కొంది. ఈ జాబితాలో 78.6 స్కోర్‌తో అమెరికా అగ్రస్థానంలో ఉండగా, 36.95 స్కోర్‌తో చైనా రెండో స్థానంలో నిలిచింది. భారత్ 21.59 స్కోర్‌తో మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ క్రమంలో దక్షిణ కొరియా, యూకే, సింగపూర్, జపాన్, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్ వంటి అనేక అభివృద్ధి చెందిన దేశాలను భారత్ అధిగమించడం విశేషం.పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డి), టాలెంట్ లభ్యత, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ విధానాలు వంటి అనేక కీలక అంశాలను విశ్లేషించి స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ఈ ర్యాంకులను కేటాయించింది.
ముఖ్యంగా టాలెంట్ విభాగంలో భారత్ ప్రపంచంలోని టాప్3 దేశాల్లో ఒకటిగా నిలిచింది. దేశంలోని ఇంజనీర్లు, డెవలపర్‌ల భారీ సంఖ్య ఇందుకు దోహదపడింది. తక్కువమధ్య ఆదాయ దేశాల కేటగిరీలో ఈ జాబితాలో ఇంత ఉన్నత స్థానంలో నిలిచిన ఏకైక దేశం భారత్ కావడం గమనార్హం. ఏఐ రంగంలో భారత్‌లో పెరుగుతున్న పెట్టుబడులు, బలమైన స్టార్టప్ వ్యవస్థ, విస్తరిస్తున్న పరిశోధనలకు ఈ ర్యాంకింగ్ అద్దం పడుతోంది.



## ప్రపంచంలోనే అతిపెద్ద

# ఐపిఓ స్పేస్‌ఎక్స్!

**న్యూయార్కు, డిసెంబరు 14:** ప్రపంచంలో అతిపెద్ద ఐపీఓగా రికార్డు అయిన సౌదీ ఆరాంకోను దాటి ఇపుడు ఎలాన్ మస్క్ స్పేస్ ఎక్స్ ఐపిఓ రాబోతోంది. సౌదీ ఆరాంకో 25 బిలియన్ డాలర్లకుపైగా నిధుల్ని ఐపీఓ ద్వారా సమీకరించింది. ఈ రికార్డును బ్రేక్‌చేయాలన్న లక్ష్యంతోనే ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ స్పేస్‌ఎక్స్ వచ్చే ఏడాదే భారీ ఐపిఓకు వస్తోంది. ప్రస్తుతం కంపెనీ ఇందుకోసం అంతర్గత వాటా విక్రయం ప్రక్రియ చేపడుతోంది. దీని ద్వారా కంపెనీ విలువను ఏకంగా 800 బిలియన్ డాలర్లుగా భారత కరెన్సీలో సుమారు రూ. 72 లక్షలు కోట్లుగా అంచనా వేస్తున్నారు. దీంతో చాట్‌జీపీటీ పేరెంట్ కంపెనీ ఓపెన్ ఏఐ రికార్డును దాటి అత్యంత విలువైన ప్రైవేట్ కంపెనీగా నిలుస్తోంది. స్పేస్ ఎక్స్ ప్రస్తుతం అర్హులైన వాటాదారుల నుంచి మొత్తం 2.56 బిలియన్ డాలర్లను సమీకరించాలనినిర్ణయించింది. భారత కరెన్సీలో రూ. 23 వేల కోట్లకుపైగా విలువ ఉంటుంది. షేర్ల కొనుగోలు ప్రాసెస్ ఇప్పటికే ప్రారంభించింది. ఇక్కడ ఒక్కో షేరుకు 421 డాలర్లు అంటే రూ. 38 వేల వరకు చెల్లించేందుకు ఆఫర్ ఇచ్చింది. స్పేస్ ఎక్స్ సీఎఫ్ఓ బ్రెట్ జాన్సెన్ వాటాదారులకు ఒక లేఖ రాశారు. ఐపీఓ ద్వారా సమీకరించే నిధుల్ని స్టార్ షిప్ రాకెట్ అభివృద్ధి, ఏఐ డేటా సెంటర్స్ వంటి లక్ష్యాల కోసం ఉపయోగించనున్నట్లు తెలిపారు. ప్రతిపాదిత ఐపీఓ ద్వారా కంపెనీ 25 బిలియన్ డాలర్లకుపైగా సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది భారత కరెన్సీలో చూస్తే రూ. 2.25 లక్షల కోట్లకు పైనే ఉంటుంది. సౌదీ ఆరామ్‌కోను అధిగమించి ప్రపంచంలోనే అతిపెద్ద ఐపీఓల్లో ఒకటిగా నిలవనుందన్న అంచనాలు జోరందుకున్నాయి.

## రూ.150లక్షలకోట్లతో

# ఇన్‌ఫ్రాపైప్‌లైన్ ఏర్పాటు?

## కేంద్రానికి పారిశ్రామిక మండలి సిఐఐ ప్రతిపాదన

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** పెట్టుబడుల ఆధారిత ఆర్థికవృద్ధిని మరింత సాధించేందుకువీలుగా వచ్చే బడ్జెట్‌లో సంస్కరణలు తీసుకురావాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ కేంద్రానికి సూచించింది. కొత్త బడ్జెట్‌లో పెట్టుబడుల వృద్ధికి ఆస్కారం ఇచ్చే మార్పులు చేర్పులు ఉండాలని ప్రతిపాదించింది. మూలధన వ్యయాన్ని 12శాతం పెంచాలని సూచించింది. అలాగే రాష్ట్రాలకు కూడా ఈ వ్యయం పది శాతంపెంచాలని 2026-32 ఐదేళ్ల కాలానికిగాను 150 లక్షలకోట్లతో నేషనల్ ఇన్‌ఫ్రా పైప్‌లైన్ (ఎన్ఐపి)ని ప్రారంభించాలనిసూచించింది. పెట్టుబడులపరంగా గణనీయమైన రికార్డుసాధించిన కంపెనీలకు పన్నులరూపంలో కొంత ఊరటకల్పించాలనికోరాయి. అలాగే ఎన్ఆర్ఐ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్‌ఫండ్‌ఱ ఏర్పాటుచేయాలని, కొత్త మూలధన వ్యయం పెంచేందుకువీలుగా ఎంఎస్ఎంఇలకుఇతర ఉత్పత్తి రంగాలకు కూడా ప్రోత్సాహకాలుండాలని, కనీస ప్రత్యామ్నాయ పన్ను జోలికి వెళ్లకుండా రాయితీలు ఉండాలని సూచించారు. ఆర్థికవృద్ధికి ప్రైవేటు, విదేశీ పెట్టుబడులు అత్యవసరమని తదుపరి వృద్ధిదశను అధిగమించాలంటే ఎంతో కీలకం అవుతుందని అన్నారు. ఇందుకోసమే ప్రభుత్వ ప్రైవేటు సంస్థను ఏర్పాటుచేసి 49శాతం ప్రభుత్వ వాటాను ఏర్పాటుచేయాలనిసూచించారు. అలాగే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు రెండునెలలనుంచి మూడునెలల్లోపే ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ లభించేలా చూసుకోవాలని, భారీ స్థాయి పెట్టుబడులకు కూడా ఈ సూత్రం వర్తింపచేయాలని సిఐఐ కేంద్రానికి ప్రతిపాదనలుచేసింది. కొత్త సంవత్సరంలో పెట్టుబడుల ఆధారిత ఆర్థిక వృద్ధి వ్యూహం ఎంతో అవసరమని సంస్థాగత సంసనకరణలు భారత తదుపరి అభివృద్ధి దశను నిర్దేశిస్తాయని సిఐఐ విశ్లేషించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.